KLV0001M243

జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి: 41 సంచిక: 13 విజయవాడ 5-11-2008 పేజీలు : 12 వెల: రు 5.00

[illegible] పేజీలలో.....

- సామ్రాజ్యవాద దోపిడీకి నెలవైన రెడీమెడ్ దుస్తుల పరిశ్రమ
- జెట్ ఎయిర్‌వేస్ ఉద్యోగుల తొలగింపు-ఆందోళన
- పోరుబాటలో ఉపాధ్యాయులు
- సూక్ష్మ సేద్యంలో ఆహార సాగుకు మంగళం
- కారిడార్ వ్యతిరేక ఉద్యమం ఐక్యంగా సాగాలి
- పాలవాయి కౌలుభూమి సమస్య సాగుదార్ల ఆందోళన

భైంసా, వటోలి ఘటనలు-మతతత్వశక్తులు విసురుతున్న సవాలు

ఆదిలాబాద్‌జిల్లా భైంసా, వటోలి, తదితర గ్రామాలలో 10.10.2008 నుండి జరిగిన మతఘర్షణలు, పోలిస్ కాల్పులు, సజీవ దహనాలు, సమాధుల కూల్చివేతలు, అనంతర పరిస్థితులను సి.పి.ఐ(యం-యల్) రాష్ట్ర నాయకులు కా॥కోటయ్య నాయకత్వాన ఒక పరిశీలనా బృందం 16.10.2008న వెళ్ళి పరిశీలించింది. కర్ఫ్యూ నీడలోనే వివిధ రకాల ప్రజలను కలిసింది. భైంసాకి దగ్గరలోని వాలేగాం అనే గ్రామంలో కూల్చివేయబడిన మసీదును పరిశీలించింది. వటోలి అనే గ్రామంలో అమానుషంగా హత్య చేయబడి. సజీవదహనం చేయబడిన మహబూబ్‌ఖాన్ ఇంటిని పరిశీలించి గ్రామ పెద్దలతో చర్చించింది.

భైంసా ప్రాంతం 1992-96 మతఘర్షణల రీత్యా సున్నితమైన ప్రాంతం. 10.10.2008, ఆ తర్వాత జరిగిన ఘటనల క్రమం ఇలా ఉంది.

10.10.08 మధ్యాహ్నం 2.45ని॥కు భైంసా పట్టణంలోని పంజేషహ జమా మసీదు ముందు నుండి వెళ్ళే రోడ్డు గుండా **దుర్గామాత** విగ్రహ నిమజ్జన ఊరేగింపు సాగుతున్నది. వాస్తవానికి మన దక్షిణ భారత ప్రజలకు వినాయక నిమజ్జన సాంప్రదాయం **ఉంది** కానీ దుర్గామాత నిమజ్జనం ఇటీవల కాలంలో దిగుమతి చేయబడింది. ఊరేగింపులో ముందుభాగంలో 30,40మంది, 20,25 సం॥ల యువకులు మసీదు ప్రాంతం వచ్చేసరికి డప్పులు, బ్యాండు వాయించడమేగాక మసీదుపై పసుపు(బండారు **అంటారు**) చల్లారని దీనితో ఉద్రిక్తత ఏర్పడిందని తెలుస్తున్నది. ఈ కవ్వింపు చర్యలతో మసీదులో అప్పటికే ప్రార్థన ముగించుకొని, **ఉన్న ముస్లిం** యువకులు స్పందించడం, మసీదుపై రాళ్ళుపడటం, మసీదు నుండి కూడా రాళ్ళు విసరడం జరిగింది. తెలంగాణాలోనూ **అంతటా** చాలా కాలంగా ఉన్న సంప్రదాయం ఏమంటే ముస్లింలపెళ్ళి ఊరేగింపులు అయినా హిందువుల ఊరేగింపులు అయినా మసీదు ముందు వచ్చేసరికి బ్యాండు వాయిద్యాలను ఆపి మసీదు దాటాక మరల ఊరేగింపులను యధావిధిగా సాగిస్తారు. కానీ **వీటికి భిన్నంగా దుర్గమాత** ఊరేగింపు బ్యాండు మేళాలతోనే సాగింది. ఈ మొత్తం ఊరేగింపులో కేవలం నలుగురు పోలీసులు-అదీ **ఊరేగింపు వెనక నడుస్తూ వచ్చారు. 10వతేదీ 2.45** ని॥లనుండి 4.30&5గం॥ల వరకూ వేగంగా జరిగిన పరిణామాలలో **గృహదహనాలు, కత్తిపోట్లు, పోలీసుకాల్పులు జరిగాయి. మసీదు** నుండి బస్టాండ్ వైపు సుమారు 127 దుకాణాలు, ముఖ్యంగా **ముస్లిం వ్యాపారుల దుకాణాలు తగలబడ్డాయి. అయితే మంటలకి మతం లేదు** కనుక ఆ దుకాణాలతో పాటుగా ఉన్న హిందూ [illegible] వ్యాపారుల దుకాణాలు కూడా తగలబడ్డాయి. **మసీదు వెనకభాగంలోని ముస్లింల ఇళ్ళకి నిప్పు అంటించబడింది. తగలబడుతున్న** ఒక **ఇంటిలోని** ముస్లీం కుటుంబం వెనక మట్టిగోడను పగులకొట్టుకొని బయటకు రావడానికి, **బయటకు వచ్చిన వార్ని కాపాడింది** హిందు కుటుంబాలే. సాధారణ ప్రజలు ఇంత ఉద్రిక్తతలోనూ మతతత్వంకి వ్యతిరేకంగానే ఉన్నారనడానికి ఇది ఒక **ఉదాహరణ.**

[illegible] ప్రాంతం ఇళ్ళు, దుకాణాలు తగలబడుతున్న గుంపు వైపుగాక దీనికి వ్యతిరేకంగా సమీకృతమౌతున్న ముస్లీంలవైపు పోలీసుల తుపాకులు కాల్చారని చెపుతున్నారు. ఈ కాల్పులలో మొదటి గుండుకి అబ్దుల్ ఖయ్యాం అనే 19-20 సం॥ల యువకుడు చనిపోయాడు. మరో గుండుకి అబ్దుల్ సమీ అనే మరో యువకుడు మరణించాడు. చనిపోయిన ఈ సమీ బావ కూడా 1996 బాబ్రి మసీదు కూల్చివేత సందర్భంగా చనిపోయిన 16 మందిలో ఒకడు. **ఈ విధంగా ఒకే కుటుంబంలో అప్పుడూ, ఇప్పుడూ** కూడా మరణం సంభవించింది. జరిగిన ఘర్షణలో భైంసాలోని రాజీవ్‌నగర్‌కి చెందిన ఎన్నార్ భూటాన్ అలియాస్ బూటాసింగ్ అనే అతను కత్తిపోట్లకి గురై మరణిస్తే, అతని సోదరుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ భూటాసింగ్ ఉత్తరప్రదేశ్‌లోని ఘోరక్‌పూర్ నుంచి వచ్చి ఇళ్ళకు రంగులు వేసే నిపుణుడు. ఇతనికి పుట్టిన ముగ్గురు ఆడపిల్లలలో ముందు పుట్టిన ఇద్దరిలో ఒకరు అంధత్వంతోనూ, మరొకరు పాక్షిక అంధత్వంతోనూ పుట్టారు. ఇటీవల పుట్టిన పాపకి అలాంటి సమస్యలు లేవని తెలిసి ఈ దుర్గామాత విగ్రహంను పెట్టటంలో ముఖ్యపాత్ర వహించాడు. 10వ తేదీ ఘర్షణలో మరణించాడు. ఈ విధంగా ఆ రోజు జరిగిన ఘర్షణలో 25మంది వరకూ తీవ్రంగా గాయపడ్డారు.

భైంసా ఘటనలు జరిగాక భైంసా మండలంలో వటోలి అనే గ్రామంలో 11వ తేదీ రాత్రి ఆ గ్రామంలో ఉన్న ఒకే ఒక్క ముస్లీం కుటుంబం మహబూబ్‌ఖాన్ ఇంటికి నిప్పు అంటుకొంది. మంటలు మండే సమయానికి ఇంటి వెనుక ఉన్న అమ్మవారి గుడి వద్ద భజనలు జరుగుతున్నాయి. మంటలు కనపడగానే గ్రామ ఉపసర్పంచ్ జాదవ్ జగత్‌రావు "ఫైర్ సర్వీసుకి ఫోను చేసామని వాళ్ళు వచ్చాక మంటలు ఆర్పారని, కరెంటు, గ్యాసుస్టౌవు ఉంది కనుక ఎవరినీ మంటలు ఆర్పడానికి వెళ్ళవద్దని చెప్పామని, తెల్లవారి మహబూబ్‌ఖాన్ బంధువులు వచ్చి చూస్తే ఇంటిలో మహబూబ్‌ఖాన్, ఆయన భార్య, కూతురు రిజ్వానా, మరో ముగ్గురు చిన్నారులు మంటలలో కాలాపోయారని" చెప్పాడు. వాస్తవానికి మహబూబ్‌ఖాన్ కాలును కుక్కలు గ్రామం పక్కన పొలాల్లో లాక్కొని వెళ్ళినట్లుగా పడి ఉందని ఆ ఇంటి వద్దనున్న పోలీసులు చెప్పారు. ఎత్తు తక్కువతో కేవలం 3 గదులు, ముందుగది ఒక దుకాణంలాగా ఉండే చిన్న ఇల్లు మహబూబ్‌ఖాన్‌ది. మంచి దర్జీ అని అందువల్లనే గ్రామస్తులు పూర్వం ఆయన్ని ఆ గ్రామంలోకి పిలిపించుకొని నివశించమని కోరారుట. మహారాష్ట్రకి చెందిన సైలేన్‌బాబాన్ మహబూబ్‌ఖాన్ భక్తుడు. గ్రామంలో ఎవరికి దడుపు జర్వం వచ్చినా అతని వద్ద తాయత్తులు తీసుకొంటారు. అతని పెద్ద కొడుకు మిలటరీలో ఉండి, చిన్న కొడుకు, ఇంకో కూతురు చదువుల నిమిత్తం దూరంగా ఉండటం వలన ఆ కుటుంబం నుంచి ముగ్గురు మాత్రమే మిగిలారు. దేశభక్తి గురించి గొప్పగా చెప్పుకునే వారు, వారి అర్థంలో దేశరక్షణ బాధ్యతల్లో ఉండి మిలటరీలో వున్న ఒక మైనార్టీ మతానికి చెందిన కుటుంబం పట్ల ప్రదర్శించిన 'ఔదార్యం' ఇది. ఇపుడు మీడియాలో 1996 నాటి ఘర్షణలో మహబూబ్‌ఖాన్ నిందితుడు అని ప్రచారం జరుగుతోంది. నిజంగానే మహబూబ్‌ఖాన్ నిందితుడు అయితే అప్పటికి పుట్టని ఈ చిన్నారులు, మహిళలు ఏ నేరం చేశారు? మహబూబ్‌ఖాన్ ఇంటికి ముందు వెనుక ఇళ్ళు ఉన్నాయి. ఎవరికీ చిన్న పిల్లలు అరుపులు సైతం వినపడలేదు అంటున్నారు. 16.10.2008న ఆ గ్రామానికి ఈ పరిశీలనా బృందం వెళ్ళి తిరిగి వచ్చేటప్పటికి రాత్రి అయింది. అప్పుడే మహబూబ్‌ఖాన్ ఇంటి ఇవతలకల ఒక కరెంట్ తీగ షార్ట్ సర్క్యూట్ అయి తెగిపడింది. వెంటనే చుట్టుపక్కల జనం బ్యాటరీ లైట్లతో వచ్చి ఆ దారిన ఎవరన్నా వచ్చి వైర్లు తొక్కుతారేమోనని ఒకరికొకరు జాగ్రత్తలు చెప్పుకున్నారు. ఇంత చిన్న సంఘటనకి అంత జాగ్రత్తలు తీసుకొన్నవారు మహబూబ్‌ఖాన్ ఇల్లు తగలబడుతుంటే స్పందించకపోవడం గమనించాల్సిన విషయం. వెళ్ళిన పరిశీలనా బృందం గ్రామపెద్దలతో వటోలి గ్రామంలో జరిగిన ఘాతుకం యొక్క తీవ్రతను వివరించి ఎవరి పాత్ర దీనిలో ఉందో గ్రామం అంతా కళ్ళు తెరిస్తే అర్థం అవుతుందని, ఇప్పటికైనా జరిగిన విషయాలను పరిశీలించి వ్యవహరించమని విజ్ఞప్తి చేసింది.

అదే విధంగా భైంసా నుండి బాసర వెళ్ళే దారిలోని దేగాం గ్రామం ప్రక్కనేగల వాలేగాం గ్రామం, కేవలం 5-6 ముస్లీం పేద కుటుంబాలు నివశిస్తున్న గ్రామం.(మొత్తం 200 కుటుంబాలపైనే ఉండే గ్రామం) భైంసా ఘటనల అనంతరం ఆ గ్రామంలోని మసీదు ఒక అర్థరాత్రి దాడికి గురైంది. మసీదు ప్రహరీగోడ, పై భాగం గోడలు పొడిచి కూల్చివేయబడ్డాయి. తలుపులు కాలపెట్టారు. ఈ ఘటనతో ఆ గ్రామంలోని 6 ముస్లీం కుటుంబాలు భయంతో గ్రామం విడిచి పారిపోయారు. అలాగే తానూరు మండలంలోని ఎవ్వి అనే గ్రామంలో ఇదే విధంగా మసీదు కూల్చివేయబడింది. ఈ విధంగా మహారాష్ట్రలోని నాందేడ్‌జిల్లాలో, ఆదిలాబాద్ జిల్లాలలో వివిధ ప్రాంతాలలో ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరిగాయి. ధర్మాబాద్ పట్టణంలో ఎన్నడూ లేని విధంగా దుర్గమాత విగ్రహాన్ని ప్రదర్శనను మసీదు ముందు నుండి తీసుకొని వెళ్లేలా ప్రదర్శన దారిని మళ్ళించాలని ప్రయత్నించినపుడు హిందు, ముస్లీం పెద్దలు సమష్టిగా వ్యవహరించి నిరోధించారు.

(తరువాయి 2వ పేజీలో)

సంపాదకీయం

మెట్రోరైలు ప్రాజెక్టును రద్దు చేయాలి!

హైద్రాబాదు నగర ట్రాఫిక్ నరకానికి మరో పేరు. ట్రాఫిక్ జామ్‌లలో చిక్కుకుపోయి ప్రయాణం సాగకపోవటం వాహనదారుల సమస్య. పాదచారులూ, సైక్లిస్టులు ప్రాణాలరచేత పట్టుకుని రోడ్డెక్కాల్సిన స్థితి. ఒక పెద్ద ప్రమాదం జరగ్గానే హడావుడిగా క్రమబద్ధం చేసే పేరిట కొత్త నియమాలు ప్రకటించటం, మరోవైపు రోడ్లు వెడల్పు చేసే కార్లు పరుగులు తీసే ఏర్పాట్లు చెయ్యటం వంటి ప్రదర్శనాత్మక చర్యలు తీసుకుంటారు. వెడల్పు చేసిన రోడ్లలో కూడా ఫుట్‌పాత్‌లుండవు. ఎక్కడా సరైన బస్టాపులుండవు. ప్రజాజీవనం పట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరి ఫలితమిది.

కొత్తగా ఏర్పడిన రాష్ట్రపు రాజధానిగా హైద్రాబాదు నగర పెరుగుదలకు అనుగుణ్యంగా ఒక ప్రణాళికను రచించుకుని అమలు చెయ్యాలన్న ఆలోచన ప్రభుత్వం చెయ్యలేదు. 1965లో పాకిస్తాన్‌తో యుద్ధం తర్వాత కొన్ని కీలక పరిశ్రమలను సరిహద్దులకు దూరంగా దక్షిణభారతంలో నెలకొల్పాలని కేంద్రం నిర్ణయించింది. దానిలో భాగంగానే డి.ఆర్.ఎల్, బి.హెచ్‌ఇఎల్, ఇసిఐఎల్, ఎన్ఎఫ్‌సి వంటి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు హైద్రాబాదులో ఏర్పాటయ్యాయి. అప్పుడన్నా ఒక ప్రణాళికను రచించుకోలేదు. నగరం నుండి వెలుపలకు వెళ్లే రైల్వే మార్గాల దాపునే పై పరిశ్రమలు నెలకొల్పారు. వీటి సమీపాన ఏర్పడే టౌన్‌షిప్‌లను ఈ రైల్వే లైన్లకు దాపున నిర్మించి వుంటే రైల్వేలు ప్రజారవాణా వ్యవస్థగా ఏర్పడి వుండేవి (ఉదా.కూకట్‌పల్లి హౌసింగు బోర్డు కాలనీని 'వాడి' వెళ్లే రైల్వే లైను ప్రక్కన నిర్మించాల్సింది. కాగా బొంబాయి రహదారి వైపుకు నిర్మించారు). **అలాగే ఆనాడే** నాంపల్లి నుండి చార్మినార్ మీదుగా హబ్సిగూడాకు కనీసం హైకోర్టు మీదుగా మలక్‌పేట వరకూ రైల్వేలైను వేసి వుంటే ఒక రింగు రైల్వే, దాని నుండి నాలుగువైపులకు రైల్వేలైన్లు వుండేవి. వీటిపై నివాస కాలనీలు, పారిశ్రామికవాడలు నిర్మించి వుంటే, రింగు రైల్వే చుట్టూ ప్రభుత్వ, వాణిజ్య కార్యాలయాలు నిర్మించి వుంటే నగరంలో సగం ట్రాఫిక్ తగ్గిపోయి వుండేది. రైల్వేకు అనుసంధానించి **సిటీబస్సులు నడపటం** సాధ్యమయ్యేది. ఇలాంటి ప్రజారవాణా వ్యవస్థ ఏర్పాటూ, నిర్వహణా విధానమన్నది ఆనాడే కాక యీనాటికీ ప్రభుత్వానికి లేదు.

ఇంతేకాక నగరం గుండా వెళ్లుతున్న జాతీయ రహదారుల వెంబటి లేఅవుట్లకు రాజకీయ, ఆర్థిక ప్రాబల్యంతో అనుమతులివ్వటంతో నగరం ఒక నక్షత్రంలా విస్తరించుకుంటూపోయింది. ఫలితంగా ప్రయాణ దూరాలు పెరిగిపోవటమేకాక ఒక కేంద్ర **ప్రాంతం గుండానే** అన్నివైపులా ట్రాఫిక్ ప్రయాణించాల్సి వస్తుంది. ఆర్టీసి సిటీ బస్సులు ప్రతిరోజూ 30 లక్షలమంది ప్రయాణీకులను చేరవేస్తుండగా వారిలో 73శాతంమంది 12 కి.మీలోపు ప్రయాణిస్తున్నారు. ఇటీవలే ప్రారంభమైన ఎంఎంటిఎస్ రోజు లక్షా 60వేలమందిని చేరవేస్తున్నది.

ప్రజారవాణా వ్యవస్థను ఆర్థిక లాభనష్టాల లెక్కలతో చూడకూడదు. అభివృద్ధి చెందిన దేశాలలో కూడా ఇవి ప్రభుత్వ సబ్సిడీతో నడుస్తున్నాయి. ప్రత్యక్షంగా సబ్సిడీ ద్వారా ఆర్థికంగా లోటుగా కన్పిస్తుంది. వ్యక్తిగత వాహనాల వాడకం తగ్గుదల వల్ల అయ్యే ఇంధన ఆదా, రహదారుల భద్రత వల్ల, అకాల మరణాలతో ఉత్పత్తి పై చెడు ప్రభావం తగ్గుదల, వాయుకాలుష్యం అదుపులో వున్నపుడు ఏర్పడే ఆరోగ్యకర వాతావరణం, అందువల్ల మెరుగుపడే నగరవాసుల ఆరోగ్యం-ఈ పరోక్ష లాభాలతో పోల్చి చూసినప్పుడు ప్రజారవాణా వ్యవస్థకిచ్చే సబ్సిడి లెక్కలోకి రాదు.

అయినా అటు కేంద్ర ప్రభుత్వంగానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వంగానీ ప్రజారవాణా వ్యవస్థను పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోకపోగా, వ్యక్తిగత రవాణా వాహనాలను ప్రోత్సహించే విధానాలనే అనుసరిస్తున్నారు. ఈ వ్యక్తిగత వాహనాలలో 80 శాతం వరకూ పది మహానగరాల్లోనే వున్నాయి. అవి పదిశాతం కుటుంబాలకే పరిమితం. అయినా టిడిపి ప్రభుత్వం హయాంలో నగరాలలో రోడ్ల వెడల్పు కార్యక్రమాలన్నీ ఈ కార్లు పరుగులు పెట్టేవిగా చేశారు తప్ప పాదచారులకూ, సైక్లిస్టులకూ, [illegible]బస్సులకూ అనుకూలంగా చెయ్యలేదు. ట్రాఫిక్ అంటే మోటారు వాహనాలే. మోటారు లేని వాహనాలు, పాదచారులూ ట్రాఫిక్ క్రిందకు రాకపోగా, రోడ్డును ఆక్రమించే వారుగా పరిగణిస్తున్నారు. జెఎన్‌యుఆర్ఎం పథకాలంటూ ఇటీవల విజయవాడ, విశాఖలకు రూపొందిస్తున్న బిఆర్‌టిఎస్‌ను చూస్తే పాలకుల ప్రజా వ్యతిరేక వైఖరి అర్థమౌతుంది. 20 కి.మీ దూరం వుండే బి.ఆర్.టి.సి మార్గంలో మిగిలిన ట్రాఫిక్ కోసం 17 ఫ్లై ఓవర్లు కడతారు. అంటే పరోక్షంగా మోటారు లేని వాహనాలను ప్రధాన రహదారిపైకి రాకుండా చేస్తున్నారు. బస్సులు రోడ్డు మధ్య భాగాన ఆగుతాయి. బస్సు ఎక్కాలంటే ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కి దిగాలి. ముసలివారు, పిల్లల్తో వెళ్లే కుటుంబాలకు ఎంత ప్రయాసో చెప్పలేము. దీనికోసం ఎడమవైపు స్టీరింగు వున్న కుడివైపు ద్వారాలున్న ప్రత్యేక బస్సులు కావాలి. అవి కూడా ఏసి బస్సులు, ప్రపంచబ్యాంకు యిచ్చే డబ్బుల్లో 80శాతం ఈ బస్సుల కొనుగోలు రూపంలో ప్రపంచబ్యాంకు ఎంపిక చేసిన కంపెనీకే చేరతాయి. లేదంటే దేశంలో తయారయ్యే బస్సులే వాడాలంటే, మిగిలిన ట్రాఫిక్ ఎడమ వైపునడిస్తే(కీప్ లెఫ్ట్) ఈ బస్సులు దానికి ఎదురుగా కీప్‌రైట్‌గా నడవాలి. దీనికి చట్టం అంగీకరించదు. ఈ ప్రణాళిక రచించిన వారు విజయవాడలో కుటుంబానికొక కారుందనుకుంటున్నారా? ఇదంతా వ్యక్తిగత మోటారు వాహనాల వాడకాన్ని పెంచేదే.

తనకు తట్టకపోయినా, కొన్ని సూచనలు అందినప్పుడన్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదంటే దాని లక్ష్యాలు వేరుగా వున్నాయన్నది స్పష్టమే. వరంగల్లు రీజనల్ ఇంజనీరింగు కాలేజీ రోడ్డు రవాణా విభాగం 1988లో హైద్రాబాదు నగర ట్రాఫిక్‌ను అధ్యయనం చేసి అందించిన సూచనలను పట్టించుకోలేదు. అలాగే హైద్రాబాదుకు మెరుగైన ప్రజారవాణా వ్యవస్థ కొరకు పౌరులు అన్న సంస్థ కూడా అనేక సూచనలు చేసింది. ఆ సూచనల్లో ముఖ్యమైనవి:

(తరువాయి 2వ పేజీలో)

పీడిత జన పక్షపాతి కా॥ఓంకార్‌కు జోహార్లు!



మహత్తర తెలంగాణ రైతాంగ పోరాటయోధుడు, ఎంసిపిఐ వ్యవస్థాపక నాయకుడు, ఎంసిపిఐ(యు) పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి కోలుకొని, ఇక గంటలో డిశ్చార్జి అవుతారనుకొంటున్న సమయంలో ఆకస్మికంగా మరణించడం ఆయన సహచరులను, మిత్రులను, జనసామాన్యాన్ని దిగ్భ్రాంతి పరిచింది.

15 సంవత్సరాల ప్రాయం నుంచి 81వ ఏట మరణించే వరకూ ఓంకార్ నిరంతరం పీడిత జన పక్షపాతిగా వ్యవహరించారు. విద్యార్థి దశలోనే ఆంధ్ర మహాసభ వైపు ఆకర్షితుడైనారు. 1945లో చాకలి ఐలమ్మ పోరాటం, కొమరయ్యల అమరత్వంతో ఉత్తేజితుడై కమ్యూనిస్టు రాజకీయాలవైపు మొగ్గారు. చిన్నవయస్సులో నిజాం వ్యతిరేక, జాగిర్దారీ వ్యతిరేక పోరాటకాలంలో కొరియర్‌గా పనిచేశారు. ఆ తరువాత జనగామ, సూర్యాపేట ఏరియా కమిటీ క్యాంపు ఆఫీసు కార్యదర్శిగా, దళనాయకుడుగా, పార్టీ ఏరియాకమిటీ సభ్యుడుగా బాధ్యతలు నిర్వహించారు. మానుకోట, నర్సంపేట, ఇల్లందు ప్రాంతాలలో ఉద్యమాన్ని విస్తరింపచేయడానికి తీవ్రకృషి చేశారు. కఠినమైన కాలంలో, ఉద్యమాభివృద్ధి క్రమంలో మానుకోట రీజనల్ కమిటీ సభ్యునిగా వ్యవహరించారాయన. రాజకీయంగా ఆంధ్ర థీసిస్‌ను బలపరుస్తూ, తెలంగాణ సాయుధ పోరాట క్రమంలో ఎత్తుగడలను రూపొందించడంలో దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నరసింహారెడ్డి సహచరులుగా ఓంకార్ విశిష్టమైన పాత్ర నిర్వహించారు. పోరాట విరమణను వ్యతిరేకించారు.

తెలంగాణ సాయుధ పోరాటం విరమణ అనంతరం కొనసాగుతున్న తీవ్ర నిర్బంధ పరిస్థితులలో కూడా అజ్ఞాత వాసంలోనే ఉంటూ పార్టీ సహచరులను కాపాడుకుంటూ విజయవాడ చేరారు. పార్టీ ఆదేశం అనంతరం 1951 సంవత్సరాంతంలో మళ్ళీ ములుగు, నర్సంపేట ప్రాంతాలలో ఉద్యమ పునర్నిర్మాణ బాధ్యతలు స్వీకరించి అప్పటికి ప్రజలు సాధించుకున్న పోరాట ఫలితాలను నిలబెట్టేందుకు, పార్టీని పునర్నిర్మించేందుకు అజ్ఞాతవాసంలో పనిచేశారు. 1952 సార్వత్రిక ఎన్నికలలో పిడిఎఫ్(కమ్యూనిస్టుపార్టీపై నిషేధం ఉండటంవలన) అభ్యర్థుల గెలుపునకు కృషిచేశారు. ఓంకార్ విశిష్టపాత్రను అర్థం చేసుకోవాలంటే 1952-62 కాలంలో వరంగల్ జిల్లా రాజకీయాలలోకి వెళ్ళాలి. కౌలుదారి చట్టాన్ని దెబ్బతీసేందుకు భూస్వామ్య శక్తులు ఏకమయ్యాయి. పోలీసులు, పారామిలటరీ బలగాల దన్నుతో భూస్వామ్య గూండాలు రౌడీ రాజకీయాలు సాగించారు. ఈ దశలో ప్రాణాంతక పరిస్థితుల మధ్య ప్రజల హక్కులను సాధించుకునేందుకు ఓంకార్ చేసిన కృషి అమోఘమైనది. నర్సంపేట, మానుకోట ప్రాంతంలో పార్టీని, ప్రజలను నిలబెట్టేందుకు కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా ములుగు నుంచి ఎన్. రాజేశ్వరరావును, నర్సంపేటనుంచి వెంకటేశ్వరరావును గెలిపించుకోవడంలో ఓంకార్ పాత్ర కీలకమైనది.

ఓంకార్ 1972 నుంచి 1994 వరకూ నర్సంపేట నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక అవుతూ వచ్చారు. సిపిఎంలో ఉండగా 1984 వరకూ, 1984 నుంచి ఎంసిపిఐ వ్యవస్థాపక నాయకుడిగా ఉంటూ అసెంబ్లీలో ప్రజల వాణి వినిపించారు. ఎన్నో ప్రమాదకర భౌతిక దాడులను ఎదుర్కొని సహచరులను, మిత్రులను కోల్పోయి తను తీవ్రంగా గాయపడినప్పటికీ ప్రజలపట్ల ఉన్న విశ్వాసాన్ని కోల్పోలేదు. కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత ఆవశ్యకతను గుర్తించడంలో ఎలాంటి మినహాయింపు ప్రదర్శించలేదు. 1994 నుంచి కమ్యూనిస్టు నిర్మాణాల మధ్య ఐక్య కార్యాచరణకు అనుకూలంగా కృషిచేశారు. ముఖ్యంగా 2000 సంవత్సరం నుంచి విద్యుత్ ఆందోళనలో తొమ్మిది వామపక్షాల ఐక్య కార్యాచరణను బలోపేతం చేసేందుకు తీవ్రంగా కృషిచేశారు. ఓంకార్ జీవితాంతం ఆదివాసీ ప్రజల సమస్యలు, హక్కులకోసం స్పష్టమైన దృక్పథంతో పోరాడారు. ఏ సంస్థకు చెందిన ఆదివాసీ ప్రజలైనా, వారిపై ఎలాంటి దాడి జరిగినా వారికి అండగా పెట్టని కోటగా నిలిచారు. వివిధ విప్లవ, ప్రజాతంత్ర శక్తులతో ఏర్పడిన ఆదివాసీ హక్కుల వేదికకు ఆయన రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేశారు. పీడిత జన పక్షపాతిగా నిరంతరం మోగిన ఆయన కంచుకంఠం మూగవోయింది. ఆయన ఆశయ సాధనకు అచంచలంగా నిలవడమే ఆయనకి అందించే నివాళి.

రాష్ట్రకమిటి
సి.పి.ఐ.(ఎం.ఎల్)

మెట్రో... (మొదటి పేజీ తరువాయి)

ఎం.ఎం.టి.ఎస్‌కు ఇప్పటికే పెరుగుతున్న ఆదరణ రీత్యా రెండవ దశను వెంటనే చేపట్టాలి. దీనిని విస్తరించి పటిష్టం చేసేందుకు నాంపల్లి నుండి మలక్‌పేట వరకూ అవసరమైతే భూగర్భ రైల్వేను వేయాలి. ఎంటిఎస్ కోసమే ప్రస్తుత రైల్వే లైనుల ప్రక్కనే డబుల్‌లైను వెయ్యాలి. 1.నాంపల్లి- మలక్‌పేట-కాచిగూడా-సికింద్రాబాద్ 2.సికింద్రాబాదు- లింగంపల్లి- పటాన్‌చెర్వు 3.సికింద్రాబాదు-షంషాబాదు, 4.సికింద్రాబాదు-మేడ్చల్ 5.మలక్‌పేట-దిల్‌షుక్‌నగర్-హయాత్‌నగర్. ఈ రైల్వేలైన్లు వేయటానికి అవసరమయ్యే రైల్వే భూమి వుందనీ, కొన్ని చోట్ల మాత్రమే భూమి సేకరణ అవసరమని డి.ఆర్.ఎం తెలిపారు.

ఎంఎంటిఎస్ రైల్వే స్టేషన్ల నుండి కాలనీలకు సిటీ బస్సులు నడవటం.

హైదరాబాదు నుండి 100కి.మీలోపు రైల్వేలైను మీదనే అనేక చిన్న మధ్యతరహా పట్టణాలున్నాయి. ఈ లైన్లపై హైస్పీడు రైళ్లు నడవాలి.

వేగంగా, పెద్ద సంఖ్యలో ప్రయాణికులను తరలించేందుకూ, ఉన్న వసతిని వినియోగించుకుని, తక్కువ ఖర్చుతో దానిని విస్తరించగల ప్రత్యామ్నాయాన్ని ఈ సూచనలందజేస్తున్నాయి.

అయినా రాష్ట్ర ప్రభుత్వం వీటిని ప్రక్కనపెట్టి మెట్రోరైలు ప్రాజెక్టుకు పచ్చజెండా వూపింది. ఇది 71 కి.మీ దూరం, నేలకు నాలుగంతస్తుల ఎత్తున వుంటుంది. దీనికయ్యే ఖర్చు రూ.12000 కోట్లు. అంటే కి.మీ 169 కోట్ల రూపాయలు. ఈ అంచనాలు కనీసం 30-50శాతం పెరుగుతాయి. దీనికోసం 5వేల వాణిజ్య భవనాలు, 2000 నివాస భవనాలు కూలగొట్టాలి. 12 మీటర్ల ఎత్తున 33 స్టేషన్లను నిర్మించాలి. ఇంతా చేస్తే 2021 నాటికి 25 లక్షల ప్రయాణికులను చేరవేస్తుందని అంచనా. ఇప్పుడు ఆర్టీసి చేస్తున్నంత కూడా చెయ్యదు. పెరిగే ప్రయాణీకుల అవసరాలు తీరాలంటే బస్సులు రెట్టింపవ్వాలి.

ప్రభుత్వం యీ ప్రాజెక్టును ఆదర్శప్రాయమంటున్నది. ఈ ప్రాజెక్టుకు 12వేల కోట్లు ఖర్చయితే, ప్రభుత్వం నుండి సహాయం వద్దనటమేకాక, ఎదురు 30వేల కోట్లు ప్రభుత్వానికిస్తానని కాంట్రాక్టు పొందిన మైటాస్ కన్సార్టియం అంగీకరించింది. నిర్మించటానికయ్యే పెట్టుబడికి మూడురెట్లు ప్రభుత్వానికివ్వటమంటే నాలుగురెట్లు ఎక్కువగా టిక్కెట్టు రేట్లు పెడితే తప్ప కంపెనీకి పెట్టుబడి రాదు. లేదంటే, ప్రభుత్వం అప్రకటితంగా అనేక రాయితీలు ఆ కంపెనీకి కట్టబెట్టి వుండాలి.

34ఏళ్లపాటు దీనిని యిచ్చారు. ఆశించిన దానికంటే ప్రయాణికుల సంఖ్య తగ్గితే ప్రతి ఒక్కశాతం తగ్గదలకూ ఒకేడాది లీజు పెంచాలి. ప్రభుత్వం ఇప్పటికిస్తానన్న 269 ఎకరాలే కాక, ప్రాజెక్టు కోసం కంపెనీ భూమిని సేకరించుకోవచ్చు. దీనిని రియల్ ఎస్టేటుగా అమ్ముకోవచ్చును. స్టేషన్లంటినీ వాణిజ్య భవనాలుగా నిర్మించి అమ్ముకోవచ్చును. 2009 మార్చి నాటికి కంపెనీ 240 కోట్లు ప్రభుత్వానికి చెల్లిస్తుంది. అక్కడినుండి 60 రోజులులోగా స్థలాలను ప్రభుత్వం కంపెనీకి అప్పగించాలి. (భూసేకరణ చట్టం ప్రకారం 90 రోజులు పడుతుంది) ఆలశ్యమైతే ప్రతిరోజుకు 24 లక్షల రూపాయలు కంపెనీకి ప్రభుత్వం పరిహారం చెల్లించాలి. మెట్రో మార్గంలో ఆర్టీసి బస్సులు నడుపకూడదు. రద్దీ సమయంలో అదనపు ఛార్జీ వసూలు చేస్తారు. ఇవి కొన్ని మాత్రమేననీ, ఇలాంటి రాయితీలు యింకొన్ని దాగివున్నాయని, వాటిని బయటపెట్టాలని సిబిపిటి ప్రతినిధి ప్రొ॥సి.రామ చంద్రయ్య విమర్శించారు. ఇది మెట్రో రైలు ప్రాజెక్టు కాదనీ, మెట్రో రియలు ఎస్టేటు ప్రాజెక్టుగా మారిందనీ అన్నారు.

కాంట్రాక్టు పొందిన కంపెనీ వివిధ ప్రైవేటు కంపెనీల కూటమి. రియల్ ఏస్టేటు రంగంలో వున్న మైటాస్, నిర్మాణరంగంలో వున్న నవభారత్, విదేశాలకు చెందిన ఐఎల్ఎఫ్ఎస్, ఇటాల్‌థాయి అన్న నాలుగు కంపెనీలు కన్సోర్టియంగా ఏర్పడి కాంట్రాక్టు పొందాయి. ఈ రంగంలో భారత కంపెనీలు వేటికి అనుభవం లేదు. అనుభవం వున్న ఇటాల్‌థామి కంపెనీతో కలిసి అనుభవమున్నట్లు చూపాయి. కానీ దాని వాటా 5 శాతమ. అసలు నిర్మించేదెవరు? రైలు పెట్టెలు ఎక్కడ నుండి తెస్తారు? ఇవన్నీ తేలాల్సిన ప్రశ్నలు. వీటన్నింటికీ కంపెనీ చెప్పిన సమాధానాలతోనే ప్రభుత్వం సరిపెట్టుకుంది. జెఎన్‌టియు, వరంగల్ ఆర్ఇసిల రవాణా విభాగాల నిపుణులకు దీనిలో ఎలాంటి పాత్ర యివ్వలేదు.

అధికఖర్చు, ప్రయాణికుల పై అధికభారం, రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి లాభం తప్ప ప్రజారవాణాకు తోడ్పడని మెట్రోరైలే ప్రాజెక్టును రద్దు చేయాలి. ప్రత్యామ్నాయంగా చవకైన రవాణా వ్యవస్థను ఎంఎంటిఎస్ నిపుణులు సూచించిన విధంగా విస్తరించాలి. ◈

భైంసా,... (మొదటి పేజీ తరువాయి)

ఈ విధంగా 10.10.2008 నుండి జరిగిన సంఘటనల క్రమం ఉంది. 16-18, 2008న భైంసా, వటోలి తదితర ప్రాంతాలను పరిశీలించిన పరిశీలనా బృందం తన ప్రాథమిక పరిశీలనాంశాలను, డిమాండ్‌లను, ప్రజల విజ్ఞప్తులను జోడించి ఒక ప్రకటన విడుదల చేసింది. అయితే 10 నుంచి కనపడుతున్న సంఘటనలు కాకతాళీయమైనవి కాదు. దీని వెనుక లోతైన వేళ్ళను తన్నుకొనజూస్తున్న ఒక విష వృక్షం ఉంది.

ఈ ఘర్షణల, దాడుల వెనక తక్షణ రాజకీయ స్వప్రయోజనాలు, స్థానిక ప్రయోజనాల నుండి దేశస్థాయిలో ప్రయోజనాలు ఉన్నాయి. 1990ల మత ఘర్షణల నుంచి హిందూ, ముస్లిం మత నిర్మాణాలు సంఘటితం అయ్యాయి. హిందూ మతతత్వ శక్తులు రాజ్యాంగ యంత్రంలోని వివిధ శక్తుల అండతో దూకుడుగా ఉన్నాయి. మైనార్టీ శక్తులు మతతత్వ భావనలతోనే తమలో తాము ముడుచుకొని పోతున్నాయి. భైంసా నగర పాలకసంస్థ యం.ఐ.యం చేతుల్లో ఉంది. 10వ తేదీ ఉద్రిక్తతలు ఏర్పడుతున్న వెంటనే ప్రస్తుత టి.ఆర్.యస్. యం.ఎల్.ఎ నారాయణరావు పటేల్‌కి చెందిన ఫ్యాక్టరీ నుంచి హిందూవాహినికి చెందిన 200 మంది కర్రలు, కత్తులతో మసీదు వైపు దూసుకొచ్చారని ముస్లిం పెద్దలు చెపుతున్నారు. రాబోయే ఎన్నికలు, స్థానిక ఆధిపత్య ఆకాంక్షలు, వైరుధ్యాలు దీనికి తగ్గట్టు ఇరువైపులా నిర్మాణయుత మతతత్వ శక్తుల కార్యకలాపాలు తక్షణ అంశం. మరోవైపు ఇదే సమయంలో ఆ రాష్ట్రంలో జరుగుతున్న మత కల్లోలాలు, ఇదే సమయంలో నాందేడు నుంచి ఇక్కడి వరకూ జరిగిన మసీదుల పైకి దాడి ప్రయత్నాలు చూస్తే ఒక దేశవ్యాపిత రాజకీయ ఎజెండా వీటి వెనక ఉందని స్పష్టపడుతుంది.

భైంసా కన్నా మతతత్వ వికృతరూపం, సమస్య అసలు తీవ్రత గ్రామాలలో ఉంది. వాలేగాంలో కేవలం 6గురు ముస్లిం పేద కుటుంబాలు (మొత్తం 2000 ఇళ్ళలో) నివశించే చోట మసీదు కూల్చివేత, కేవలం ఒకకుటుంబం ఉన్న మహబూబ్‌ఖాన్ కుటుంబం, అందులోని ముక్కుపచ్చలారని చిన్నారులతో సహా అమానుషంగా చంపి, ఇంటిలోనే తగలబెట్టిన, కాల్చివేత, ఇవి చాలా తీవ్రమైన విషయాలు. మతం ప్రాతిపదికన గ్రామాలను పునర్‌వ్యవస్థీకరించదలచుకొని, దానికి భయోత్పాతాన్ని ఆయుధంగా వాడుకోవడం దీనిలో అంశం. వీటితో మైనార్టీ మతస్తులు, గ్రామాలలో మైనార్టీగా ఉండే వారంతా భయంతో వాలెగాంలో జరిగినట్లు గ్రామాలను వదిలి వెళ్ళేలా వాతావరణం సృష్టించబడింది. ముస్లింలేకాక క్రైస్తవులు కూడా 'హిందూవాహిని' శక్తుల దాడులకు గురయ్యారు-మే 23న బ్రదరన్ చర్చికి చెందిన 30మంది ప్రచారకులపై 'హిందూ వాహిని' కార్యకర్తలు దాడిచేశారు.

ఈ మసీదుల కూల్చివేతలు, కుటుంబ సజీవ దహనాలు ఆదిలాబాద్, నిజామాబాద్, నాందేడ్, ఔరంగాబాద్ ఘటనలు, వాలేగాం తరహా పేలుళ్ళు హిందూ టెర్రరిస్టు శక్తుల విధ్వంసక కార్యకలాపాలు అన్నీ యాదృచ్ఛిక సంఘటనలు కావు. మైనార్టీ మతతత్వ శక్తుల టెర్రరిస్టుల చర్యలకి వచ్చిన ప్రతిస్పందనలు కావు. వీటి వెనుక దశాబ్దాల పాటు జరిగిన ఒక ప్రజావ్యతిరేక తాత్విక, రాజకీయ కృషి ఉంది. స్వాధ్యాయి పరివార్ అనే సంస్థకి గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రలోని నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలన్నింటిలోనూ, విదేశాలలో విస్తారమైన పలుకుబడి కలిగి వేలాది మంది విశ్వాసులను కలిగి ఉంది,. పాండురంగశాస్త్రీ అథవాలే(జననం 1920 మరణం 2003) అనే అతను హిందు మతతత్వవేత్తగా, టెంపుల్‌టన్ అవార్డు. పద్మవిభూషణ్ అవార్డుల గ్రహీతగా, స్వాధ్యాయి పరివార్ వ్యవస్థాపకుడుగా చిరపరిచితుడు. **ఆయన తత్వశాస్త్రం గురించి ఇలా చెప్పాడు: "కేవలం సైద్ధాంతికం, ఊహాజనితమైన ఆలోచనలను, వాదాలను చర్చించే తత్వశాస్త్రం మనకి అవసరం లేదు. కేవలం పారలౌకిక అంశాలను చర్చించే తత్వశాస్త్రము మనకి** అవసరం లేదు. వాస్తవికమైన సాధారణ జీవితాలకి కావాల్సిన తత్వశాస్త్రం కావాలి. ఒక్కమాటలో చెప్పాలంటే సజీవంగా ఉండే తత్వశాస్త్రం కావాలి".

"[We Dont want philosophy which is purely theoritical and which merely discuss utopian ideas and theories. we donot want a philosophy which is mearly other wordly. Instead we want philosophy which is practical, one that can be useful in our daily lives we want a philosophy that can be lived"] స్వాధ్యాయి పరివార్ మౌలిక లక్ష్యం వారి మాటల్లోనే చెప్పాలంటే-"భక్తి అన్నది ఖచ్చితమైన ఆత్మానుగతమైన చర్యగా ఉండరాదు. అది ఒక సాంఘికశక్తిగా ఉండాలి." ["Bhakthi is not strictly an intraverted activity rather it is to be a social force"]

ఈ విధంగా దేవాలయానికి వెళ్ళడం, మత కర్మకాండలో పాల్గొనడమే సరిపోదని భక్తి అన్నదాన్ని ఒక సాంఘిక శక్తిగా మార్చేందుకు కృషి చేయాలని స్వాధ్యాయి పరివార్ వివరిస్తుంది. అలాంటి అసాంఘిక శక్తిని సృష్టించాలంటే ఏ హిందూ మతం అయితే శ్రమ జీవులను నిచ్చెన మెట్ల కులవ్యవస్థ కింద విభజించిందో, ఏ హిందూ మతం అయితే దళిత, ఆదివాసీ ప్రజలను ఆహార, విహారం పేరుతో సాంఘిక బహిష్కరణకి తరతరాలుగా గురిచేసిందో వారినే పావులుగా, పని ముట్లుగా మార్చి ఒక సాంఘికశక్తిగా రూపొందించేందుకు మతతత్వ శక్తులు చేసిన అనేక ప్రయోగాల ఫలితమే గుజరాత్ మారణకాండ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల మతతత్వ రాజకీయాలు, విధ్వంసం. కనుక ప్రవీణ్‌తొగాడియా, నరేంద్రమోడీలు తెరముందు కనపడేవాళ్ళే. దీనివెనక వారి లక్ష్యం కోసం కృషి చేసే శక్తులు వేరే ఉన్నాయి. కనక ఉత్పత్తిలోనూ, శ్రమలోనూ, ప్రకృతితోనూ, సంబంధమూ, సంఘర్షణ కలిగి ఉండటం చేత సహజంగా సమరశీలురైన ఆదివాసులు, దళితులు, వెనుకబడిన కులాల ప్రజలనే మతతత్వ రాజకీయం చేతుల్లో శక్తివంతమైన పనిముట్టుగా మార్చగలిగే రాజకీయ సిద్ధాంత భూమికలను ఈ స్వాధ్యాయి పరివార్ వంటివి సృష్టిస్తే భజరంగదళ్, హిందూవాహిని వంటి, బి.జె.పి వంటివి వాటి యొక్క వివిధ స్థాయిలోని వివిధ అవసరాలు నెరవేర్చుతాయి.

కనక భైంసా, వటోలి ఘటనలు వంటివి, చెట్టు శిఖారాగ్రన ఊగుతున్న కొమ్మల వంటివి. వాటి వెనక బలమైన కాండము, లోతైన వేళ్ళు తన్నుకొన్న మతతత్వ విషవృక్షం ఉంది. ఆదిలాబాద్, నాందేడ్, నిజామాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రజలలో స్వాధ్యాయి పరివార్ ప్రచారం చేసే సచ్ఛీలత, స్వయం వికాశం వంటివి గొప్ప ప్రభావం కలిగి ఉన్నాయి. పెద్ద భూస్వాములు, బీడీ సేట్‌లు, పత్తి వ్యాపారులు, కాంట్రాక్టర్లు దీనికి పట్టు గొమ్మలు, తమ రోజువారి జీవితంలో కార్మికులను, రైతుకూలీలను, శ్రమజీవులను అణచి, దోపిడీ చేసే శక్తులకు ఈ వాదాలు అవసరం. వీరు రోజువారీ జీవితంలో ఫాసిజం అమలు జరగాలని కోరుకొంటారు. అమలు చేస్తారు. కనుక వీరికి మతతత్వం అవసరం. ఇతర మతాలను చూపుతూ తమ మతంలోని కష్టజీవులను అణచి, దోపిడీ సాగించేందుకు ఇది అవసరం. కనుకనే మతతత్వం నేటి వర్గ దోపిడీ పీడక శక్తుల చేతులలో ఒక పనిముట్టు సామ్రాజ్యవాదుల దోపిడీ ప్రయోజనాలను నిరాఘాటంగా అమలు చేసేందుకు ఉపయోగపడే క్రూర సాధనం.

కనుక భైంసా ఘటనలు శ్రామిక, విప్లవ, ప్రజాతంత్ర శక్తులముందు విసురుతున్న సవాలు ఇది. ఊడలు దిగుతున్న ఈ విషవృక్షాన్ని ఎదుర్కొనటానికి పైపై విమర్శలు, సాధారణ పరామర్శలు, ఉదారవాద ప్రకటనలు, ఖండనలు ఏ మాత్రం చాలవు. చాప క్రింద నీరులా ప్రజలలో చొచ్చుకొని వస్తున్న ఫాసిస్టు శక్తుల తాత్విక, రాజకీయ సిద్ధాంత విషధోరణులకు వ్యతిరేకంగా అంతకన్నా తీవ్రంగా ప్రజలను సమీకరించి విజ్ఞానవంతం చేసే తాత్విక, భౌతిక, రాజకీయ సాంస్కృతిక మానసిక రంగాలలో సంకులసమరానికి సిద్ధపడకుండా మతతత్వ శక్తుల సవాలును త్రిప్పికొట్టలేము. మహత్తర తెలంగాణా ప్రజా సాయుధ పోరాటానికి ముందు, ఆ తరువాత వెల్లివిరిసిన ప్రజాతంత్ర చైతన్యపు పునాదులను దెబ్బతీసేందుకు, తుడిచిపెట్టేందుకు తెలంగాణా విమోచనా దినోత్సవంతో మొదలుపెట్టి మత ఘర్షణల వరకూ అన్ని అంశాలను ఉపయోగించుకొనేందుకు సాగుతున్న ఈ కుట్రలను త్రిప్పికొట్టాలి.

భైంసా, వటోలి ఘటనలు అందిస్తున్న హెచ్చరిక ఇది. విప్లవ, ప్రజాతంత్ర లౌకిక ఉద్యమ శక్తులు ఐక్యం కావాల్సిన సమయమూ ఇదే. ◈

సామ్రాజ్యవాద దోపిడీకి నెలవుగా మలచబడ్డ రెడీమేడ్ దుస్తుల ఉత్పత్తి పరిశ్రమ- మహిళా, బాలకార్మికుల శ్రమను నికృష్టంగా దోచుకుంటున్న దళారీ ఫ్యాక్టరీ యాజమాన్యాలు

నేడు మనదేశంలో రెడీమేడ్ దుస్తుల పరిశ్రమ గణనీయంగా విస్తరించింది. ఈ పరిశ్రమ ప్రధానంగా ముంబై, ఢిల్లీ, చెన్నై, తిరుపూర్, బెంగుళూర్ నగరాలలో కేంద్రీకరించబడింది. ఈ నగరాలేకాక యితర చిన్న, చిన్న పట్టణాలలో కూడా ఈ రెడీమేడ్ దుస్తుల పరిశ్రమకు అనుబంధంగా ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహింపబడుతున్నాయి.

50 మంది కార్మికులు పనిచేసే చిన్న రెడీమేడ్ దుస్తుల ఉత్పత్తి యూనిట్లనుండి 5వేల మంది కార్మికులు పనిచేసే బడా ఫ్యాక్టరీలదాకా వివిధ స్థాయి యూనిట్లలో యీ రెడీమేడ్ దుస్తులు ఉత్పత్తి చేయబడుతున్నాయి. అమెరికా దేశపు మార్కెట్టులోనూ, పశ్చిమ దేశాల మార్కెట్టులోనూ అమ్మటంకోసం ఈ రెడీమేడ్ దుస్తులు తయారు చేయబడుతున్నాయి. బ్రాండ్ పేరు కంపెనీలుగా చెప్పబడే బహుళజాతి కంపెనీలు ఈ రెడీమేడ్ దుస్తులను భారీఎత్తున అభివృద్ధిచెందుతున్న దేశాల్లో ఉత్పత్తిచేయించి, ఆ దుస్తులను తమ సారధ్యంలో నిర్వహింపబడుతున్న రిటైల్ చైన్‌స్టోర్సులద్వారా అమ్మకాన్ని సాగించుకొంటూ సూపర్ లాభాలను గడించు కొంటున్నాయి. ప్రపంచీకరణ విధానం అన్నది ఈ సామ్రాజ్యవాద బ్రాండ్ పేరు కంపెనీలకు తమ అమ్మకపు సరుకును కారుచౌకగా ఉత్పత్తి చేయించుకోవటానికి ఎనలేని అవకాశాలను కల్పించింది.

అభివృద్ధిచెందుతున్న దేశాల్లో సామ్రాజ్యవాద కంపెనీల ఉత్పత్తి స్థావరాల ఏర్పాటు:

20వ దశాబ్దపు 50వ దశకంలో(1950) **అమెరికాలోనూ**, పశ్చిమ యూరోపులోనూ ఈ రెడీమేడ్ **దుస్తుల పరిశ్రమ ఆవిర్భవించింది.** అయితే ఆయాదేశాల్లో **బలంగా రూపొందిన** సంఘటిత కార్మికోద్యమ ఫలితంగా **పరిశ్రమాధిపతులు** కార్మికులకు ఎక్కువ కూలి **చెల్లించాల్సివచ్చింది. దాంతో బడాపెట్టుబడిదారులు 1960 నుండీ** అభివృద్ధిచెందుతున్న **దేశాల్లో తమ పరిశ్రమను స్థాపించటంద్వారా, అక్కడి కార్మికులకు తక్కువ కూలీ చెల్లించే అవకాశాన్ని** వాడుకొని తమ **ఉత్పత్తి ఖర్చులను తగ్గించుకొనేందుకు** గల అవకాశాలకోసం [illegible] ఖండంలోని తైవాన్, దక్షిణకొరియా, హాంకాంగ్ దేశాలను ఎంచుకొన్నారు. ఎందుకంటే ఈ దేశాలు అప్పటికే అమెరికన్ సామ్రాజ్యవాదుల ప్రభావంలోవుండి అమెరికా యొక్క సైనిక, ఆర్థిక సహాయంతో పరిపాలనను నిర్వహిస్తున్నాయి. **ఆసియాలో వ్యాపిస్తున్న** సామ్రాజ్యవాద **వ్యతిరేక ఉద్యమ పవనాలను అడ్డుకొనటంకోసం** పశ్చిమదేశాల మరియు అమెరికా దేశపు **సామ్రాజ్యవాదులు ఈ దేశాలలో** సైనిక, ఆర్థిక సహాయ **ఒప్పందాల రూపాలలో స్థానాన్ని** పొందాయి. అందులో భాగంగానే **'అభివృద్ధిచెందిన'** దేశాలయొక్క పెట్టుబడి **తోనూ**, సాంకేతిక సహాయంతోనూ ఈ 3 దేశాల్లోనూ రెడీమేడ్ దుస్తుల **ఉత్పత్తి** పరిశ్రమలు స్థాపించబడ్డాయి. ఈ పరిశ్రమలు ప్రధానంగా పశ్చిమ దేశాల మార్కెట్ల అవసరాలకోసం స్థాపించబడ్డాయి. ఈ దేశాలలో కారుచౌకకు కార్మికుల శ్రమశక్తి దొరకటంవలన, ఉత్పత్తిఖర్చులు గణనీయంగా తగ్గిపోయి, పెట్టుబడి దారులు అధికాధిక లాభాలను గడించుకోగలిగారు. అప్పటినుండీ(1965) సామ్రాజ్యవాద అధిపతులు, ఈ దేశాలలో జరిగిన ఉత్పత్తి నమూనాను, అభివృద్ధి చెందుతున్న దేశాల అభివృద్ధికి ఆదర్శవంతమైన నమూనాగా ఆకాశానికెత్తి యిదే అభివృద్ధిచెందుతున్న దేశాలు అభివృద్ధిచెందటానికి ఏకైక మార్గంగా నిర్దేశించారు.

సామ్రాజ్యవాదుల కనుసన్నలలో నిర్వహింపబడుతున్న సంస్థలయిన ఐక్యరాజ్యసమితికి చెందిన పారిశ్రామిక అభివృద్ధిసంస్థ సామ్రాజ్యవాద విత్త సంస్థలయిన ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్‌లు అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని ప్రభుత్వాలను "ఎగుమతిపై ఆధారపడ్డ పారిశ్రామీకరణ" విధానాలను చేబట్టేటట్టు ప్రోద్బలంచేశాయి. ఆర్థిక, రాజకీయ నియంత్రణ ద్వారా ఈ సంస్థలు వివిధ అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రభుత్వాలచే ఈ విధానాన్ని అంగీకరింపచేశాయి. ఈ దేశాలలోని పాలకవర్గాలు కూడా ఈ రకమయిన "ఎగుమతి ఆధారిత పారిశ్రామీకరణ" విధానంద్వారా త్వరితంగా తమ ప్రయోజనాలను అభివృద్ధిపరచుకోవచ్చుననే ఉద్దేశ్యంతో, యిష్టపూర్వకంగానే ఈ విధానాన్ని అమలుజరపటానికి సామ్రాజ్యవాదులతో చేతులు కలిపాయి. ఫలితంగా ఈ విధానాలను అమలు జరిపే దేశాల్లో ఎగుమతి, దిగుమతులపైగల ఆంక్షలను ఎత్తివేసే విధానాలు అనుసరింపబడ్డాయి. ఇందువలన సామ్రాజ్యవాద బహుళజాతికంపెనీల పెట్టుబడిదారులకు కార్మికుల శ్రమశక్తియొక్క కూలీని దారుణంగా తగ్గించివేయటానికి అధికారం యివ్వబడింది. ఈ రకంగా స్వేచ్ఛా వ్యాపార ప్రాంతాలు అనబడేవి ఉనికిలోకి వచ్చాయి. అదే సమయంలో 1974లో అభివృద్ధిచెందుతున్న దేశాల ప్రభుత్వాలు "బహుళజాతి ఒప్పందం" (మల్టీఫైబర్ అగ్రిమెంటు) అనే ఒప్పందంద్వారా ప్రతిదేశానికీ కోటాలను నిర్ధారించి, దానికి కట్టుబడి రెడీమేడ్ దుస్తులను ఎగుమతి చేయటానికి అంగీకారం కుదుర్చుకొన్నాయి. ఆ రకంగా అభివృద్ధిచెందిన దేశాలకు చెందిన రెడీమేడ్ దుస్తుల పరిశ్రమను అభివృద్ధిచెందుతున్న దేశాలు, తమతమ దేశాల్లో వ్యవస్థీకరించి, దానిపై అదుపును అభివృద్ధిచెందిన దేశాలకు అప్పచెప్పాయి. ఆ రకంగా అభివృద్ధిచెందుతున్న దేశాల్లో, అభివృద్ధిచెందిన దేశాలకు చెందిన రెడీమేడ్ దుస్తుల పరిశ్రమకు ఉత్పత్తి స్థావరాలు కల్పించబడ్డాయి. ఆ ఉత్పత్తులను బహుళజాతి కంపెనీల ఉత్పత్తులుగా అభివృద్ధిచెందిన దేశాల్లో అమ్ముకోవటం జరుగుతోంది.

దక్షిణకొరియాలో దుస్తుల కర్మాగారాలను నెలకొల్పటం కోసం అమెరికా 40 బిలియన్ల డాలర్లను 'సహాయం'గా యిచ్చింది. శ్రీలంకలో దుస్తుల కర్మాగారాన్ని నెలకొల్పటంకోసం ప్రపంచబ్యాంకు 2 బిలియన్ల డాలర్లను తేలికపాటి రుణంగా యిచ్చింది. ఈ రుణంతోపాటు నిపుణుల, సాంకేతిక నిపుణుల బృందాన్ని కూడా ప్రపంచబ్యాంకు శ్రీలంకకు పంపింది.

ఈరకంగా పరిశ్రమలను నెలకొల్పటానికి సామ్రాజ్యవాదులు సహాయంయివ్వటంలో మరొక అంశం కూడా యిమిడివుంది. ఈ సహాయంలో అక్కడి కార్మికుల ప్రతిఘటనా ఉద్యమాలను నిరోధించటం అన్న ఉద్దేశ్యం కూడా ఇమిడి వుంది. కార్మికోద్యమాన్ని నిరోధించలేకపోతే, ఈ నమూనా అభివృద్ధి అన్నది సాధ్యంకాదు. అందువల్లనే అమెరికా, దాని మిత్రదేశాలూ దక్షిణకొరియా, ఫిలిప్పిన్స్, తైవాన్‌లాంటి దేశాల్లో నిరంకుశ ప్రభుత్వాలు **ఏర్పడటానికి** ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తోడ్పడ్డాయి. **ఈ నిరంకుశ ప్రభుత్వాలు** కార్మికోద్యమాలను రక్తపు **టేరుల్లో ముంచాయి. అమెరికా, దాని మిత్రదేశాలూ మద్దతును** యిచ్చి, ఏర్పాటుచేసిన **ఆసియా-ఆఫ్రికా** దేశాల కార్మిక స్వేచ్ఛా సంస్థ అనే పేరుగల సంస్థలాంటి సంస్థలు కార్మిక సంస్థల ముసుగులో కార్మికులు స్వతంత్రంగా లేదా ఆకస్మికంగా పోరాటాలను లేవనెత్తటానికి చేసిన కృషిని వమ్ముచేయటానికి చేయగల్గిందంతా చేశాయి. **ఉదాహరణకు 1978లో** దక్షిణకొరియాలోని ఇంషాన్‌లోగల కాంగ్.2. దుస్తుల ఫ్యాక్టరీలోని మహిళా కార్మికులు ఒక స్వతంత్ర కార్మిక సంఘాన్ని ఏర్పాటుచేసుకొని, తమ వేతనాల పెంపుదల కోసం మెరుగైన పని పరిస్థితులకోసం ఆందోళన ప్రారంభించారు. వీరి ఆందోళనకు మద్దతుగా చుట్టుప్రక్కల గల యితర దుస్తుల ఫ్యాక్టరీలోని కార్మికులు కూడా సానుభూతి ఆందోళన చేపట్టడానికి ఉద్యుక్తులయ్యారు. ఇటువంటి తరుణంలో ఆసియా-ఆఫ్రికా స్వేచ్ఛా కార్మికసంస్థకు చెందిన గూండాలు యినుపరాడ్లతోనూ, మలంనిండిన బకెట్లతోనూ ఆ మహిళల యూనియన్ ఆఫీసుపై దాడిచేశారు. ఆ మహిళా కార్మికులను చితక్క బాదారు. వారి నోళ్ళలో మలాన్ని కుక్కారు. ఆందోళన విరమించి, యాజమాన్యంతో సహకరించమని ఆ మహిళా కార్మికులను ఆదేశించారు. ఈ రకంగా సామ్రాజ్యవాద దేశాల "సహాయం", పారిశ్రామికాభివృద్ధి నమూనాలు అనబడేవి, అటు అభివృద్ధిచెందిన దేశాలకు చెందిన సామ్రాజ్యవాద-బహుళజాతి సంస్థలకు సూపర్ లాభాలను గడించుకోవటానికి వీలుగా అభివృద్ధి చెందుతున్న దేశాలలోని కార్మికుల శ్రమశక్తిని కారుచౌకగా కొల్లగొట్టుకు పోవటానికి వీలుగానూ, ఆయా అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని కార్మిక ప్రతిఘటనా ఉద్యమాలను నిరోధించటానికీ ఉద్దేశింపబడ్డాయి.

అప్పటినుండీ పశ్చిమ యూరోపుదేశాల, ఉత్తర అమెరికాకు చెందిన ఫ్యాషన్ కంపెనీలయొక్క ఆర్డర్లను హాంకాంగ్, దక్షిణకొరియా, తైవాన్‌లోగల దుస్తుల ఫ్యాక్టరీలు సరఫరా చేయటం మొదలెట్టాయి. నానాటికీ ఈ ఆర్డర్లు పెరుగుతూండటంతో, ఒకో దేశానికీ 'బహుళజాతి ఒప్పందం' ద్వారా నిర్ణయించిన కోటాను అతిక్రమించి ఉత్పత్తి సాగించే విధానాన్ని రూపొందించటం జరిగింది. పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, కాంబోడియా, చైనాలలో సబ్‌కాంట్రాక్టింగ్ ఉత్పత్తిని చేయటం అనే విధానంద్వారా ఈ అతిక్రమణ ప్రారంభమయింది. ఇందువలన ఆ సబ్‌కాంట్రాక్టు ఉత్పత్తికోసం ఏర్పాటు చేయబడ్డ ఫ్యాక్టరీలలోని కార్మికులకు మరింత తక్కువ వేతనాలు చెల్లించే పరిస్థితులు సృష్టించబడ్డాయి.

ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్‌ల నిర్దేశాల మేరకు 1928లో బంగ్లాదేశ్ ప్రభుత్వం "ఎగుమతి ప్రాసెసింగ్ జోన్లు" ఏర్పాటు అనే విధానాన్ని అమలుజరపటం ప్రారంభించింది. చిట్టగాంగ్, ఢాకా శివార్లలో ఈ ఇ.పి.జడ్. లను నెలకొల్పటంద్వారా, దుస్తుల ఫ్యాక్టరీ యజమానులు కార్మికులను యిష్టారాజ్యంగా దోచుకోవటానికి అవకాశాలు కల్పించింది. ఫలితంగా 1980లో కేవలం వేలసంఖ్యలో గల కార్మికులున్న 50 దుస్తుల కంపెనీలున్న బంగ్లాదేశ్‌లో నేడు 18 లక్షలమంది పనిచేసే 3 వేల దుస్తుల తయారీ ఫ్యాక్టరీలు వెలిశాయి.

దాదాపుగా యిదేకాలంలో భారత దేశంలో కూడా దుస్తుల తయారీ కంపెనీల సంఖ్య పెరగటం మొదలైంది. 1991 తదనంతరకాలంలో ఈ దుస్తుల తయారీ పరిశ్రమ పెరిగింది. 1985తో పోల్చితే 1991 అనంతరకాలంలో ఈ పరిశ్రమ 22 రెట్ల మేరకు పెరిగింది.

ఈ రకంగా అభివృద్ధిచెందిన దేశాల్లోవున్న బహుళజాతి ఫ్యాషన్ కంపెనీల అవసరాలకోసం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఉత్పత్తిస్థావరాలు ప్రపంచమంతటా నెలకొల్పబడ్డాయి. మరింత కారుచౌకగా శ్రమశక్తిని కొల్లగొట్టుకోవటానికి ప్రపంచమంతటా వెతుకులాట కొనసాగుతోంది.

బ్రాండు పేరుగల కంపెనీల పనివిధానం:

పైన పేర్కొన్న విధంగా సామ్రాజ్యవాద దుస్తుల కంపెనీలు తమకు అవసరమైన ఉత్పత్తిని తమ, తమ దేశాల్లో దాదాపుగా ఆపివేసి, కారుచౌక కూలికి శ్రమశక్తి లభించే దేశాల్లో ఉత్పత్తి స్థావరాలను ఏర్పాటు చేసుకున్న తర్వాత ఆ సామ్రాజ్యవాద కంపెనీలు బ్రాండ్ పేరు కంపెనీలుగా మారిపోయాయి. అభివృద్ధిచెందుతున్న దేశాల్లో ఉత్పత్తిఅయిన సరుకుపై తమ బ్రాండ్ పేరును ముద్రించి మార్కెట్టులో అమ్ముకోవటం అనే విధానాన్ని చేబట్టాయి. ఇప్పుడు ఈ బ్రాండ్ పేరు కంపెనీలు స్వయంగా దుస్తుల ఉత్పత్తిని చేబట్టి నిర్వహించటం మానివేశాయి. ఉత్పత్తితో వీటికి సంబంధం లేకుండా చేసుకున్నాయి. ఈ బ్రాండ్ పేరు కంపెనీలు రెడీమేడ్ దుస్తులను అమ్మే ప్రపంచమంతటా కల రిటైల్ చైన్‌స్టోర్సులను తమ నియంత్రణలో వుంచుకొని, మరోవైపు క్రొత్త డిజైన్లను రూపొందిస్తూ, **ఆ డిజైన్లతో తమకు కావల్సిన సరుకు మొత్తాన్ని ఉత్పత్తి చేయాల్సిందిగా ఆర్డరు యిస్తూ తమ వాణిజ్యాన్ని** నిర్వహించుకొంటున్నాయి. అమెరికాకు చెందిన 50 అతిపెద్ద బ్రాండు పేరుగల కంపెనీలు మొత్తం రెడీమేడ్ దుస్తుల వాణిజ్యాన్ని నియంత్రిస్తున్నాయి. ఈ కంపెనీల్లో 5 కంపెనీలు **ఆసియా మార్కెట్టులో** తమ వాటాని **అతి** త్వరితంగా పెంచుకొంటున్నాయి. మన దేశంలో కూడా ఉన్నత మధ్యతరగతి వర్గ ప్రజలు ఈ రెడీమేడ్ దుస్తుల వినియోగదారులుగా గణనీయమైన సంఖ్యలో మారిపోతున్నారు. నైక్, వెలిస్, దిగేప్, వాల్‌మార్ట్, మార్ఫ్ ఫిస్సెన్సర్, డిస్నీ, టామీ హిల్‌ఫిగర్, లాకోస్టె లాంటి బ్రాండ్ పేర్లు మనదేశంలో విపరీతమైన ప్రాచుర్యాన్ని సాధించుకున్నాయి. ఈ రకంగా ప్రపంచమంతటి రెడీమేడ్ దుస్తుల మార్కెట్‌పై ఈ బడా బ్రాండ్ పేరు కంపెనీలు తమ ఆధిపత్యాన్ని స్థాపించుకోవటమేకాకుండా, చిన్న చిన్న బ్రాండ్ పేరు కంపెనీలను విలీనాలు, స్వాధీనాలూ చేసుకొంటూ మ్రింగివేయటం కూడా జరుగుతోంది.

బ్రాండు పేరు కంపెనీలు తమ ఆర్డర్లను 'ట్రేడింగ్ కంపెనీలు' లేదా 'సోర్సింగ్ ఏజెంట్లు' అనే వాటికి యిస్తాయి. 1960వ దశకంలో రెడీమేడ్ దుస్తులను హాంకాంగ్, తైవాన్, దక్షిణకొరియాలలో ఉత్పత్తి చేసి యిచ్చిన నాటి కంపెనీలే యిప్పుడు ఉత్పత్తి చేయటాన్ని మానివేసి 'ట్రేడింగ్ కంపెనీలు', 'సోర్సింగ్ ఏజెంట్లు'గా అవతారం ఎత్తాయి. ఈ కంపెనీలు తిరిగి తమకు వచ్చిన ఆర్డర్లను 'అభివృద్ధిచెందుతున్న' దేశాల్లో ఏర్పాటు చేయబడ్డ రెడీమేడ్ దుస్తుల తయారీ కంపెనీలకు సబ్-కాంట్రాక్టుకు ఆర్డర్లిస్తాయి. సబ్‌కాంట్రాక్టరుగా వున్న ఉత్పత్తి కర్మాగారాలకు(వీటిని సప్లయర్ కంపెనీలు అంటారు) యీ ట్రేడింగ్ కంపెనీలు ముడిసరుకును సరఫరా చేసి, పూర్తిచేసిన ఉత్పత్తిని సేకరించుకొని, నాణ్యతా పరీక్షలు జరిపి అనంతరం ఆ సరుకును బ్రాండు పేర ఈ కంపెనీలకు డెలివరీ చేస్తాయి. ఆ రకంగా ఈ సప్లయిర్ కంపెనీలు అటు ఆర్డర్లపై యిటు ముడిపదార్థాలపై కీలకమైన అదుపును తమచేతుల్లో పెట్టుకున్నాయి. ఉదాహరణకు హాంకాంగ్‌కు చేరిన లీఫంగ్ అండ్ కంపెనీ అనే ట్రేడింగ్ కంపెనీ ప్రపంచంలోని 40% దుస్తుల ఉత్పత్తికి సప్లయి కంపెనీగా వుంది. ఇది బంగ్లాదేశ్, ఇండియా, శ్రీలంక, ఈజిప్టు, మెడగాస్కర్, మొరాకో, దక్షిణ ఆఫ్రికాల్లోని ఉత్పత్తి మిల్లులకు ఉత్పత్తి ఆర్డర్లను యిస్తుంది. ఉత్పత్తి కంపెనీలు తనమీద ఆధారపడేట్టుగా ఈ ఆర్డర్లను ఆ కంపెనీ విభజిస్తుంది. ఇది ప్రత్యేకించి ఒక కంపెనీ పైననో, ఒక దేశంపైననో తనకు అవసరమైన ఉత్పత్తుల సరఫరాకోసం ఆధారపడదు. ఇందువలన ట్రేడింగ్ కంపెనీ, తనకు ఉత్పత్తి చేసి యిచ్చే సప్లయర్ కంపెనీలయిన ఉత్పత్తి ఫ్యాక్టరీలపై తనకు సరఫరా చేసే సరుకు యొక్క ధరలను తగ్గించి యిమ్మని ఒత్తిడిచేసి ధరలను తగ్గించుకొంటాయి. ఈరకంగా ఒత్తిడిచేసి 2002-2004 కాలంలో శ్రీలంకలోని కంపెనీలకు 30% ధరలను, 2001-2004 కాలంలో హొండూరాస్‌లో 23% ధరలనూ, 1998 నుండి 2002 కాలంలో ఫిలిప్పిన్స్‌లోని కంపెనీలకు 20% ధరలను తగ్గించివేయటం జరిగింది. **ఉత్పత్తి కర్మాగారాలకు** తగ్గిన ఈ ధరల ఫలితంగా కార్మికుల **నిజవేతనాలు** తగ్గింపబడటం జరుగుతుంది. ధరలను తగ్గించటమేకాక, ఉత్పత్తులను తమకు డెలివరీ చేయటానికి యిచ్చిన సమయాన్ని కూడా ట్రేడింగ్ కంపెనీలు **తగ్గించివేసి, తమ** క్రొత్త ఫ్యాషన్ దుస్తులను త్వరితంగా మార్కెట్టుకు **అందించే** ఏర్పాటు చేసుకొంటాయి. ఫలితంగా సమయం తగ్గిపోవటంవలన కార్మికులపై ఆ మేరకు అదనపు పనిభారం మోపబడుతుంది. ట్రేడింగ్ కంపెనీలు విధించే షరతులను అంగీకరించే ఉత్పత్తి ఫ్యాక్టరీ యాజమాన్యాలు తాము ఉత్పత్తి ఖర్చులు తగ్గించు కోవటంకోసం కార్మికులపై అదనపు పనిభారాన్ని, అదనపు వేతనం యివ్వని అదనపు పని గంటలనూ విధించటంతో పాటు కార్మికులకు శలవలు రద్దుచేస్తారు. తాము నిర్దేశించిన విధంగా పనిచేయకపోతే ఉద్యోగాన్నుండి తొలగిస్తామని కార్మికులను అనుక్షణం బెదిరిస్తారు.

ఈ రకంగా మొత్తం రెడీమేడ్ దుస్తుల పరిశ్రమ రంగంయొక్క ఉత్పత్తి, మార్కెట్లపై పూర్తి అధిపత్యాన్ని పొంది, సాగిస్తున్న బ్రాండ్‌పేరు కంపెనీలు యిపుడు గతంలో తాము ఏర్పాటు చేసిన 'బహుళ జౌళి ఒప్పందం' (మల్టీ ఫైబర్ అగ్రిమెంటు)ను క్రమంగా రద్దుచేసి దాని స్థానంలో ఎ.టి.సి. ఒక కొత్త ఒప్పందాన్ని దశల వారీగా అమలు జరపటానికి వీలుగా ప్రపంచ వాణిజ్య సంస్థ దోహారౌండ్ చర్చల్లో నిర్ణయింపచేశారు. ఈ క్రొత్త ఎ.టి.సి. ఒప్పందంవలన సామ్రాజ్యవాద దుస్తుల కంపెనీల (బ్రాండ్ పేరు కంపెనీలకు) ప్రయోజనాలు మరిన్ని విధాలుగా పెంపొందుతాయి. ఈ ఒప్పందం ద్వారా 'అభివృద్ధి చెందుతున్న దేశాలను మరింతగా ఎగుమతి సుంకాలను తగ్గించమని ప్రోత్సహించవచ్చు, ఇ.పి.జడ్, ఎఫ్.టి.జడ్, ఎస్.ఇ.జడ్‌లలో ఎగుమతికోసం చేయబడే ఉత్పత్తి కార్యకలాపాలకు మరిన్ని రాయితీలు యిచ్చి ప్రజలనుండి వసూలుచేసిన పన్నులను తమ పరిశ్రమలకు అదనంగా సబ్సిడీలు యిమ్మని డిమాండు చేయవచ్చు. మరింత కారుచౌకగా శ్రమశక్తి లభించే దేశాలకు తమ పరిశ్రమలను సునాయాసంగా తరలించవచ్చు. యిటువంటి లాభాలెన్నో యీ ఎ.టి.సి. ఒప్పందంవలన బ్రాండ్ పేరు కంపెనీలకు ఒనగూడుతాయి.

ఈ క్రొత్త ఎ.టి.సి. ని అమలు జరపాలని ఆఫ్రికా, కరేబియన్ దేశాలూ, దక్షిణ ఆసియా దేశాలకు చెందిన పెట్టుబడిదారులు బలంగా డిమాండు చేస్తున్నారు. ఇందువలన తమకు ఎక్కువ ఆర్డర్లు వస్తాయన్నది వీరి ఆశ. మరోవైపు బంగ్లాదేశ్ పాత మల్టీఫైబర్ ఒప్పందం రద్దు చేయరాదని డిమాండు చేస్తోంది. ఎందుకంటే ఆ ఒప్పందం క్రింది కోటాలు రద్దవుతే, ఆర్డర్లన్నీ తమతో పోటీపడే యితర దేశాలకు తరలిపోతాయని ఆదేశంలోని కంపెనీల బాధ. ఈ రకంగా రెడీమేడ్ బట్టల ఉత్పత్తి పరిశ్రమను సామ్రాజ్యవాద బ్రాండ్ పేరు కంపెనీలు తమ గుప్పెట పెట్టుకొని, తమ సూపర్‌లాభార్జనకు అనుగుణంగా ఆటాడిస్తున్నాయి.

సామ్రాజ్యవాద(బ్రాండ్ కంపెనీల) ఆర్థిక దోపిడీ:

తాము ఏ రకమయిన ఉత్పత్తిని చేయకపోయి నప్పటికీ సామ్రాజ్యవాద బ్రాండ్ కంపెనీలు ఏ రకంగా సూపర్ లాభాలను అక్రమంగా ఆర్జిస్తున్నాయో ఈ ఉదాహరణ తెలియచేస్తోంది. ఐ.సి.ఎఫ్.టి.యు అనే అంతర్జాతీయ సంస్థ యిచ్చిన వివరాలు ఈ రకంగా వున్నాయి:

మార్కెట్టులో 400 రూపాయలకు అమ్మబడే ఒక బ్రాండు పేరుగల రెడీమేడ్ దుస్తులకు ఉత్పత్తి ఖర్చులు:

ముడి సరుకు	రు.పై
(బట్ట యితర సామగ్రి)	40.00
ఇతర పై ఖర్చులు	13.00
కోటా రుసుము	20.00
రవాణా ఛార్జీలు	02.00
కార్మికుని కూలి	07.00
ఉత్పత్తిదారుడైన సప్లయర్ కంపెనీ యజమాని లాభం	18.00
అభివృద్ధి చెందుతున్న దేశంలోని ఉత్పత్తి కంపెనీ సరఫరా చేసిన ధర	100.00
బ్రాండ్ కంపెనీకి, ట్రేడింగ్ కంపెనీకి కలిసి లాభం	300.00

(ఈ 300 రూపాయల్లో నామమాత్రపు మొత్తం **రిటైల్ షాపుల నిర్వహణకూ,** డిజైన్ రూపొందించే **కేంద్రాలకూ, అడ్వర్‌టైజ్‌మెంటుకూ** వెచ్చింపబడుతుంది. **మిగిలిన సింహభాగ** మొత్తం బ్రాండ్ పేరు, ట్రేడింగ్ **కంపెనీలకు** లాభంగా మిగులుతుంది)

దీన్నిబట్టి చూస్తే, 'ఎగుమతిపై ఆధారవడ్డ పారిశ్రామికీకరణ' అన్నదానిలో 1.75% మాత్రమే కార్మికునకు ముడుతుందనీ, ఉత్పత్తి యూనిట్ యజమానికి కేవలం 4.5% లాభమే ముద్దుందనీ, వాస్తవంగా లాభపడేది బ్రాండ్-పేరు కంపెనీ అయిన సామ్రాజ్యవాద కంపెనీ లాభపడుతుందనీ-యీ రకంగా ప్రపంచీకరణ విధానాల అనుబంధ పారిశ్రామికాభివృద్ధి అనేది సామ్రాజ్యవాద దోపిడీ అభివృద్ధికి ఎలా సాధనంగా వుందో అర్థం చేసుకోవచ్చును.

దుస్తుల పరిశ్రమలో నికృష్టమైన మహిళల శ్రమ దోపిడీ:

నయా ఉదార ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ విధానాల అమలు వల్ల ప్రపంచమంతటా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మహిళలకు సమాన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయనీ, మహిళల సాధికారితకు మార్గం సుగమమైందనీ, అందుకు ఉదాహరణగా దుస్తుల తయారీ రంగంలో ఎలాక్ట్రానిక్స్ పరిశ్రమలో, ఐ.టి-జి.పి.ఒ రంగంలో మహిళలకు ఏర్పడిన అపారమైన ఉద్యోగవకాశాలను ఉదాహరణగా చూపిస్తూ, నూతన ఆర్థిక విధానాలనబడే వాటి గురించి పదే, పదే ప్రస్తుతించటం జరుగుతోంది. కానీ యీ ఆర్థికవిధానాలు మహిళలను ఉద్ధరించి వారికి సాధికారిత కల్పించటం కోసం ఉద్దేశింపబడినవి కావనీ, కేవలం ఈ విధానాలు మహిళలను ఉద్యోగరంగంలోకి ఈడ్చి వారి శ్రమను అతిచౌకగా కొల్లగొట్టుకోవటానికి ఉద్దేశించబడినవనీ, సామ్రాజ్యవాద దోపిడీని ప్రతిభావంతంగా కొనసాగించటానికి మహిళలు పావుల్లాగా వినియోగించుకోబడుతున్నారనీ పలు దేశాల్లోని మహిళా కార్మికుల అనుభవాలు రుజువు చేస్తున్నాయి. సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానం మహిళల విముక్తి కోసం కాక, మహిళల శ్రమను కొల్లగొట్టుకొనే ధ్యేయంతోనే వ్యవహరిస్తుందనీ వారి అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి.

ఈ రెడీమేడ్ దుస్తుల ఉత్పత్తిరంగంలో 80%పైగా (ప్రపంచమంతటా) మహిళా కార్మికులనే వినియోగించుకోవటం జరుగుతోంది. ప్రత్యేకించి 16 సంవత్సరాల నుండి 28 సంవత్సరాలలోపు యువతులనే ఈ రంగంలో నియమించుకోవటం అన్నది ప్రస్ఫుటంగా మనకు **గోచరమవుతుంది. ఇందుకుగల కారణాన్ని దక్షిణ భారతీయ** మిల్లుల సంఘం(సిమా) అధ్యక్షుడయిన కె.సెల్వరాజ్ మాటల్లో తెల్సుకొందాం. "యువతుల (బాలికల) వ్రేళ్లల్లో కౌశల్యం వుంటుంది. వాళ్ళు మంచి క్రమశిక్షణతో వ్యవహరిస్తారు. పని నిలుపుదలలాంటి చర్యలకు పాల్పడరు. మహిళా కార్మికులతో అయితే కార్మిక వివాదాలు తలెత్తవు."

దీన్నిబట్టి చూస్తే తాము యిచ్చిన కూలిని తీసుకొని, చెప్పిన పనిని మారు మాటాడకుండా మహిళలు చేస్తారు కాబట్టే, వారిలో పని కౌశలం ఎక్కువ స్థాయిలో వుంటుంది కాబట్టి యజమానులు మహిళా కార్మికులను అధిక సంఖ్యలో నియమించుకొంటున్నారని అర్థమవుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నిరుద్యోగం-పేదరికం-కుటుంబం కడుపు నిండటానికి సరిపడా వేతనం లభించక పోవటం అన్న కారణాల వలన, విధిలేని పరిస్థితుల్లో కుటుంబంలో స్త్రీలూ, బాలబాలికలు కూడా పనిచేసి అంతో ఇంతో సంపాదించి కుటుంబ నిర్వహణకు తోడ్పడాల్సిన పరిస్థితులున్నాయి. ఈ పరిస్థితులను సామ్రాజ్యవాద పెట్టుబడిదారులు "పారిశ్రామికాభివృద్ధి" పేరిట తమ దోపిడీకి అనుకూలంగా మలచుకున్నారు. దాని పర్యవసానమే ఈ ఎగుమతి ఆధారిత పరిశ్రమల్లో మహిళల శ్రమ దోపిడీ అని వివిధ దేశాల మహిళా కార్మికుల అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. వివిధ దేశాల్లోని దుస్తులరంగ కార్మికుల అనుభవాల గురించి తెల్సుకొందాం:

అర్జెంటీనా: ఈ దేశపు రాజధాని బ్యూనోస్ ఎయిర్స్ చుట్టుప్రక్కల 400 దుస్తుల కర్మాగారాలు వెలిశాయి. వీటిలో సుమారు లక్షమంది దాకా మహిళా కార్మికులు పని చేస్తున్నారు. వీరందరూ విదేశాల నుండి వచ్చిన వలస కార్మికులు కావటంతో వీరికి అధికారిక గుర్తింపు లేదు. ఫలితంగా ఫ్యాక్టరీ యజమానులు వీరిని దుర్మార్గంగా దోచుకుంటున్నారు. వీరికి నామమాత్రపు కూలి చెల్లించి, రోజుకు 12 నుండి 16 గంటలు బలవంతంగా పని చేయించుకుంటున్నారు. ప్రభుత్వపు లెఖ్ఖల ప్రకారం 6గురు సభ్యులు కల కుటుంబం కనీసంగా జీవించాలంటే 600 అమెరికన్ డాలర్లు కావాలి. కానీ యిక్కడి కార్మికులకు చెల్లించేది కేవలం 100 డాలర్లు. అంటే కుటుంబంలోని 6గురు సభ్యులూ రోజంతా శ్రమపడ్డా వీరికి కనీసంగా కూడా బ్రతుకు వెళ్ళమారదన్న మాట. ఈ కార్మికులను వర్కుషాపుల్లో పెట్టి, బయట తలుపులకు తాళంపెట్టి పనిగంటలు విపరీతంగా పెంచి పని చేయించుకొంటున్నారు. వీరికి శలవులు లేవు. పనికి గైర్హాజరయితే (ఏ కారణంచేతైనా కానీ) పని నుండి తొలగింపబడతారు. వీరిపై లైంగిక **దోపిడీ అనేది సర్వసాధారణ విషయంగా వుంది. వీరు నెలంతా కష్టపడి పని చేసినా వీరికి నెలాఖరు జీతం** సక్రమంగా, క్రమబద్ధంగా చెల్లింపబడదు.

2006వ సంవత్సరం మార్చి 30వ తేదీన ఒక దుస్తుల తయారీ ఫ్యాక్టరీలో నిప్పంటుకొని ఆరుగురు కార్మికులు సజీవ దహనం అయ్యారు. ఇందుకు నిరసనగా దుస్తుల కంపెనీ కార్మికులు బ్యూనోస్ ఎయిర్స్‌లోని బ్రాండ్-పేరు కంపెనీల కార్యాలయం ఎదుట నిరంతరం నిరసన ప్రదర్శనలను నిర్వహించారు. ఫ్యాక్టరీ యజమానులూ-బ్రాండ్ పేరు కంపెనీ యజమానులూ కలసి సంయుక్తంగా నిరసన తెల్పుతున్న కార్మికులపై దాడులకు పాల్పడ్డారు. ఈ నిరసన ప్రదర్శనలకు నాయకత్వం వహిస్తున్న ఒక కార్మిక దంపతుల 9 సంవత్సరాలు కుమారుడ్ని వారు కిడ్నాప్ చేసి, వారు తమ నిరసనోద్యమ కార్యకలాపాలు ఆపకుంటే, ఆ బాలుడ్ని చంపుతామని బెదిరించారు. అయినా కార్మికులు తమ నిరసనోద్యమాన్ని కొనసాగిస్తూనే వున్నారు.

బంగ్లాదేశ్: ఇక్కడి ఫ్యాక్టరీలలో కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనాన్ని 12 సంవత్సరాల క్రితం నిర్ణయించింది. తిరిగి దాన్ని యిప్పటివరకూ సవరించలేదు. అయినా యజమానులు ఆ వేతనాన్ని కూడా కార్మికులకు చెల్లించటంల్లేదు. వీరి చేత ఎటువంటి అదనపు చెల్లింపూ లేకుండా యజమానులు అదనపు పని గంటలు పని చేయించుకొంటున్నారు. ఇక్కడ కూడా కార్మికులను ఫ్యాక్టరీలో వుంచి బయటతాళం పెట్టి పని చేయించు కుంటున్నారు. వీరికి నిర్ణీత శలవులన్నవి లేవు. 12-30 సంవత్సరాల మధ్యగల బాలికలు-యువతులు పనిచేస్తున్న ఈ ఫ్యాక్టరీలలో పనికి గైర్హాజరు(ఏ కారణం చేతనైనా కావచ్చు) అయితే పని నుండి తొలగిస్తారు. వీరు అనుక్షణమూ సూపర్ వైజర్ల, సెక్యూరిటీ గార్డుల, గూండాల లైంగిక దోపిడీకి గురవుతూ వున్నారు.

2006 మార్చి నెలలో సంభవించిన అగ్నిప్రమాదాల్లో (3సార్లు) పలువురు కార్మికులు సజీవ దహనమయ్యారు. బయట తలుపులు మూసి తాళం పెట్టడం వలన బయటకు పారిపోవటానికి దారిలేక, నాలుగో, మూడో అంతస్తు నుండి దూకి పడి చచ్చిపోయిన, అంగవైకల్యం పొందిన కార్మికులూ వున్నారు. అదే విధంగా ఒక ఫ్యాక్టరీ భవనం కూలిపోయి అందులో సమాధి అయిన కార్మికులూ వున్నారు. 19మంది మరణించగా, 50మంది ఘటనలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్భర పరిస్థితులను నిరసిస్తూ అనేక ఫ్యాక్టరీల్లో కార్మికులు సమ్మెలు జరిపారు. ఇప్పటికే తమ పరిస్థితుల మెరుగుదలను డిమాండ్ చేస్తూ బంగ్లాదేశ్‌లోని, 18 లక్షలమంది రెడీమేడ్ దుస్తుల తయారీరంగ కార్మికులు నిరంతరం ఆందోళనలు జరుపుతూనే వున్నారు. ప్రభుత్వ యజమాన్యాల అణచివేతలను ఎదుర్కొంటూ, ప్రతిఘటన సాగిస్తూనే వున్నారు.

ఫిలిప్పిన్స్, వియత్నాం, కంబోడియా: ఈ దేశాల్లో కూడా మహిళా కార్మికులను యిదే విధంగా దుర్మార్గంగా దోచుకోవటం జరుగుతోంది. ఈ దేశాల్లోని మహిళా కార్మికులు తమ పరిస్థితుల మెరుగుదలను డిమాండ్ చేస్తూ, ప్రభుత్వ యజమాన్యాల నిర్బంధాన్నీ, అణచివేతనూ ఎదుర్కొంటూ ఆందోళనలు సలుపుతూనే వున్నారు.

ఇటీవలనే (2008 అక్టోబర్ 2వ వారంలో) మనీలాలో వివిధ మహిళల 'లో దుస్తులు' తయారీ చేస్తున్న ఫ్యాక్టరీలలోని మహిళా కార్మికులు పదుల వేల సంఖ్యలో తమ వేతనాలు పెంచాలనీ, పని పరిస్థితులు మెరుగు పర్చాలనీ డిమాండు చేస్తూ భారీ ఎత్తు నిరసన ప్రదర్శనను నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో వారు మహిళల "లో దుస్తులను" జండాలుగా ప్రదర్శిస్తూ తమ ఆందోళన జరపటం అన్నది గమనార్హమైన అంశంగా వుంది.

మడగాస్కర్: ఆఫ్రికా ఖండంలోని మడగాస్కర్‌లో అయితే దుస్తుల తయారీ ఫ్యాక్టరీ కార్మికులు ఉదయం 7 గంటలనుండి సాయంత్రం 7 గంటలదాకా సాధారణ రోజుల్లో పనిచేయాలి. అదనపు పనిభారం వున్న రోజుల్లో అయితే రాత్రి 11 గంటల దాకా పని చేయాలి.

ఇక మారిషస్, సే బెల్లిస్‌లలోని ఫ్యాక్టరీ కార్మికులైతే వారం అంతటా శలవు లేకుండా పనిచేయాల్సిందే. శ్రీలంకలోని కార్మికుల పరిస్థితి కూడా యిదే విధంగా వుంది. ఇప్పుడైతే కారుచౌక కూలికి శ్రమశక్తిని అందించటానికి, బంగ్లాదేశ్, కంబోడియా, మెక్సికో దేశాలతో చైనా, కరేబియన్ దీవులూ, ఆఫ్రికాదేశాలు పోటీపడుతున్నాయి.

ఈ రకంగా వివిధ అభివృద్ధి చెందుతున్న దేశాలు తమలోతాము పోటీపడి తమ తమ దేశాల్లో వున్న మహిళా కార్మికుల జీవన, పని పరిస్థితులను దుర్భరం కావిస్తున్నాయి.

భారతదేశంలో: దేశంలో నూతన ఆర్థిక-పారిశ్రామిక విధానాలు అమలు జరపటం ప్రారంభమై, సాగుతున్న ఈ 18 సంవత్సరాల కాలంలోనూ గణనీయంగా విస్తరించిన పరిశ్రమల్లో ఎగుమతి ఆధారిత రెడీ-మేడ్ దుస్తుల పరిశ్రమ ఒకటి.

మనదేశంలో ఉత్పత్తి చేయబడే ఈ రెడీమెడ్ దుస్తులను ప్రఖ్యాత బ్రాండ్-పేర్లు గల కంపెనీలకు సరఫరా చేయటం జరుగుతోంది. ముంబాయి, ఢిల్లీలకు తోడు ప్రధానంగా బెంగుళూరు, తిరుపూర్‌లలో ఈ దుస్తుల ఉత్పత్తి పరిశ్రమ సాగుతోంది. ఈ రకంగా ఉత్పత్తి చేస్తూ సప్లయర్ కంపెనీలుగా దేశంలోని బడా పారిశ్రామిక సంస్థలయిన టాటా, ఐ.టి.సి, బిర్లా, అరవింద్ గ్రూపులు ప్రవేశించాయి. ఇవి నేరుగా ఉత్పత్తి సాగించటమే కాక, చిన్న కంపెనీల నుండి ఉత్పత్తులను చేయించు కొంటున్నాయి. వీటన్నిటిలోనూ మహిళా కార్మికులే 90% మేరకు పని చేస్తున్నారు.

బెంగుళూరులో: సుమారు 7 లక్షలమంది మహిళా కార్మికులు యిక్కడి రెడీమెడ్ దుస్తుల ఫ్యాక్టరీలలో పనిచేస్తున్నారు. వ్యవసాయ సంక్షోభానికి గురయిన పల్లె ప్రాంతాల నుండి జీవనోపాధి కోసం వలసలుగా ఈ నగరానికి వచ్చిన మహిళలే యీ రంగంలో పని చేస్తున్నారు.

ఈ పరిశ్రమలో సమష్టి బేరసారాలు ఆడుకొనే ఏర్పాట్లు లేనందున కార్మికులు తమ వేతనాలకు ప్రభుత్వం జరిపే కనీస వేతనాల నిర్ణయం మేరకే ఆధారపడవలసి వస్తుంది. ఈ కనీస వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం మూడు సంవత్సరాలకో సారి నిర్ణయిస్తుంది. ప్రస్తుతం యిక్కడి మహిళా కార్మికులు రోజుకు 100 రూపాయలు మాత్రమే వేతనంగా చెల్లించబడుతుంది. ఇటీవల జరిగిన ఒక అధ్యయనం ప్రకారం ఒక దుస్తుల పరిశ్రమ కార్మికునికి-తిండి, అద్దె, రవాణా ఖర్చులు, మందులు సమకూర్చుకోవాలంటే కనీసం రోజుకు రు.150 చెల్లించాలని తేలింది. కానీ వీరికి చెల్లించేది రు.100 మాత్రమే. కనీస వేతన సవరణ కమిటీ తన సిఫార్సులు చేయబోయినప్పుడల్లా యజమానులు కోర్టులకు వెళ్ళిస్టేలు తెచ్చి, కనీస వేతనం అన్న అవగాహనను అవహాస్యం పాలుచేస్తున్నారు.

పని ప్రదేశంలో **ఈ మహిళా కార్మికులు** పడే **అవస్థలు వర్ణనాతీతం. క్షణక్షణానికి పనిభారం పెంచేస్తారు. పనిచేయమని సూపర్‌వైజర్లు ఒత్తిడి తెస్తారు.** పనిలో **వెనుకబడిన స్త్రీలను** 'బేవార్సుముండా' లాంటి మొరటు **తిట్లతో** వేధిస్తారు. అనేక సందర్భాల్లో తమ పని లక్ష్యం పూర్తి చేయటం కోసం మహిళా కార్మికులు మధ్యాహ్న భోజనం చేయటాన్ని, ఆఖరుకు టాయ్‌లెట్‌కు వెళ్ళటాన్ని మానివేస్తారు. ఫలితంగా వీరి ఆరోగ్యం దెబ్బతింటోంది. **తీవ్రమయిన నడుంనెప్పి, మూలశంక, తలపోటు, మూత్రకోశవ్యాధులు, బహిష్టురుగ్మతలకు వీరుగురవు** తున్నారు. వీటికి తోడు డస్ట్ ఎలర్జీ, శ్వాసకోశ వ్యాధులు, క్షయలాంటి పని సంబంధమయిన వ్యాధులపాలవు తున్నారు. ఈ వ్యాధులనుండి వీరికి రక్షణ సౌకర్యాలను కానీ, బలవర్ధక ఆహార సరఫరానుగానీ, నష్టపరిహారాన్ని కానీ యజమానులు వీరికి కల్పించరు. పనిచేయమని నిరంతరం వేధించే సూపర్‌వైజర్లు ఈ మహిళా కార్మికులపై చెయ్యి చేసుకొంటారు కూడా. ట్రేడింగ్ కంపెనీలు దుస్తుల ధరలు తగ్గించినా, డెలివరీ టైం తగ్గించినా ఆ భారానికి రెట్టింపు పని భారాన్ని కంపెనీ యాజమాన్యాలు కార్మికులపై నిర్దాక్షిణ్యంగా రుద్దుతాయి. ఆ పని భారపు లక్ష్యాలను పూర్తిచేయడానికి కార్మికులను పలు రకాలుగా వేధిస్తాయి. శిక్షలు అమలుచేస్తాయి. ఈ శిక్షలకు, వేధింపులకు తట్టుకోలేని మహిళా కార్మికులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. అకాల మరణాలకు గురవుతున్నారు.

ఒకచిన్న పొరపాటు చేసిందనే కారణంతో టెక్స్‌పోర్టు క్రియేషన్సు సంస్థలో పనిచేసే శాకమ్మ అనే కార్మికురాలిని ఒక రోజంతా తిండీ, నీరూ లేకుండా సెక్యూరిటీ గార్డు రూపంలో నుంచోపెట్టి శిక్షించటం లాంటి ఉదంతాలెన్నో యిక్కడ నిత్యకృత్యాలు. ఈ వేధింపులూ, దుర్మార్గాలూ తట్టుకోలేని ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. 2007 ఫిబ్రవరిలో 25 సంవత్సరాల అమ్ము అనే భర్తలేని బిడ్డతల్లి సూపర్‌వైజర్ వేధింపులు తట్టుకోలేక ఫ్యాక్టరీకి చెందిన టాయ్‌లెట్‌లో ఉరేసుకు మరణించింది సెప్టెంబరు 19న పద్మావతి అనే 39 సంవత్సరాల కార్మికురాలు ఫ్యాక్టరీ గేటువద్ద కుప్పకూలిపోయి మరణించింది. అక్టోబరు 12న రేణుక అనే 18 సంవత్సరాల కార్మికురాలు, సూపర్‌వైజర్ల వేధింపులకు తట్టుకోలేక యింట్లో ఉరి వేసుకొని మరణించింది. 2007, ఏప్రియల్ 12న గాయత్రి అనే 19 సంవత్సరాల కార్మికురాల్ని, ఫ్యాక్టరీకి చెందిన కాంట్రాక్టు బస్సు గుద్దుకొని ఫ్యాక్టరీ ఆవరణలోనే మృతి చెందింది.

మరణించిన గాయత్రికి సంతాపం తెలుపటానికి ఆమె పనిచేసే బొంబాయి రేయాన్సు ఫేషన్సు కంపెనీకి చెందిన మహిళా కార్మికులు యూనియన్ ఆధ్వర్యంలో ఒక సమావేశం జరుపబోతే కంపెనీ యాజమాన్యం గూండాలచే, సంస్థలోని పురుష సూపర్‌వైజర్లచే దాడి జరిపించి, మహిళా కార్మికులను గాయపరిచింది. పోలీసులూ, ప్రభుత్వ అధికారులూ యాజమాన్యంతో కుమ్మక్కయ్యారు. ఈ ఘటనను అమ్నెస్టీ 'యింటర్నేషనల్ తీవ్రంగా ఖండించింది.

దుస్తుల ఫ్యాక్టరీ కార్మికులను ఒక **సంఘంలోకి** సంఘటిత పరచటానికి యత్నం చేసిన **రుక్మిణి అనే** కార్మికురాలిపై యాజమాన్యం కక్ష సాధింపులు జరిపింది. ఆమెనూ, యితర సంఘ కార్యకర్తలనూ యాజమాన్యం పని నుండి తొలగించింది. వారిపై అనేక అక్రమ కేసులు బనాయించింది. అయినా పట్టుదలతో రుక్మిణి కార్మికులను సంఘటితపరచి, వారి సమస్యల మెరుగుదలను డిమాండ్ చేస్తూ పలు ఆందోళనలను నిర్వహింపచేస్తోంది.

బెంగుళూరులోగల ఫైబర్స్&ఫ్యాబ్రిక్స్, ఇంటర్నేషనల్ సంస్థకు అనుబంధంగా వున్న జీన్సునిట్ అనే కంపెనీలో జరుగుతున్న కార్మిక హక్కుల ఉల్లంఘనలను గురించి క్లౌన్‌క్లోథ్స్ కేంపైన్ అనే సంస్థ కార్యకర్తలు బయటి ప్రపంచానికి వెల్లడి చేస్తుంటే వారిపై కంపెనీ యాజమాన్యం తప్పుడు కేసులుపెట్టి, వారిపై అరెస్టు వారెంట్లు తెచ్చి ఆ రకంగా ఈ రంగంలోని కార్మికులకు మద్దతుగా వచ్చిన వారిపై కూడా ఎదురు దాడులు జరుపుతోంది. వీటన్నింటికీ కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత ప్రభుత్వశాఖలూ తమ మద్దతునిస్తూ, దుస్తులరంగ కార్మికులను దారుణంగా దోచుకోవటానికీ వేధించటానికీ యాజమాన్యాలకు సహాయపడుతున్నారు. ఇక్కడి కార్మికులు నిరంతరం లైంగిక దోపిడీకి కూడా గురి చేయబడ్తున్నారు. నిరాకరిస్తే జీవనోపాధిని కోల్పోతామన్న భయంతో, ఆ నిస్సహాయ మహిళా కార్మికులు లైంగిక దోపిడీని కూడా విధిలేక భరిస్తున్నారు.

తమిళనాడు: ఎగుమతి ఆధారిత హొసయిరీ, రెడీమేడ్ బట్టల పరిశ్రమ తిరుపూర్ ప్రాంతంలో స్థిరపడింది. వేలకోట్ల రూపాయలు లాభాన్ని ఆర్జించే ఈ ప్రాంతంలో నూలు మిల్లులు మహిళా కార్మికులను దారుణంగా దోచుకోవటం జరుగుతుంది. నిర్దిష్టమయిన నియంత్రణా చట్టాలు లేకపోవటంతో ఈ రంగంలో జరిగే దోపిడీ అనంతంగా వుంది.

గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద దళిత, నిమ్న కుటుంబ బాలికలు, యువతులు ఈ పరిశ్రమకు సమిధలుగా బలి చేయబడుతున్నారు. 15 నుండి 22 సంవత్సరాలలోపు బాలికలను, యువతులను దుస్తుల కంపెనీలు అప్రెంటీస్‌గా 3 సంవత్సర కాలానికి నియమించుకొంటున్నాయి. పెద్దగా చదువూ, సంధ్యాలేని ఈ బాలికలకు, యువతులకు జీవనోపాధి కల్పిస్తామనీ, 3 సంవత్సరాల అనంతరం 25వేల నుండి 40వేలదాకా ఒకే మొత్తాన్ని ఒక్కసారి యిస్తామనీ, ఆ మొత్తాలు వారి వివాహానికి వినియోగించుకోవచ్చుననీ-దీన్నే సుమంగళ పథకం-అన్నపేరిట యాజమాన్యాలు తమ దళారుల ద్వారా, ఆ యువతులు, బాలికల కుటుంబాల వారికి నచ్చజెప్పించి, ఒకో వ్యక్తికిగాను 1000 నుండి 2000 రూపాయలు వరకూ దళారీకి చెల్లించి నియమించు కొంటున్నారు.

నియమించుకున్న యువతిని కంపెనీకి చెందిన ఆవరణలోనే బయటకు వెళ్ళ వీలు లేకుండా వుంచి, పని చేయించుకుంటూ రోజుకు కేవలం 15 రూపాయల నుండి 50 రూపాయల దాకా స్టైఫండు యిచ్చి వారిచేత పని చేయించుకొంటున్నారు. ఫ్యాక్టరీ ఆవరణలో పనిచేసే ఈ కార్మికులను తమ కుటుంబసభ్యులు కూడా చూడటానికి వీలులేని కట్టుదిట్టం చేశారు. అప్రెంటీస్ పేరిట వారి చేత రోజుకు 12 గంటలు పనిచేయించు కుంటున్నారు. వారి అప్రెంటీస్‌కాలం ముగియటానికి ముందే యజమానులు వారిని ఏదో ఒక వంకతో పని నుండి తొలగించి, మూడేళ్ళకాలం ముగిసిన అనంతరం చెల్లించాల్సిన మొత్తాన్ని యివ్వకుండా ఎగవేస్తున్నారు. ఫలితంగా తమ వివాహ అవకాశం చెడిపోయినందున అత్యుంపట్టి గ్రామానికి చెందిన కన్ని మాదిరి యువతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. ఫ్యాక్టరీ ఆవరణలో నిర్బంధించబడ్డ ఈ యువతులను బలవంతంగా ఓవర్‌టైం పని చేయించుకుంటున్నారు. వీరిపై లైంగిక దోపిడీ కూడా సాగుతూనే వుంది. చిన్న చిన్న పొరపాట్లకు కూడా వీరిని యాజమాన్యాలు దారుణంగా శిక్షిస్తున్నాయి. విజయ కుమార్ మిల్లులో పనిచేసే పెచ్చియమ్మాళ్ తాను ఒకరోజు ఓవర్ టైం పని చేయటానికి ఆలస్యంగా వెళ్తే ఆ రోజంతా మండుటెండలో నుంచోపెట్టి శిక్షించారనీ, తమకు యిళ్ళ నుండి వచ్చిన ఉత్తరాలను కూడా యాజమాన్యాలు పరిశీలిస్తాయనీ, తమను సూపర్‌వైజర్లూ, సెక్యూరిటీ గార్డులూ ఛండాలంగా తిడతారనీ ఆరోపిస్తోంది. తిరుపూర్ ప్రాంతంలో ఎగుమతుల(దుస్తుల, అల్లిక దుస్తుల) వ్యాపారం గత 10 సంవత్సరాలలో 5 రెట్లు పెరిగింది. వాల్‌మార్టు ఈ ప్రాంతం నుండి తనకు వస్త్ర సరుకుల సరఫరాను ఏర్పాటు చేసుకొంది. కోయంబత్తూరులో గల సేబర్ ఇంటర్నేషనల్ నుండి వాల్‌మార్టు సరఫరాను ఏర్పాటు చేసుకోవటంతో, ఆ కంపెనీ ఏకంగా అమెరికాలోని అట్లాంటా, ఫేనిక్స్ రాష్ట్రాలలోనే వేర్‌హౌస్‌లను, బట్టలు కుట్టే యూనిట్లను నెలకొల్పింది. ఇటువంటి బడా యూనిట్లన్నింటికీ నూలును సరఫరా చేసి నూలు మిల్లులు బాలికల శ్రమను దారుణంగా దోచు కొంటున్నాయి. ఈ నూలు మిల్లులు 3 సంవత్సరాలు పనిచేసిన తర్వాత

(తరువాయి 6వ పేజీలో)

నాటకీయంగా ముగిసిన జెట్ ఎయిర్‌వేస్ ఉద్యోగుల తొలగింపు ఆందోళన

దేశంలో పెద్ద విమానయాన కంపెనీ అయిన జెట్ ఎయిర్‌వేస్ సంస్థ, తన పోటీదారు సంస్థ అయిన కింగ్‌ఫిషర్ విమాన సంస్థతో సయోధ్య నెరపి, రెండు సంస్థలూ కల్సిపోయి ప్రభుత్వరంగ అధీనంలో వున్న ఎయిర్ ఇండియాకు భయంకర పోటీ సంస్థగా విలీనమైన వెన్వెంటనే జెట్ ఎయిర్ వేస్ సంస్థకు చెందిన ఎక్జిక్యూటివ్ డెరైక్టరు 14.10.2008.న13వేలమంది ఉద్యోగులు పనిచేస్తున్న జెట్ ఎయిర్ వేస్ సంస్థ నుండి 1900 మంది ఉద్యోగులను తొలగించబోతున్నట్లు ప్రకటించారు. ప్రకటన యిచ్చే నాటికే పని నుండి తొలగించినట్లు 800 మంది ప్రొబేషనర్లకు నోటీసు యిచ్చిన యజమాన్యం మిగిలిన 1100 మందికీ కూడా నోటీసులు యివ్వబోతున్నట్లు ప్రకటించింది. విమాన ప్రయాణీకుల సంఖ్య నానాటికీ తగ్గిపోతూ వుండటం వలన తాము తదనుగుణంగా యిటువంటి నిర్ణయాన్ని అనివార్యంగానే తీసుకోవలసి వచ్చిందనీ, యిది తామూ కింగ్‌ఫిషర్ సంస్థతో కలవటం యొక్క పర్యవసానంగా తీసుకున్న నిర్ణయం కాదనీ, తిరిగి మార్కెట్టు పరిస్థితులు మెరుగు పడితే యిప్పుడు తొలగించిన ఉద్యోగులను తిరిగి పనిలోకి తీసుకుంటామని కూడా ఆయన ప్రకటించాడు.

సహజంగానే ఎంతో ఖర్చు పెట్టి శిక్షణను పొంది, ఉద్యోగంలో చేరటానికి ముందు భారీమొత్తాలు (50 వేలు ఆ పైన) సంస్థకు డిపాజిట్టు కట్టి ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగులు, హఠాత్తుగా తమను ఉద్యోగాలనుండి తొలగించారంటే హతాశులయ్యారు. భాదపడ్డారు. కన్నీరు పెట్టుకున్నారు. తొలగింపబడ్డ ఉద్యోగుల్లో అన్ని శాఖలకు చెందినవారు, మహిళా ఉద్యోగులూ వున్నారు. వీరంతా 20-25 సంవత్సరాల మధ్య గల యువతీ, యువకులు.

తమకు సంభవించిన యీ వివత్తు నుండి ఆదుకోమంటూ ముంబాయిలో వున్న తొలగించబడ్డ **కార్మికులు మహారాష్ట్ర నవనిర్మాణసేన నాయకుడైన రాజ్‌థాకరేను వేడుకొన్నారు. విచిత్రం ఏమిటంటే ముంబాయిలో ఈ సంస్థ ఉద్యోగులు ఏర్పాటు చేసుకొన్న యూనియన్ భాల్‌థాక్రేకు** చెందిన, శివసేన అనుబంధ కార్మికసంఘం. **ఈ సంఘం అక్కడి గుర్తింపు** యూనియన్ కూడా. అయినా బాధిత కార్మికుల తక్షణ పరిష్కారం రాజ్‌ధాకరేవల్లనే సాధ్యమవుతుందనే ఉద్దేశ్యంతో అతడ్నే సమీపించారు.

తనను కల్సిన ఆ ఉద్యోగులతో తాను వారి సమస్య పరిష్కరిస్తానని, వారికి తన మద్దతు తెల్పుతూ, "ఉద్యోగులను తొలగించాలన్న తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి, **విరమించుకోకపోతే** ముంబాయిలో జెట్ ఎయిర్‌వేస్ విమానాలను తిరగకుండా నవనిర్మాణసేన నిరోధిస్తుందని" యజమాన్యానికి ఒక బెదిరింపు విసిరాడు.

ఇక కేంద్ర ప్రభుత్వానికి చెందిన మంత్రివర్గమయితే యీ వివాదంలో(కార్మికుల తొలగింపు) తాము జోక్యం చేసుకోమని ప్రకటించింది.

కేంద్ర పౌరయాన మంత్రి ప్రఫుల్ పటేల్ "మార్కెట్ శక్తులే పరిస్థితులు నిర్ణయిస్తాయి. మేము కేవలం వాటికి ఫెసిలిటేటర్లు మాత్రమే. ఈ వివాదాన్ని పట్టించుకోవటానికి కార్మికశాఖ వుంది" అంటూ దాటవేశారు.

కేంద్ర కార్మిక శాఖామంత్రి ఆస్కార్ ఫెర్నండెజ్ ఈ వివాదం విషయమై కేంద్ర కార్మిక శాఖా ప్రధాన కమీషనర్‌ను వెంటనే ఒక రిపోర్టు పంపమని ఆదేశించాను. ఆ రిపోర్టును బట్టి తగు చర్య తీసుకొంటాం" అంటూ ప్రకటించాడు.

కేంద్ర కార్మికశాఖ తయారుచేసిన రిపోర్టు "జెట్ యజమాన్యం చట్ట ప్రకారమే ఒక నెల నోటీసుకు బదులు ఒక నెల వేతనాన్నీ, ఉద్యోగులు చెల్లించిన సెక్యూరిటీ డిపాజిట్‌నూ తిరిగి యిచ్చేస్తోంది కాబట్టి, ఈ విషయంలో చట్టబద్ధంగా ఏమీ చేయలేం. జెట్‌ఎయిర్‌వేస్ యజమాన్యం చట్టాలను ఉల్లంఘించలేదు" అంటూ చావు కబురు చల్లగా బయటపెట్టింది.

ఇక వామపక్ష కేంద్ర కార్మికసంఘాల నాయకులైతే తాము ఈ వివాదం గురించి 16.10.2008న కేంద్ర కార్మిక మంత్రి ఆస్కార్ ఫెర్నాండెజ్‌తోనూ, ప్రధానమంత్రితోనూ చర్చిస్తామనీ, పార్లమెంటులో ఈ సమస్య గురించి లేవనెత్తుతామనీ ప్రకటించారు.

ముంబాయి, ఢిల్లీ, కలకత్తా ఎయిర్ పోర్టులలో జెట్ ఎయిర్‌వేస్ నుండి తొలగింపబడిన ఉద్యోగులు తోటి ఉద్యోగులతో కలిసి నిరసన ప్రదర్శనలను నిర్వహించారు. కన్నీరు, మున్నీరుగా ఏడుస్తూ తమ గోడును మీడియాకు చెప్పుకొన్నారు. ముంబాయిలోనే కాక, ఢిల్లీలో నిరసన ప్రదర్శన జరుపుతున్న ఉద్యోగులు "రాజ్‌ధాకరే నాయకత్వం వర్ధిల్లాలి!" అంటూ నినాదాలు కూడా యిచ్చారు. ఆ రకంగా ఉద్యోగాలనుండి తొలగింపబడ్డ ఉద్యోగులు రాజ్‌థాకరే పైననే తమ ఆశను, విశ్వాసాన్ని పెట్టుకొన్నారు.

ముంబాయిలో నిరసన ఆందోళనను మొదలెట్టిన రాజ్‌థాకరే-ఉద్యోగాలనుండి తొలగింపబడ్డ ఉద్యోగులకు మరాఠీ భాష నేర్చుకోమనీ, సమస్య పరిష్కారం అయ్యేదాకా పచ్చి మంచినీరు కూడా ముట్టవద్దంటూ సలహా యిచ్చాడు. తిండి, నీరూ లేకుండా అలాగే పడుండమని వారికి సలహా యిచ్చాడు.

రాబోయే ఎన్నికలకు దృష్టిలో పెట్టుకొన్న కాంగ్రెసు పార్టీ అధినాయకులు, ఈ ఉద్యోగుల తొలగింపు సమస్య, మీడియాలో పెద్ద రచ్చగా చేయటాన్ని చూసి, ఏదో రకంగా యీ వివాదం పరిష్కారమయ్యేటట్లు చూడమని పౌర విమనాయాన శాఖమంత్రి ప్రవుల్ వటేలును పురమాయించారు. ఆయన తాను మంత్రి హోదాలో కాక, వ్యక్తిగత హోదాలో యీ వివాద పరిష్కారానికి జెట్ ఎయిర్‌వేస్ యజమాన్యంతో సంప్రదిస్తానని ప్రకటించాడు.

బాల్‌థాక్రేకు చెందిన శివసేనకు అనుబంధంగా వున్న యూనియన్ నాయకత్వం తాను ఈ విషయ ఎమై నిర్దిష్టంగా చేపట్టబోయే లేదా చేపట్టిన కార్యక్రమం ఏమిటో? వెల్లడి కాలేదు.

రాజ్‌థాక్రే నాయకత్వానగల మహారాష్ట్ర నవనిర్మాణసేన, ప్రధాన కార్యదర్శి అతుల్ సర్పోత్‌దార్ నాయకత్వంలో ఒక ప్రతినిధి వర్గం జెట్‌ఎయిర్‌వేస్ యజమాన్య బృందాన్ని కల్సుకొని-ప్రతిపాదిత ఉద్యోగుల తొలగింపు నిర్ణయాన్ని రద్దు చేసుకోమనీ కావాలంటే సంస్థ చేపట్టిన ఖర్చుల తగ్గింపు చర్యకు ఉద్యోగులు సహకరిస్తారనీ, వేతనాలలో, అలవెన్సులలో యితర సదుపాయాల్లో యజమాన్యం కోత పెట్టుకోవచ్చుననీ సలహాలు యివ్వటం జరిగింది. అదే విధంగా లగేజీ వ్యవస్థను నిర్వహించటంలో ఏ విధంగా ఖర్చులు **తగ్గించుకోవచ్చునో** కూడా యజమాన్యానికి సలహా **యిచ్చారు. సంస్థ చైర్మన్ గోయల్-ఒకటి, రెండు రోజుల్లో రాజథాక్రేతో** సంప్రదింపులు **జరపటానికి అవకాశాన్ని** కూడా కల్పించుకొని వీరు వచ్చారు.

దసరా పండుగకు ముందుగా జెట్ ఎయిర్ లైన్సు కార్మికులను తొలగించటం సరయినది కాదనీ, ఇది సరయిన సమయం కాదు అనీ కేంద్ర పెట్రోలియం శాఖామంత్రి, **జెట్ ఎయిర్‌వేస్ చైర్మన్ గోయల్‌కు విజ్ఞప్తిని** చేయటం జరిగింది.

ఈ నేపథ్యంలో అత్యంత నాటకీయంగా, గురువారం రాత్రి జెట్ ఎయిర్ వేస్ చైర్మన్ నరేష్ గోయెల్ "తనకు తెలియకుండానే కంపెనీ యజమాన్యం ఉద్యోగులను తొలగించిందనీ, ఆ వార్తను పేపర్లలో చదివి చలించిపోయి కన్నీరు కార్చాననీ, ఆ ఉద్యోగులూ తమ కుటుంబంలోని వారేననీ, అందువలన వారిని తిరిగి ఉద్యోగాలలోకి తీసుకొంటున్నాననీ, తనను ఏ రాజకీయ నాయకులూ కలువలేదనీ తనపై ఏ రాజకీయ ఒత్తిడీ లేదనీ, తొలగింపబడ్డ ఉద్యోగులందరూ యించుమించు తన కుమార్తె వయస్సు వారే కావటం తనను బాధించిందనీ, ఉద్యోగాల నుండి తొలగింపబడ్డ ఉద్యోగులు తనను క్షమించమనీ'' ప్రకటన చేస్తూ ఆ వివాదానికి ముగింపునిచ్చారు.

తొలగించిన ఉద్యోగులను తిరిగి పనిలోకి తీసుకొంటున్నానని గోయెల్ ప్రకటించిన వెంటనే ఎవరికి వారు యిది తమ వల్లనే సాధ్యమయిందంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు.

పౌరవిమానమంత్రి ప్రపుల్లపటేల్ తాను గోయెల్‌తో హైదరాబాద్‌లో జరుగుతున్న పౌరవిమాన ప్రదర్శనలో కల్సుకొని "ఈ సమస్యకు 24 గంటల్లోగా పరిష్కరించకపోతే, హర్షించను' అని చెప్పాననీ అందువల్లనే పరిష్కారం అయింది అంటూ ప్రకటించాడు.

శివసేనకు చెందిన యూనియన్ కార్యదర్శి, పార్లమెంటు సభ్యుడు అయిన సంజయ్ రౌత్, "ఈ సమస్యను పరిష్కరించకపోతే, జెట్ ఎయిర్‌లైన్స్ శైలిలోనే దానికి గుణపాఠం నేర్పుతామని హెచ్చరించాం అనీ" దాంతో యజమాన్యం దిగివచ్చి వారిని తిరిగి పనిలోకి తీసుకొంది అనీ, అంతేకాక సంస్థలోని ఉద్యోగులందరికీ దీపావళి, బోనస్‌లను యిస్తాననీ, ఉద్యోగుల జీతభత్యాలలో కోతపెట్టను అని రాని తమ యూనియన్ నేడు యిచ్చిందనీ" ఆ రకంగా తామే ఈ సమస్యను పరిష్కరించి నట్లు ప్రకటించాడు.

మరోవైపు తమ హెచ్చరిక సంప్రదింపుల వల్లనే జెట్ యజమాన్యం దిగివచ్చి తొలగించిన వారిని తిరిగి పనిలో పెట్టుకొందనీ, ఈ చర్యను తాను స్వాగతిస్తున్నానీ, "ఈ కష్టకాలంలో సంస్థ మనుగడ నిలబెట్టుకోవటానికి ఉద్యోగులు కొంతమేరకు రాజీపడాలనీ" ఉద్యోగులకు సలహాయిస్తూ "భవిష్యత్తులో యజమాన్యం చేసుకొనే ఉద్యోగ నియామకాల్లో మెజార్టీ భాగం మహారాష్ట్రీయులకే యివ్వాలంటూ" రాజ్‌థాక్రే యజమాన్యానికి హెచ్చరిక చేశాడు.

తిరిగి తమను పనిలోకి తీసుకొంటామన్న నిర్ణయాన్ని యజమాన్యం ప్రకటించిన వెంటనే ఆ ఉద్యోగులు రాజ్‌థాక్రేను కలిసి తమ కృతజ్ఞతలు తెల్పుకున్నారు.

ఎంతో కష్టపడి, ఖర్చుపెట్టి తాము సంపాదించుకొన్న ఉద్యోగాలనుండి తొలగింపబడి నందుకు కన్నీరు, మున్నీరుగా ఉద్యోగులు విలపించటం సహజమే! తిరిగి వారిని ఉద్యోగాల్లో పునర్నియమించుకొనే పరిష్కారం త్వరితంగా జరగటం హర్షణీయమే! కానీ యీ సమస్య పరిష్కార క్రమంలో వ్యక్తమయిన పలు ధోరణులు మనదేశంలోని కార్మికోద్యమం (ట్రేడ్ యూనియన్) యొక్క బలహీనతను వ్యక్తం చేస్తున్నాయి.

తనకు తెలియకుండానే ఉద్యోగుల తొలగింపు చర్యకు పాల్పడిన యజమాన్యపు నిర్ణయాన్ని తాను మానవతా దృక్పథంతో పరిష్కరించానని చెప్పటంలో గోయెల్‌కు కావాల్సిన ప్రయోజనాలు గోయెల్‌కున్నాయనే విషయం నిర్వివాదమైన అంశం.

- రాజ్‌థాక్రే యిచ్చిన హెచ్చరిక ఫలితంగా **తాత్కాలికంగా** సంభవించబోయే నష్టం, తలపోట్లను **తగ్గించుకోవటం** కోసం గోయల్ ప్రస్తుతం ఉద్యోగుల తొలగింపు నిర్ణయాన్ని రద్దు చేసి వుండవచ్చు.
- ముంబాయిలోని యూనియన్ పై శివసేన యూనియన్ యొక్క ఏకచ్ఛత్రాధిపత్యాన్ని తప్పించటం కోసం గోయల్ ఈ విధంగా చేసి వుండవచ్చు.
- రాజ్‌థాక్రే ప్రతిపాదించినట్లు ఈ వివాదాన్ని పరిష్కరించటం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగుల జీతభత్యాల్లో కోతపెట్టడానికి గోయెల్ ఈ చర్యను ప్రాతిపదికగా తీసుకొనే ఉద్దేశ్యంతో వ్యవహరించి వుండవచ్చు.
- కాంగ్రెస్ మంత్రులు కోరిన విధంగానే సమస్యను పరిష్కరించానని చెప్పి గోయెల్ తమ సంస్థ చమురు కంపెనీలకు బకాయి పడ్డ 1000 కోట్ల బాకి చెల్లింపులో రాయితీలను, భవిష్యత్తులో ఏవియేషన్ టర్బైన్ యింధనాన్ని ఎటువంటి పన్నులు లేకుండా నేరుగా **విదేశాల నుండి కొనుగోలు చేసుకోవడానికి అనుమతిని** డిమాండు చేయవచ్చు.
- కాలక్రమంలో ప్రభుత్వ విమానసంస్థ. ఎయిర్ ఇండియాను దేశంలో పెద్ద విమాన సంస్థగా వున్న తన సంస్థకు అనుకూలంగా నిర్వీర్యం చేసే విధానాలు అవలంబించేటట్లు ప్రభుత్వంతో ఏర్పాటు చేసుకోవచ్చు.

ఇటువంటి కారణాలే గోయల్‌ను ఉద్యోగాన్నుండి తొలగించిన ఉద్యోగులను **పునర్నియమించుకొనేందుకు** ప్రోద్బలం చేసుండాలి!

కానీ కార్మికోద్యమ ప్రయోజనాల దృష్ట్యా చూస్తే, ఈ సందర్భంగా తలెత్తిన ధోరణులు హానికరమైనవని చెప్పక తప్పదు.

తమ సమస్యను తామే సంఘటితంగా ఐక్యంగా పరిష్కారించుకోవాల్సి వుందన్న చైతన్యానికి బదులు కార్మికులు అధికారంలో వున్న రాజకీయ **పార్టీల వల్లనో**, దూకుడుగా వ్యవహరిస్తోన్న పాలకపార్టీలకు చెందిన కొందరు వీరులైన నాయకుల వల్లనో **కార్మిక సమస్యలు** సునాయాసంగా పరిష్కారమవుతాయనే **ధోరణి ఈ** వివాదసందర్భంగా ఉద్యోగుల్లో **వ్యక్తమయింది.**

ఉద్యోగం వుంటే చాలు, మా జీతాల్లో, **అలవెన్సుల్లో** కోత బెట్టినా ఫర్వాలేదు-శ్రమదోపిడీకి **మేం వ్యతిరేకం** కాదు అనే భావాన్ని ఈ సందర్భంగా **ఉద్యోగులు వ్యక్తం** చేశారు. కార్మికులు శ్రమదోపిడీ **వ్యతిరేక** వర్గ రాజకీయాలను ఆశ్రయించకుండానే, **తమ సమస్యలను** పరిష్కరించు కోవటం సాధ్యమేనన్న తప్పుడు **అభిప్రాయం** ఉద్యోగ- కార్మికవర్గాల్లో పాతుకుపోవటానికి **ఈ ఘటన** ప్రోద్బలం యిస్తుంది.

యాదృచ్ఛికంగానో, ఉద్దేశ్యపూర్వకంగానో ఈ కంపెనీలోని "కార్మికుల తొలగింపు సమస్య" **ఉద్యోగుల** కనుకూలంగా నేడు పరిష్కారమైనా, ఇప్పటికే **అనేక** కంపెనీల్లో సాగుతున్న భవిష్యత్తుల్లో అనేక **కంపెనీలలో** జరుగబోయే ఈ సమస్య అంత తేలిగ్గా పరిష్కారమయ్యేది కాదన్నది నిస్సందేహమైన విషయం.

దళారీ పాలకులు అమలుపరుస్తున్న నయా ఉదారవాద దోపిడీ ఆర్థిక విధానాల ఫలితంగా, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ సంక్షోభ **ఫలితంగా** మరిన్ని ఉద్యోగుల తొలగింపు సమస్యలు విధిగా ఉంటాయని పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలే వెల్లడిస్తున్నారు.

ఇటువంటి **తరుణంలో** కార్మిక-ఉద్యోగ వర్గాలకు మిగిలినది వర్గ రాజకీయ ప్రాతిపదికపై నిర్వహింపబడే ఐక్యతతో కూడిన పోరాట మార్గం మాత్రమే. ఇటువంటి కార్మిక-ఉద్యోగ వర్గాల సంఘటిత పోరాట ప్రయత్నాలకు ఈ వివాద పరిష్కారంలో వ్యక్తమయిన తప్పుడు ధోరణులు-ఎనలేని హాని కల్గిస్తాయి.

ఇటువంటి అన్యవర్గ ధోరణుల వలన కార్మికోద్యమానికి జరిగే, జరుగబోయే హానిని కార్మికవర్గం అర్థం చేసుకోవాలి. ఈ ధోరణుల ప్రభావం నుండి బయటపడటానికి తనను తాను వర్గ రాజకీయ చైతన్యంతో కఠోరమైన కృషి చేయాలి. పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించుకోవాలి. నేడు భారత కార్మికవర్గం ముందు వున్న తక్షణ కర్తవ్యం అదే!

ముప్పాళ్ళ భూషమ్మకు జోహార్లు!

గుంటూరుజిల్లా చుందూరు మండలం పెదగాదెలవర్రులో తన 85వ ఏట ముప్పాళ్ళ భూషమ్మగారు తుదిశ్వాస విడిచారు. ఆమె దిగువ మధ్యతరగతి కుటుంబాల్లో ఉండే అన్ని కష్టాలను అనుభవించి పెద్ద కుటుంబాన్ని సాకారు. త్రిపురనేని రామస్వామిచౌదరి సంస్కరణల ప్రభావంలో ఉన్న పిన్నమనేని సోమయ్యవర్మ తన స్నేహితుడైన ముప్పాళ్ళ సూర్యనారాయణకు తన చెల్లెలు భూషమ్మను ఇచ్చి వివాహం చేశారు. 1996 నవంబర్ 28న సూర్యనారాయణగారు చనిపోయారు. తొలుత హేతువాది తర్వాత కమ్యూనిస్టు అభిమానిగా మారిన తన భర్త సూర్యనారాయణ సహకారంతో పిల్లలకి తగిన స్వతంత్రత ఇచ్చి అభ్యుదయ భావాలు అలవడేలా భూషమ్మ పెంచారు. కుటుంబంలో వున్న ఈ వాతావరణం వీరి మూడవ కుమారుడు భార్గవశ్రీ సిపిఐ(ఎం-ఎల్) పార్టీలో క్రియాశీలంగా పనిచేసేందుకు తోడ్పడింది. ఈ కుటుంబం పార్టీకి వివిధ రూపాల్లో తన సహకారాన్ని అందిస్తూ వస్తున్నది. ఇందులో కష్టజీవి అయిన భూషమ్మగారి సహకారం మరువలేనిది. ఆమె మృతికి 'జనశక్తి' జోహార్లు చెబుతూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియచేస్తున్నది.

బీహార్ వరద బాధితులకు అందజేసిన సహాయానికి ధన్యవాదాలు

ఇటీవల బీహార్‌లో సంభవించిన వరదల్లో, ఉత్తర బీహార్‌లోని 16 జిల్లాల్లో పెద్దఎత్తున నష్టం సంభవించింది. 30 లక్షలమందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. కొంపాగోడు వదలి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని స్కూల్స్, దేవాలయాల్లో తలదాచుకున్నారు. సహాయ శిబిరాల్లో తలదాచుకున్న వారికి కనీస ఆహారం, మంచినీరు అందించటంలో బీహార్ ప్రభుత్వం విఫలమవటంతో ప్రజలు వీటికోసం అల్లాడిపోయారు. ఇలాంటి దయనీయమైన పరిస్థితుల్లో ఉన్న బీహార్ వరద బాధితులను ఆదుకోవటానికి కా॥ఎస్.ఝాన్సి కన్వీనర్‌గా బీహార్ వరద బాధితుల సహాయ కమిటి ఏర్పడింది- ఈ కమిటి పిలుపు మేరకు మన రాష్ట్రంలో ఏ.పి.ఎఫ్.టి.యు, రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో-హైదరాబాద్, నెల్లూరు, విజయవాడ, పిడుగురాళ్ళ, విశాఖ ప్రాంతాలనుండి మందులు, బట్టలు, నగదు రూపాల్లో ప్రజలనుండి సహాయాన్ని సేకరించి పంపారు. బీహార్ వరద బాధితులకు తమ సహకారాన్ని అందించిన వారందరికీ బీహార్ వరద బాధిత సహాయ కమిటి కృతజ్ఞతలు తెలియజేస్తున్నది.

అభినందనలతో,

విజయవాడ — ఎస్.ఝాన్సి, కన్వీనర్

31-10-08 — బీహార్ వరద బాధిత సహాయ కమిటి

డిమాండ్ల సాధనకు పోరుబాటలో ఉపాధ్యాయులు

గత నాల్గు సంవత్సరాలనుండి ఉపాధ్యాయులు తాము ఎదుర్కొంటున్న సమస్యల సాధనకోసం అక్టోబరు 22నుండి గత 9 రోజులుగా పాఠశాలలు మూసివేసి సమ్మెలో పాల్గొంటున్నారు. అన్ని జిల్లాల్లో ప్రభుత్వ, స్థానిక సంస్థల, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు 95 శాతం సమ్మెలో పాల్గొంటున్నట్లు వార్తలు వస్తున్నాయి.

ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయుల సమస్యలు కొత్తగా ముందుకు తెచ్చినవిగాని, గొంతెమ్మ కోర్కెలుగాని కావు. చాలాకాలంగా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తున్నవే. 2005 నుండి ప్రతిసంవత్సరం వాటి పరిష్కారానికి జాక్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలు ఏదో ఒక రూపంలో ఆందోళనలు, పోరాటాలు సాగించి, హామీలు పొందినవే. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చక వాటిని తుంగలో తొక్కి అవలంభించిన నిర్లక్ష్యవైఖరి ఫలితమే ఉపాధ్యాయుల నేటి సమ్మె!

సెప్టెంబరు 20న జాక్టో ప్రభుత్వానికి సమ్మె నోటీస్ ఇస్తే దాని పట్ల పట్టీపట్టనట్లు వ్యవహరించింది. అక్టోబరు 20న సరిగ్గా నెలకు ప్రభుత్వం చర్చలకు పిలిచింది. పూర్తిగా చర్చించక మరుసటి రోజుకు వాయిదావేసింది. జాక్టో నాయకత్వాన్ని కాదని 21న టీచర్ ఎం.ఎల్.సీల తోనే చర్చలు సాగించింది. 22నుండి సమ్మె ప్రారంభమైంది. ఐ.ఆర్‌ను ఉపాధ్యాయులకు పెంచాంగదా అంటూ నిధులతో ముడిపడిన డిమాండ్లను జాక్టో ముందుకు తేవడం సమంజసంగా లేదని, వాటిని తీర్చడం సాధ్యంకాదని, సమ్మెను నీరుగార్చడానికి ప్రభుత్వం కుంటివాదనలు వల్లిస్తోంది. సమ్మె సాగిస్తున్న ఉపాధ్యాయులు ఎం.ఆర్.ఓ., ఆర్.డి.ఓ, కలెక్టరు కార్యాలయాల ముందు వరుసగా నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు, పికెటింగ్‌లు పెద్దఎత్తున సాగిస్తున్నారు. వారిపైన లాఠీచార్జీ సాగించడం, అరెస్టులు చేయడం జరుగుతున్నా, సమ్మెలో ఉవ్వెత్తుగా ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. విద్యామంత్రి 24న చర్చలకు పిలిచి, జాక్టో డిమాండ్లపై చర్చించి; ఆర్థికశాఖ, ముఖ్యమంత్రితో మాట్లాడి 26న తిరిగి చర్చలు కొనసాగిస్తానన్నారు. ఇంతలో హైకోర్టులో సమ్మెమీద ఎవరో వేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని అడ్డంపెట్టుకొని, ఉపాధ్యాయులకు ఐ.ఆర్.22% ఇచ్చామని, దీనివలన ఉపాధ్యాయులకు 583 కోట్ల రూపాయలమేరకు ప్రయోజనం చేకూరుతుందని, మిగతా సమస్యలు ప్రభుత్వ పరిశీలనలో వున్నాయని, ప్రభుత్వం అమలుచేస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాలను, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయులు సమ్మెను విరమించి విధులకు హాజరు కావాలని విద్యామంత్రి దినపత్రికల్లో ప్రకటన (యాడ్) వేయించారు. మరోవైపున ముఖ్యమంత్రి ఆర్థికంతో కూడిన డిమాండ్లు పరిష్కరించడం సాధ్యంకాదని, సమ్మెను విరమించాలని శ్రీకాకుళం జిల్లా రోడ్‌షోలో ప్రకటించారు. 27న ఆర్థికమంత్రి జాక్టో నాయకులను చర్చలకు పిలిచి, డిమాండ్ల పరిష్కారంలో చేతులెత్తేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో చూస్తాం చేస్తాం అంటూ ఇంతకాలంగా ఇచ్చిన వాగ్దానాలన్నిటినీ ప్రభుత్వం నీటి మూటలు చందంగా చేసింది.

జాక్టో ప్రభుత్వం ముందుపెట్టిన డిమాండ్లు 12. ఇవ్వన్నీ గతంలో పలుసార్లు చర్చించి, పరిష్కరిస్తానని ప్రభుత్వం వాగ్దానం చేసినవే. వీటికి దాదాపు 190 కోట్ల రూపాయలు వ్యయం అవుతుందని 21న టీచర్ ఎం.ఎల్.సీలతో విద్యామంత్రి సాగించిన చర్చల్లోను, 24న జాక్టో నాయకులతో చర్చించిన సందర్భంలోను అంచనాకు రావడం జరిగినట్లుగా వచ్చిన వార్తలు, స్పష్టం చేస్తున్నాయి. ఇదేదో మోయలేని ఆర్థికభారం అయినట్లుగా పాలకులు బీదఅరుపులు పెడుతున్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయింపులెంత? మిగుల్చుకొంటున్నది ఎంత? దానితో ఉపాధ్యాయుల డిమాండ్లను తీర్చడం పెద్ద సమస్య కాదు. ప్రజల దృష్టిని మళ్ళించడం కోసమే పాలకులు కుంటి వాదనలకు దిగి వారి డిమాండ్లకు వ్యతిరేకంగా దుష్ప్రచారాలు, ప్రకటనలు సాగించుతున్నారు.

అంతేకాదు. ఉపాధ్యాయుల డిమాండ్లలో ఏదీ ఇంతకాలం పెండింగ్‌లో పెట్టాల్సిన అవసరంలేదు. ఇవి, ప్రభుత్వం సృష్టించుతున్నవే. తద్వారా ప్రభుత్వ విద్యావ్యవస్థను మొత్తంగా బలహీనవరచి, దానిని ప్రయివేటీకరణ దిశగా మళ్ళించడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యానికనుగుణంగా విద్యారంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్నవే దాని అప్రజాస్వామిక విధానాలు! వీటివలన గతంలో ఉపాధ్యాయులు పోరాటాలద్వారా సాధించుకొన్న కొన్ని సౌలభ్యాలను కోతపెట్టడం జరుగుతోంది. వీటికి వ్యతిరేకంగా ఉపాధ్యాయులు ఆందోళనలకు దిగినపుడు పాలకులు హామీలివ్వడం, వాటినమలు జరపకపోవడం, మరికొన్ని సమస్యలను సృష్టించడం- వీటిచుట్టూ ఉపాధ్యాయులను తిప్పడం చేస్తోంది. మరోవైపున పాఠశాలల్లో ఖాళీపోస్టులు భర్తీచేయకపోవడం, సర్వీస్ రూల్స్ లేవనే నెపంతో ఉపాధ్యాయుల పదోన్నతులు చేయకపోవడం, సబ్జక్టు టీచర్స్ కొరత వలన విద్యాబోధనను కుంటుపరచడం, ఉన్న సిబ్బందిలో కొంతమందికి బోధనేతర కార్యక్రమాలు అప్పగించడం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు తగ్గుతున్నాయనడం, దానికి ఉపాధ్యాయులేనని నిందించడం, వగైరా ప్రచారం సాగిస్తోంది. ఇదంతా, విద్యను అందించాల్సిన ప్రభుత్వం, తన బాధ్యతనుండి వైదొలగుతూ-ఆ రంగంలో మార్కెట్‌శక్తులకు మరిన్ని అవకాశం కల్పించడం కోసమే చేస్తోంది. అందుకే ప్రభుత్వం సృష్టించుతున్నది. కొన్ని సమస్యలను చూద్దాం.

ఏకీకృత సర్వీస్ రూల్స్: పాలకులు, బ్యూరోక్రసీ యీ సమస్యను గత నాలుగు సంవత్సరాలుగా తేల్చక నాన్చుతోంది. ఇది ప్రభుత్వ - పంచాయితిరాజ్ ఉపాధ్యాయుల మధ్య పదోన్నతులకు సంబంధించినది. కోర్టుల లిటిగేషన్‌కు అవకాశంలేకుండా యీ సమస్యకు చట్టబద్ధత కల్పించాలి. ఒకవేళ ఏదైనా లోపంవుండి కోర్టు లిటిగేషన్‌కు దారితీస్తే దానిని నివారించే విధంగా పాలకులు, బ్యూరోక్రసీ డీల్ చేయాలి. ఉపాధ్యాయ సంఘాలిచ్చే తగిన సూచనలను పరిగణించాలి. సరిగ్గా ఇవేమీ చేయక యీ నాల్గు సంవత్సరాలుగా యీ సమస్యను ఢిల్లీ-హైదరాబాద్ చుట్టూ చక్రం చందంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు తిప్పుతున్నాయి. ఇది ఆర్థిక భారంలేని సమస్యే! అయినా దీనిని ఒక పెద్ద సమస్యగా మార్చడం కావాలని చేయడమే!!

అప్రెంటీస్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు: ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించేవారు ముందుగా ఎంట్రెన్స్ టెస్ట్ రాసి, అందులో ఎంపికైన వారు ఆ శిక్షణ పొందుతారు; ఆ వృత్తిలో ప్రవేశించేటప్పుడు మరలా డిఎస్‌సి టెస్ట్ రాసి దానిలో ఎంపికై ఉద్యోగాల్లో చేరుతున్నారు. ఇటువంటి వారిని అప్రెంటీస్ పేరుతో కొత్త నియామక విధానాన్ని 1994లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తర్వాత అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ఈ విధానాన్ని అమలుచేసింది. ఆ రెండు సంవత్సరాల కాలం పేస్కేలుగాక నామమాత్రం వేతనంతో చేయించుతోంది. ఆ సర్వీస్‌కు కనీసంగా రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు యివ్వమని, సీనియార్టీకి, పెన్షన్ వగైరాలకు పరిగణించమని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విద్యామంత్రి ఎం.ఎల్.సీలతో 21న చర్చించినపుడు రెండు నోషనల్ ఇంక్రిమెంట్స్‌కు రు116 కోట్లు అవుతుందని అంచనా వేశారు. అదీ ప్రాస్పెక్టివ్‌గానే అడుగుతున్నారు. ఇదొక పెద్ద ఆర్థిక భారంగా చిత్రించుతున్నది.

అన్‌ఎయిడెడ్ సర్వీస్‌ను పరిగణించడం: ఎయిడెడ్ విద్యాసంస్థల్లో చేరే సిబ్బందికి వారు పనిచేసే పోస్టు గ్రాంటు-ఇన్-ఎయిడ్‌కు ప్రభుత్వం అనుమతించినపుడు, దీనికి ముందు వారుచేసిన సర్వీస్ కాలాన్ని లెక్కించి, ఆ మేరకు నోషనల్ ఇంక్రిమెంట్లు అనుమతించి, వీటిని వారి వేతన స్కేలులో వేతన స్థిరీకరణగావించడానికి రెండు దశాబ్దాల క్రితమే ఉత్తర్వులు జారీచేసింది. ఈ సౌలభ్యాన్ని టిడిపి ప్రభుత్వం 2000లో రద్దుచేస్తూ చట్టం చేసింది. దీనిని, చట్టంచేసిన తేదీనుండి అమలు పరచమని (ప్రాస్పెక్టివ్‌గా) ఉపాధ్యాయ సంఘాలు చేసిన డిమాండ్‌ను ఆ ప్రభుత్వం అంగీకరించి చట్టాన్ని సవరించింది. ఆ ఉపాధ్యాయులకు కొంత ఉపశమనం లభించింది. ఈ సౌలభ్యాన్ని తిరిగి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో రద్దుచేసి తిరిగి చట్టంచేసింది. కొండనాలుకకు మందేస్తే వున్న నాలుక వూడిందన్న చందంగా అన్‌ఎయిడెడ్ సర్వీస్‌ను ఒక సమస్యగా యీ ప్రభుత్వం సృష్టించింది. ఈ చట్టాన్ని ప్రాస్పెక్టివ్‌గా అమలు చేయమని జాక్టో డిమాండ్ చేస్తోంది. ఈ విధంగా ఆ చట్టాన్ని సవరించి, అమలుచేస్తే అయ్యే ఖర్చు రు40కోట్లు!

భాషా పండితులకు గ్రేడ్-1 సౌలభ్యం: గ్రేడ్-1 అర్హతలు కల్గి గ్రేడ్-2 టీచర్స్‌గా పనిచేస్తున్న భాషాపండితులకు 1983లో 330 ఉత్తర్వు జారీచేసి, ఆనాడు యీ సౌలభ్యాన్ని వర్తింపచేసింది. ఆ తర్వాత అటువంటి వారు ఆ సౌలభ్యాన్ని అడిగితే ప్రభుత్వం తిరస్కరించింది. వారిలో కొంతమంది కోర్టును ఆశ్రయించి అనుకూలమైన తీర్పులు తెచ్చుకొన్నారు. వీటిని అమలుచేయలేదు సరిగదా 1983లో ఆ సౌలభ్యాన్ని వర్తింపచేసిన భాషాపండితులకు కూడా దానిని రద్దుచేస్తూ 2005లో చట్టంచేసింది. దీనిద్వారా 1983కి ముందున్న భాషాపండితులు కూడా గ్రేడ్-1 సౌలభ్యాన్ని కోల్పోయే స్థితికి నెట్టింది. తమవర్గ ప్రయోజనాలకోసం పాలకులు ఎంతదారుణానికైనా ఎలా ఒడిగట్టుతారో యీ సమస్య విదితంచేస్తోంది. ఉదహరించిన పై సమస్యలు పాలకులు సృష్టించుతున్నవే. అంతేగాక ఎయిడెడ్ మున్సిపల్ యాజమాన్యం పేరుతో వాటిల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కొన్ని సౌలభ్యాలను ప్రభుత్వోపాధ్యాయులతో సమానంగా వర్తించేయక వివక్ష చూపుతున్నది. దాదాపు జాక్టో ప్రభుత్వం ముందు పెట్టిన డిమాండ్లు ఇటువంటివే. ఇవి ఆర్థిక భారంతో కూడినవని ప్రభుత్వం చేసే వాదనలు కుతర్కంతో కూడినవే.

సమస్యల పరిష్కారంలో కోర్టుల జోక్యం అవాంఛనీయమైనది. దాని సూచనలను, తీర్పులను అడ్డంపెట్టుకొని ఉపాధ్యాయుల సమ్మెను నిర్వీర్యం చేయడమో, అణచివేయడమో సాధ్యంకాదని, విజ్ఞతను ప్రదర్శించి, గతంలో ప్రభుత్వం యిచ్చిన హామీలను నెరవేర్చడమే సమ్మెకు పరిష్కారం లభించుతుంది.

ఉపాధ్యాయుల సమస్యలు నేటి వ్యవస్థలో ఇసుకపాతర చందంగానే వుంటున్నాయి, ఉంటాయి. అది ఈ వ్యవస్థ లక్షణం! అయితే ఉద్యమాలద్వారా సాధించుకొనే సౌలభ్యాలు కొంత ఉపశమనం కల్గించుతాయనడంలో సందేహం లేదు. వ్యవస్థతో ముడిపడిన కొన్ని సమస్యలకు పూర్తి పరిష్కారం లభించదు. ఒకవైపు డిమాండ్ల సాధన ఉపశమనంకోసం ఐక్యంగా నిలబడి పోరాటాలు సాగించాలి. అయితే, ఆర్థిక డిమాండ్లకే పరిమితం రాదు. ప్రజాతంత్ర వ్యవస్థ సాధనకోసం ప్రజాతంత్రశక్తులు సాగించే ఉద్యమాలలోను భాగస్వాములు కావడం, సంఘీభావంగా నిలబడటంకోసం ఉపాధ్యాయులలో ప్రజాతంత్ర చైతన్యాన్ని పెంపొందించే దిశగా ఉపాధ్యాయ సంఘాలు ముందుకు సాగడం అవసరం!

30.10.2008

(4వ పేజీ తరువాయి)

-వారిని తొలగించి, క్రొత్తగా అప్రెంటీస్‌లను నియమించుకొంటున్నాయి. ఇలా ఎందుకు చేస్తున్నారంటే, "శాశ్వత ప్రాతిపదికపైన నియమించబడ్డ కార్మికులు మంచి పని సంస్కృతిని కొనసాగించరు. వీరికి పనిపట్ల నిబద్ధత, అంకిత భావం వుండదు. అందుకే బాలికలను 3 ఏళ్లు అప్రెంటీసుగా నియమించుకొంటున్నాము" అంటూ దక్షిణ భారతీయ మిల్లుల సంఘం కార్యదర్శి ప్రకటిస్తున్నాడు. అంతేకాదు "మేము 8 గంటల షిఫ్టులు ప్రవేశపెడతామంటే ఈ బాలికలు ఒప్పుకోవటల్లేదు. వారు ఎక్కువసేపు పనిచేసి ఎక్కువ సంపాదించుకోవాలని కోరుకొంటున్నారు" అంటూ ఘరానాగా ప్రకటిస్తున్నాడు.

తమిళనాడులో అమలు జరుపబడుతున్న ఈ అప్రెంటీస్ విధానం మరొక సామాజిక దురాచారానికి కారణం అవుతోంది. తమ బిడ్డలను పనికి పంపించిన తల్లితండ్రులు, వారు సంపాదించిన జీతాన్ని స్వయంగా తామే కంపెనీ నుండి వసూలు చేసుకొంటున్నారు. అంతేకాక ఆ బాలికలు 3 సంవత్సరాల తర్వాత పని మానేద్దామనుకొన్నా తల్లితండ్రులు ఒప్పుకోవటల్లేదు. వారు సంపాదించే డబ్బుతో తమ కొడుకులను పెద్ద చదువులు చదివించటం అనే పద్ధతికి అలవాటుబడ్డారు. అంటే ఆడపిల్ల చేత చాకిరీ చేయించుకొని, ఆ సంపాదనతో మగపిల్లల చదువు, అభివృద్ధిలను పెంపొందించే దురాచారం ఈ ప్రాంతంలో రూపుదిద్దుకొంటోందన్నమాట. ఇప్పటికే భూస్వామ్య సంస్కృతి ప్రభావంతో అణచివేయబడుతున్న, మహిళలు-బాలికలను, ఈ రూపంలో అణచివేయటానికి ఈ పథకం ఒక సాధనంగా ఉపయోగపడుతోందన్నమాట.

మరోవైపు ఈ బాలికలను-యువతులను బహిష్టు దినాల్లో కూడా తేలికపాటి పని యివ్వటానికి నిరాకరిస్తూ, మిల్లు యాజమాన్యాలు పని చేయించుకుంటున్నాయి. కాకపోతే ఆ రోజుల్లో వారికి ఉచితంగా గానీ, తక్కువ రేటుకు గానీ శానిటరీ నేప్‌కిన్స్ సరఫరా చేసి పుణ్యం కట్టుకొంటాయట. అంటే తాము ఆ బాలికలతో, వీలయినంత పనిని రాబట్టుకోవటానికి అవసరమయిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తాయి తప్ప, వారికి పనిభారం తగ్గించవట!

మిల్లు ప్రాంతంలో దేవాలయాలను నిర్మించి తమ ఉదారత్వాన్ని ప్రదర్శిస్తూ, కార్మికులను తమ దగ్గర పని చేయటానికి ఫ్యూడల్ పద్ధతిలో లోబరుచుకొంటూనే, శానిటరీ నేప్‌కిన్స్‌ను తక్కువ ధరకో-ఉచితంగానో సరఫరా చేసే రూపంలో పెట్టుబడిదారీ పద్ధతిలో వారి శ్రమను నిర్దాక్షిణ్యంగా దోచుకుంటున్నారన్న మాట.

ఢిల్లీలో: ఐ.ఎల్.ఒకు చెందిన అధ్యయనంలో, దేశ రాజధానిలోగల ఒక దుస్తుల ఫ్యాక్టరీలోని కార్మికులు ప్రతిరోజూ పాయిఖానా ముందు ఒక అరగంట సేపు క్యూలో నుంచోవాల్సి వుంటుందనీ, మహిళా కార్మికులు కూడా పురుషుల టాయ్‌లెట్స్‌నే వాడుకోవాల్సిన నిర్బంధ పరిస్థితుల్లో వున్నారనీ, వారికి తాగటానికి మంచినీటి సదుపాయంకానీ, క్యాంటీన్, రెస్టురూం సదుపాయాలు కానీ లేవనీ వెల్లడించటం జరిగింది.

ఆంధ్రప్రదేశ్‌లో: ఇటీవలనే అంటే 25.10.2008న మెదక్‌జిల్లాలోని, సదాశివపేటలోగల ప్రియదర్శిని స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్న 300మంది బాలికలను(బాల కార్మికులను) లేబర్ డిపార్టుమెంటు, రెవెన్యూ డిపార్టుమెంటు అధికారులు, దాడిచేసి కనుగొని వారిని రక్షిస్తున్నట్టు ప్రకటించటం జరిగింది. వారి ఫోటోను కూడా పత్రికలు ప్రకటించాయి. వారంతా ముక్కుపచ్చలారని పిన్న వయస్కులైన బాలికలే. అయినా యాజమాన్యం వారందరూ చట్ట ప్రకారం వుండాల్సిన ఈడుగల వాళ్ళేనని బుకాయిస్తోంది. దీన్నిబట్టి చూస్తే నూలుమిల్లులు (రెడీమెడ్ పరిశ్రమకు నూలును సరఫరా చేసే ఎగుమతిదారులు) ఎంతటి నికృష్టమయిన దోపిడీకి పాల్పడుతున్నాయో అర్థమవుతుంది.

ఇదే విధంగా గుంటూరు పరిసరాల్లో వున్న నూలుమిల్లుల కోసం దళారుల ద్వారా యాజమాన్యాలు విజయనగరం, శ్రీకాకుళ ప్రాంతాల నుండి బాలికలను తరలించుకు రావటం అన్నది నిరంతరం సాగుతున్న ప్రక్రియగా వుంది.

బాల కార్మికుల శ్రమ దోపిడీ:

బ్రిటన్‌కు చెందిన రిటైల్ అమ్మకాల చైన్ స్టోర్సు అయిన ప్రిమార్కు కంపెనీ, తమకు దుస్తులను తయారుచేసి సరఫరా చేసే తిరుపూర్‌కు చెందిన 3 ఎగుమతిదారు కంపెనీలకు ఆ కంపెనీలు తమ ఆర్డర్ల తయారీలో ఎంబ్రాయిడరీ, మెరుపు బట్టలను తయారుచేసే పనిలో బాలకార్మికులను వాడుకుంటున్నాయనే కారణంచేత వాటితో తన సంబంధాలను తెగదెంపులు చేసుకుంటున్నట్లు, ఇచ్చిన ఆర్డర్లు రద్దు చేసుకొంటున్నట్టూ ప్రకటించింది.

అదే విధంగా ఢిల్లీలోగల గేప్ బ్రాండు పేరుగల దుస్తులను తయారుచేసి సరఫరా చేస్తున్న కంపెనీలు 10 సంవత్సరాల బాలకార్మికుల చేత పనిచేయించుకొన్నట్టు ప్రకటించింది.

అయితే తిరుపూర్ ఎగుమతిదారుల సంఘం అధ్యక్షులు ఎ.శక్తివేలు తాము ఎంబ్రాయిడరీ పనులను మానవతా దృక్పథంతో ఒక నిర్వాసితుల శిబిరానికి అప్పచెప్పామనీ, ఆ శిబిరంవారు బహుశా బాలలను ఆ పనులలో వినియోగించి వుండొచ్చనీ, తాము కొన్ని పనులు సబ్ కాంట్రాక్టర్లకు అప్పచెప్పుతున్నామనీ-వారు బాలకార్మికులు చేత వనిచేయించుకొంటూ వుండవచ్చుననీ ఒక వివరణను ప్రకటించాడు. గ్రామాల్లో పనులు లేక పలువురు వలసలు పోతున్నందువలన, హాజయిరీ యూనిట్లు, స్థానిక మార్కెట్ల కోసం చేసే ఉత్పత్తిలో బాలకార్మికులను వాడుకొంటున్నారంటూ తెలియచేస్తున్నాడు.

నిన్నటికినిన్న(26.1.2008) ఢిల్లీలోని జరీ పనుల యూనిట్లలో బాలకార్మికులు పనిచేస్తుండగా అధికారులు పట్టుకొన్నారు.

వీటిని బట్టి అర్థమవుతున్నదేమిటంటే, తమ లాభార్జన కోసం ఈ బట్టల ఉత్పత్తి యూనిట్లలో ఏదో ఒక శాఖలో బాలల శ్రమ వినియోగింపబడి దోపిడీ చేయబడుతోందని అర్థమవుతోంది. ఈ బాలలను సహితం రోజుకు 12 నుండి 16 గంటలు పని చేయించుకొంటూ దారుణమైన పని పరిస్థితుల్లో ఈ పరిశ్రమ దోపిడీకి పాల్పడుతోందని.

ఈ రకంగా మొత్తం పరిశీలించినపుడు ఎగుమతులపై ఆధారపడ్డ పారిశ్రామీకరణ పేరిట, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని పాలక ప్రభుత్వాలూ, పాలకవర్గాలూ, బడా పారిశ్రామికవర్గాలూ, బ్రాండ్-పేరు కంపెనీల పేరిట కొనసాగుతున్న సామ్రాజ్యవాద కంపెనీలు సూపర్ లాభాలను ఆర్జించుకోవటానికి వీలుగా తమ తమ దేశాల్లో పారిశ్రామిక విధానాలను అమలు జరుపుతూ, తమ తమ దేశాల్లోని మహిళల, బాలకార్మికుల శ్రమశక్తిని నికృష్టంగా దోచుకొనే దళారులుగా వ్యవహరిస్తున్నారనీ స్పష్టమవుతోంది. సామ్రాజ్యవాద దళారీల లాభాల, ప్రయోజనాల అభివృద్ధినే వీరు దేశ పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధిగా అబద్ధపు చిత్రీకరణలు చేస్తున్నారు. ఇటువంటి నికృష్ట దోపిడీ విధానాలను, వాటిని అమలు జరుపుతున్న దేశంలోని దళారీ దోపిడీని వ్యతిరేకించాలి. దోపిడీకి గురవుతున్న మహిళా బాల కార్మికులను ఈ దోపిడీకి వ్యతిరేకంగా వర్గచైతన్య అవగాహనా ప్రాతిపదికపై సంఘటితపరచి, దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించటానికి వారిని సమాయత్తం చేయాలి. ఆ రకంగా ఈ మహిళా, బాల కార్మికులపై సాగుతున్న శ్రమదోపిడీ, వేధింపులూ, దుర్మార్గాలనుండి వారిని తప్పించటమేకాక, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సాగుతున్న నిరాఘాటమైన సామ్రాజ్యవాద దోపిడీని ప్రతిఘటించటం సాధ్యమవుతుంది. ◈

సూక్ష్మ సేద్యం పేరుతో ఆహారధాన్యాల సాగుకు మంగళం పాడుతున్న పాలకులు

రాష్ట్రంలోని అన్నిభారీ, మధ్యతరహా ఎత్తిపోతల పథకాల కింద సూక్ష్మసేద్యం చేయాలని 26-9-2008 న జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఆదేశాలు జారీచేయటంతో పాటు, ఆబాధ్యతను భారీ నీటిపారుదల శాఖకు అప్పగించటం ద్వారా 36లక్షల ఎకరాల్లో వరిసేద్యానికి మంగళం పాడుతున్నారు.తమది రైతు సంక్షేమ ప్రభుత్వం అనే ముసుగు తొలగించుకున్నారు.

జలయజ్ఞం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రాంతంలో చేపడుతున్న ప్రాణహిత,చేవెళ్ళ, దేవాదుల, ఎం.ఎం.ఆర్,గుప్త,ఆలిసాగర్,శ్రీపాదసాగర్,రాజీవ్,ఇందిరా సాగర్, కల్వకుర్తి, భీమా,నెట్టెంపాడు,సింగూరు, ఎత్తిపోతల, పథకాల పరిధి లో 34లక్షల ఎకరాల్లో ప్రభుత్వం నిర్ణయం వల్లన రైతాంగం వరిసాగుకు దూరమౌతున్నారు. తెలంగాణ ప్రాంతంలోనే కాకుండా రాయలసీమ ప్రాంతంలోని సి.బి.ఆర్, పులివెందుల, చిత్రావతి, లింగాల, ఇతర ఎత్తిపోతలపథకాల పరిధిలోని రెండున్నర లక్షల ఎకరాల్లో రైతులకు ఇదే పరిస్థితి ఏర్పడనున్నది.

రాష్ట్ర ప్రభుత్వ ఈ నిర్ణయం వెనుక ప్రపంచబ్యాంక్ ఆదేశాలుఉన్నాయి.సాగునీటి ప్రాజెక్టులకు ,చెరువుల, కాల్వల మరమ్మత్తులకు రుణం ఇవ్వాలంటే ,తాను సూచించిన సంస్కరణలు అమలు చేయాలని ప్రపంచబ్యాంకు షరతు విధించింది.నీటి పారుదలశాఖను రెండుగా విభజించాలని, రైతులకు సాగునీరు అందించే బాధ్యతను వదులు కోవాలని ,సాగునీటి సంఘాలు ఏర్పాటుచేసి నీటి నిర్వహణా బాధ్యతను వాటికి అప్పగించాలని,సాగునీటి మీటర్లు పెట్టి రైతుల నుండి నీటి ఛార్జీలు వసూలు చేసి నిర్వహణా బాధ్యత అవి చేపట్టాలని, వీటికి ఎటువంటి నిధులు కేటాయించ రాదని, ఎక్కువ నీరు వినియోగమయ్యే వరిసాగు మాని; బిందు, తుంపర సేద్యంద్వారా పండ్లు, కూరగాయలు, పూలు వంటి ఎగుమతి చేయగల పంటలనూ, ఆరుతడి పంటలను పండించాలన్నవి ప్రపంచబ్యాంక్ ఆదేశాల్లో ముఖ్యమైనవి.

ప్రపంచబ్యాంక్ ఈ షరతులకు ఆమోదం తెలిపిన రాష్ట్రప్రభుత్వం ఆ షరతుల అమలుకు చర్యలు చేపట్టింది. నీటి పారుదల శాఖను, ప్రాజెక్టు పనుల ప్రత్యేక విభాగం, కాల్వల మరమ్మత్తుల నిర్వహణ, నీటి నియంత్రణ రెండు విభాగాలుగా విభజించి, ఒకదానితో మరొకదానికి సంబంధం లేకుండా చేసింది. లాభదాయకం, మార్కెట్ సౌకర్యం పేరుతో కూరగాయలు, పండ్లు, పూలు మొక్కజొన్న పంటలను ప్రోత్సహిస్తూ, ఆహార ధాన్యాల సాగు నిరుత్సాహ పరుస్తున్నది. సాగునీటి నిర్వహణ బాధ్యతను అప్పగించేందుకు గత నెలలో హడావుడిగా నీటిసంఘాల ఎన్నికలు జరిపింది. రాష్ట్రంలోని అన్ని చెరువుల, సాగునీటి వనరుల క్రిందవున్న 10,737 సంఘాలు, 323 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఏర్పడ్డాయి. దేశంలోనే మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో నీటి ప్రాజెక్టు కమిటీల ఎన్నికలు జరిపినట్లు రాష్ట్రప్రభుత్వం గొప్పగా చెప్పుకోవటం ప్రపంచబ్యాంక్ మెప్పుకోసమే.

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో సూక్ష్మ సేద్యానికి పెద్దఎత్తున ప్రాధాన్యత ఇవ్వటం జరిగింది. రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరింత వేగంగా ఈ విధానాలను అమలు జరుపుతున్నారు. 9-2-2007న భారీ ఎత్తిపోతల నీటి పథకాల క్రింద సూక్ష్మసేద్యం చేపట్టాలని జి.ఓ.నెం.34 జారీచేసింది. దీనిపై పెద్దఎత్తున రైతులనుండి వ్యతిరేకత రావటంతో వెనక్కితగ్గి ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సంవత్సరం తర్వాత ఆ జి.వో.ను పూర్తిగా అమలు చేయాలని తిరిగి ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

ప్రభుత్వం తీసుకొన్న ఈ నిర్ణయాన్ని రాజకీయం చేయవద్దని, ప్రయోగాత్మకంగా చేపట్టిన సూక్ష్మసేద్యంతో రైతులు ఆనందంగా ఉన్నారని, అందుకే దీన్ని పూర్తిగా అమలు జరుపుతున్నామని భారీ నీటి పారుదల శాఖమంత్రి పొన్నాల లక్ష్మయ్య చెప్పటం, రైతాంగాన్ని అపహాస్యం చేయటమే.

ఈ పద్ధతులను రైతాంగం అనుసరించేట్లుగా చేయటానికి సూక్ష్మసేద్య పరికరాలకు ప్రభుత్వం 90శాతం వరకూ సబ్సిడీ నిస్తున్నది. ఇవి అమలు చేసిన తర్వాత ఎత్తిపోతల పథకాల ఖర్చునంతా తిరిగి చెల్లించాలంటూ నీటి తీరువాను పెంచుతుంది.

బిందు, తుంపర సేద్యానికి రాష్ట్రప్రభుత్వం ఇస్తున్న ప్రచారం, రాయితీలు, సబ్సిడీలు రైతాంగం ప్రయోజనంకోసం కాదు. దేశ ప్రజల ఆహార సమస్యను తీర్చటం అందుకు ఆహారధాన్యాల పంటల విస్తీర్ణం పెంచటం నిజమైన పాలకుల కర్తవ్యం. మనదేశ పాలకులకు అలాంటి జాతీయ విధానం లేదు. దానికి బదులుగా ప్రపంచబ్యాంకు సహాయంతో చేపట్టిన చర్యలు వ్యవసాయాన్ని సామ్రాజ్యవాద గుత్తకంపెనీలకు ముడిసరుకును సరఫరా చేసేదిగా మారుస్తాయి. వ్యవసాయ రంగానికందజేస్తున్న అన్నిరకాల మద్దతులను తొలగించటం, మార్కెట్టుశక్తుల నదుపుచేయకుండా వుండటంద్వారా రైతాంగాన్ని నష్టపరుస్తున్నారు. దీనినుండి బయట పడాలంటే, మార్కెట్టులో అమ్ముడయ్యే పంటలు వేయమంటూ ఈ వైపు నెడుతున్నారు. తద్వారా క్రమంగా గుత్తకంపెనీలకోసం ఉత్పత్తి చేయిస్తారు. ఫలితంగా, ఆహారపంటలు తగ్గిపోయి, ఇతర దేశాలపై ఆధారపడే స్థితి, పేదలు ఆహారానికి దూరమవటం జరుగుతుంది.

బిందు, తుంపర సేద్యం ద్వారా పండించే పండ్లు, కూరగాయలు, పూలకు మార్కెట్‌లో గిరాకి ఉండటంవలన రైతుకు ఆదాయం ఎక్కువగా వస్తుందని ప్రభుత్వం చెప్పటం మోసపూరితమైందే. సామ్రాజ్యవాద దేశాల కంపెనీలు, తమ అవసరాలను తీర్చేపంటలకు మొదట రైతుకు అనుకూలమైన రేటు ఇచ్చినా, ఆ పంటల సాగు పెరిగిన తర్వాత ధరను దారుణంగా తగ్గించి రైతును విపరీతంగా దోపిడీ చేస్తారు. గత్యంతరంలేని పరిస్థితుల్లో రైతు, వారు చెప్పిన రేటుకి పంటను అమ్ముకోవాల్సిన స్థితికి నెట్టబడతాడు. ఫలితంగా రైతాంగం సంక్షోభంలో పడకతప్పదు. కుప్పం కార్పొరేట్, కాంట్రాక్టు వ్యవసాయం, పత్తి రైతాంగం, తాజాగా సుబాబుల్ సాగురైతుల సంక్షోభం ఇందుకు నిదర్శనం. అందువలన సూక్ష్మసేద్యం వలన రైతాంగం తీవ్ర సంక్షోభంలో పడే ప్రమాదం పొంచి వుంది. అలాంటి సంక్షోభంలోకి దించి కాంట్రాక్టు వ్యవసాయమే పరిష్కారమనుకునే వైపుకు రైతాంగాన్ని నెడతారు.

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్నిరకాల ఎత్తిపోతల పథకాల్లో సూక్ష్మసేద్యాన్ని వచ్చే ఖరీఫ్ సీజన్‌నుండి పూర్తిగా అమలు జరపటానికి నీటి పారుదలశాఖ సిద్ధమౌతూ, సాగునీటి సంఘాలను అందుకు సమాయత్తం చేస్తున్నది. 2008-09 సంవత్సరంలో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో ఈ సేద్యాన్ని చేపట్టాలనే లక్ష్యంతో ప్రణాళికను సిద్ధంచేసుకొని 504.61 కోట్లు ఇందుకు ఖర్చుపెట్టనున్నది. 250 కోట్లను రైతులకు సబ్సిడీలు ఇస్తున్నట్లు ప్రకటించింది.

సూక్ష్మ(బిందు-తుంపర) సేద్యాన్ని సాగునీటి పారుదలశాఖతోపాటు, ప్రైవేటుశాఖలకు అప్పగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో బిందు, తుంపర సేద్యాన్ని 2003 నుండి పాలకులు అమలు జరుపుతున్నారు. ఉద్యానవనశాఖ పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఈ సేద్యాన్ని చేపట్టలేకపోవటంవలన, ఈ సేద్యాన్ని తీవ్రతరం చేసేందుకు రాష్ట్రంలోని 20 ప్రయివేటు సంస్థలకు ఆ బాధ్యత అప్పగించింది.

రాష్ట్రప్రభుత్వం ఈ ప్రయివేటు ప్రాజెక్టులకు అప్పగించిన భూముల కేటాయింపులు ఈ విధంగా వున్నాయి. జైన్ ఇరిగేషన్ కంపెనీకి 36,500, ప్లాస్ట్రో కంపెనీకి 16,200, నెటాఫాం కంపెనీకి 18,200, ఐ.టి.సి. కంపెనీకి 3,400, ప్రీమియమ్ కంపెనీకి 5,300, పారిక్సిట్ కంపెనీకి 3,300, నాగార్జున కంపెనీకి 7,700, నంది కంపెనీకి 1,700, కుమార్ కంపెనీకి 4,100, సుధాకర్ కంపెనీకి 5,300, స్వాతికంపెనీకి 4,300, గ్రీన్ ఫీల్డ్ కంపెనీకి 3,700, ఆగ్రోప్లాస్ట్ కంపెనీకి 1000, మెగా కంపెనీకి 1000, గోదావరి కంపెనీకి 7,900, సత్యశాయి కంపెనీకి 3,300 హెక్టార్లు లక్ష్యంగా బాధ్యత అప్పగించింది. ఈ భూములలోని రైతాంగంతో సూక్ష్మసేద్య పద్ధతులను అవలబింవచేయటం ఈ కంపెనీల పని. కొంత భూమిని వాటికే ఇచ్చారేమో తెలియదు. ఇలాంటి విధానాల ద్వారా ప్రతిసంవత్సరం లక్షాయాభైవేల ఎకరాల్లో బిందు, తుంపర సేద్యాన్ని విస్తరింపచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

సూక్ష్మ సేద్య విస్తరణ బాధ్యతను కంపెనీలకు అప్పగించటంవలన, రైతులపై అనేక వత్తిడిలు తెచ్చి వప్పించేందుకు ఇవి పూనుకొంటాయి. అంతేకాకుండా స్వయంగా సేద్యానికి ఉపక్రమిస్తాయి. ఫలితంగా ప్రభుత్వం యిచ్చే సబ్సిడీని ఈ కంపెనీలే పొందుతాయి. తద్వారా కోట్లాది రూపాయలు లబ్దిపొందుతాయి. భూములపై ఆధిపత్యం ఈ కంపెనీలకు ఏర్పడుతుంది. ఫలితంగా ఆహారపంటల విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయి ఆహారోత్పత్తి పడిపోతుంది.

ప్రపపంచబ్యాంక్ ఆదేశాలకు అణుగుణంగా సామ్రాజ్యవాద గుత్త కంపెనీల దోపిడీ ప్రయోజనాలకు అనుకూలంగా, మన వ్యవసాయ రంగాన్ని మలుస్తూ దేశ, రైతు ప్రయోజనాలను కేంద్ర-రాష్ట్ర పాలకులు దెబ్బతీస్తున్నారు. అందులో భాగమే బిందు, తుంపర సేద్యం. దీన్ని ప్రతిఘటించాలి. రైతు ప్రయోజనాలు కాపాడుతూ, ప్రజల ఆహార సమస్యను తీర్చే వ్యవసాయ విధానాలకోసం యావత్ రైతు కూలీలు ఉద్యమించాలి.

- జాలయ్య

పాలకుల-కార్మిక వ్యతిరేక, దోపిడీవర్గ ప్రయోజన పరిరక్షణకు, 'కృష్ణా సిమెంట్స్' మరో నగ్నమైన ఉదాహరణ

గుంటూరుజిల్లా తాడేపల్లి మండలం కృష్ణనగర్ (గ్రామపంచాయతీ పరిధిలో 1944లో ఏసిసి (అసోసియేటెడ్ సిమెంట్ కంపెనీ) యాజమాన్యం కెసిడబ్ల్యు (కృష్ణా సిమెంట్స్ వర్క్స్)ను స్థాపించింది. ఈ ఫ్యాక్టరీలో పనిచేయటంద్వారా 1200 మందికి, పరోక్షంగా మరో 1500 మందికి ఉపాధి లభించింది.

ఆనాటికి రాష్ట్రంలోనే పెద్దదైన ఈ ఫ్యాక్టరీ అవసరాలకోసం ఆనాడే ప్రభుత్వం కాజలో క్వారీని, చినకాకాని, యూనివర్శిటీ వద్ద భూములను, పిడుగురాళ్ళ వద్ద సీతారాంపురంలో క్వారీలను సమకూర్చింది.

ప్రారంభంలోనే యాజమాన్యం తనవద్ద పనిచేసే 64మంది కార్మికులకు క్వార్టర్స్ కట్టించింది. మిగిలిన కార్మికులు గుడిశెలు వేసుకోవటానికి నివాస స్థలాలను కేటాయించి, కలప, నిర్మాణ సామ్రాగ్రి సమకూర్చింది. ఫ్యాక్టరీ కార్మికుల సంక్షేమంకోసం ఒక పూర్తికాలపు ఆస్పత్రిని యాజమాన్యం ఏర్పాటు చేసింది. కార్మికుల మానసిక ఉల్లాసంకోసం ఒక రిక్రియేషన్ క్లబ్బును కూడా ఏర్పరిచింది. కాలక్రమంలో కెసి వర్క్స్ అభివృద్ధిచెందింది, విస్తరించింది-వేల కోట్ల రూపాయల ఉత్పత్తి సాగించింది. ఆనాడున్న బలమైన కార్మికోద్యమం కారణంగా కూడా కార్మికుల జీవన పరిస్థితులు, సంక్షేమ కార్యక్రమాలు మెరుగౌతూవచ్చాయి.

1980ల నాటికి నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలు, వేగం, పెట్టుబడిదారుల మధ్య పోటీతో సిమెంటు పరిశ్రమ సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఇదే కాలంలో పలుచీలికల కారణంగా కార్మికోద్యమం బలహీన పడటంతో, సంక్షోభం కారణంగా కార్మికులకు ఎదురైన సమస్యలను సమర్ధవంతంగా ఎదుర్కోలేకపోయింది. 1989ల నాటికి యాజమాన్యం కెసిడబ్ల్యు పేరును బినామీ కంపెనీ ఎఫ్ఐసిగా మార్చివేసింది.

1992ల నాటికి యాజమాన్యం తనకు నష్టాలు వస్తున్నాయనే పాటపాడటం మొదలుపెట్టింది. ఉత్పత్తి ఖర్చుల తగ్గింపుపేరిట పలుకార్మిక సంక్షేమ కార్యక్రమాల్లో కోత విధించింది. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, పోటీని తట్టుకోలేకపోతున్నామనే పేరిట ఒక 'క్లిన్'ను నడపకుండా ఆపివేసి, ఆ మేరకు కార్మికుల సంఖ్యను కుదించుకుంటూ వచ్చింది. క్రమంగా నెలవారీ జీతాలు ఆలస్యంగా చెల్లించటం మొదలుపెట్టింది. యాజమాన్య నిరంకుశ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తే కంపెనీ మూసేస్తానని కార్మికులను యాజమాన్యం భయపెడుతూ వచ్చింది. దీనిని అధిగమించి కార్మికులను కూడగట్టి ఐక్యంగా నడుపగల నాయకత్వం లోపించింది.

ఎఫ్ఐసి సంస్థ మొదట మెట్టుగా విఆర్ఎస్(స్వచ్ఛంద పదవీ విరమణ) తీసుకొని వెళ్ళమని కార్మికులను కోరింది. ఆనాటి గుర్తింపు సంఘ నాయకత్వం(ఐఎన్‌టియుసి) విఆర్ఎస్‌ను ఆమోదించి, కార్మికులమీద వత్తిడితెచ్చి కొందరిని విఆర్ఎస్‌కు అంగీకరింపజేసింది. ఈలోగా ఎఫ్ఐఎల్ సంస్థనుండి ఫ్యాక్టరీని హెచ్ఎంపి, కెసిఎల్ అనే బినామీ పేర్లకు బదలాయిస్తూ కుట్రపూరితంగా యాజమాన్యం వ్యవహరించింది.

కరెంట్ బిల్‌కట్టలేదనే కారణంగా కార్మికుల క్వార్టర్స్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడింది. నీటి సరఫరా ఆగిపోయింది. ఆస్పత్రిని, స్కూల్‌ని మూసి వేశారు. జీతాలు సక్రమంగా చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయటంతో కార్మికులు తీవ్ర సమస్యలను ఎదుర్కొన్నారు.

ఈ సంక్షోభం మధ్యనే హఠాత్తుగా 29-5-1993 అర్ధరాత్రినుండి ఫ్యాక్టరీ లాకౌట్ చేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. కార్మికుల్ని భయభ్రాంతుల్ని చేయటంకోసం ఫ్యాక్టరీ ఆవరణలో పెద్దఎత్తున పోలీసు బలగాలను మోహరించింది. తాడేపల్లిలో సిమెంట్ ఫ్యాక్టరీని మూసివేసిన ఇదే యాజమాన్యం, దాచేపల్లిలో మరో సిమెంట్ ఫ్యాక్టరీని నెలకొల్పి నడుపుకున్నది. సీతారాంపురంలో క్వారీయింగ్ సాగించింది. యాజమాన్యం తన లాభాలను ఈ విధంగా ఒకవైపున దండుకుంటూనే నష్టాలొస్తున్నాయనే సాకుతో తాడేపల్లి సిమెంట్ ఫ్యారీని మూసివేసి కార్మికుల కుటుంబాలను నడివీధిలోకి నెట్టివేసింది.

కార్మికులు మిలిటెంట్ ఆందోళనకు దిగకుండా యాజమాన్యపు ఏజెంట్లుగా వున్న కొన్ని యూనియన్ల నాయకులు 'జాగ్రత్త' వహించారు. ప్రధానంగా లీగలిస్టు కార్యక్రమాలకు పరిమితం చేశారు.

1993 జూన్ ఒకటోతేదీన ప్రభుత్వం ఫ్యాక్టరీలో లాకౌట్-అక్రమమని ప్రకటించి కార్మికులనందరినీ వెంటనే పనిలోకి తీసుకోవాలని గెజిట్‌లో పేర్కొన్నది. కానీ, యాజమాన్యం ఈ ఉత్తర్వులను ఏమాత్రం ఖాతరు చేయలేదు. ఉత్తర్వులను అమలుచేయకుంటే, యాజమాన్యం మెడలువంచి అమలుచేయటానికి ప్రభుత్వం పూనుకోలేదు. కనుక, కంటితుడపు ఉత్తర్వులు జారీచేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. ఫ్యాక్టరీ శాశ్వతంగా మూతబడిపోయింది. ఒక్కసారిగా జీవనాధారంకోల్పోయిన కార్మికులు రెక్కలు తెగిన పక్షులయ్యారు- పొట్టచేత బట్టుకొని చెట్టుకొకరు పుట్టకొకరయ్యారు. చదువులు ఆపివేసి, పిల్లలను కూలీపనులకు పంపించారు. కొందరి పిల్లలు చిల్లర దొంగలుగా మారారు-ఒకనాడు పచ్చగా వున్న కృష్ణా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కుటుంబాలలో ఈనాటికి 50మంది ఆకలిమరణాల పాలయ్యారు. ఫ్యాక్టరీ తెరిపించి కార్మికుల ఉపాధిని పునరుద్ధరించాలనే డిమాండ్ స్థానంలో కార్మికులకు కంపెనీ చెల్లించాల్సిన బకాయిల నైనా వెంటనే చెల్లించాలని కార్మికులు కోరే స్థితిలోకి నెట్టబడ్డారు.

కార్మికుల కష్టార్జితంతో వందలకోట్ల లాభాలను కూడబెట్టుకొన్న కంపెనీ యాజమాన్యం, కార్మికుల ఈ కనీస కోర్కెను కూడా నిరాకరించింది. ప్రభుత్వంనుండి ఫ్యాక్టరీకి సంక్రమించిన భూములను రాజకీయ దళారులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకోని సొమ్ముచేసుకోవటం మొదలు పెట్టింది. వందలకోట్ల విలువైన ఆస్తులను కేవలం 10కోట్ల 92 లక్షలకు బాలభానుఎంటర్‌ప్రైజెస్‌కు అమ్మింది. ఫ్యాక్టరీ లాకౌట్ కారణంగా చెల్లాచెదురైన వారుపోగా, వున్న 333 కుటుంబాలకైనా ఫ్యాక్టరీ యాజమాన్యం బకాయిలు (అనాటి లెక్కల్లో సుమారు 30కోట్ల రూపాయలు) ఒక్కపైసా చెల్లింపులు చేయలేదు.

ఫ్యాక్టరీ ఆస్థుల కొనుగోలుదారులు 2003 అక్టోబర్‌లో బుల్‌డోజర్లు, ప్రొక్లెయినర్లు తెచ్చి, ఫ్యాక్టరీ భవనాలను కూలగొట్టే ప్రయత్నాలు చేశారు. దీనిని అక్కడున్న కార్మికులు అడ్డుకుని, కలెక్టర్‌ను జోక్యం చేసుకొని తమకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించి న్యాయం చేయవలసిందిగా కోరారు. జిల్లా ఉన్నతాధికారి అయిన కలెక్టరు తన నిస్సహాయతను వ్యక్తంచేస్తూ యాజమాన్య విధానాలకు అనుగుణంగా వ్యవహరించటంద్వారా దోపిడీ అనుకూల ప్రభుత్వ యంత్రాంగ స్వభావాన్ని మరోమారు చాటుకున్నాడు.

ఈనాడు 'సెజ్'ల పేరుతో, 'కారిడార్'ల పేరుతో ప్రభుత్వం లక్షలాది ఎకరాల భూములను రైతులనుండి బలవంతంగా పెరుక్కొంటున్నది. పెద్దఎత్తున పరిశ్రమలు స్థాపించి, ఉపాధి కల్పించి, అభివృద్ధి చేయవూనుకుంటుంటే, ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని ప్రభుత్వం విరుచుకుపడుతున్నది. కానీ, మరోవైపున మన కళ్ళెదుటే పచ్చపచ్చగా జీవిస్తున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల జీవితాలను యాజమాన్యం బుగ్గిచేస్తుంటే, ఫ్యాక్టరీని తెరిపించకుండా ప్రభుత్వం మిన్నకున్నదంటే, ప్రభుత్వ 'అభివృద్ధి' నినాద నిజస్వరూపం వెల్లడౌతున్నది.

కృష్ణా సిమెంట్స్ కార్మికుల స్వేదం, రక్తంతోనే ఫ్యాక్టరీ, ఆస్తులు అభివృద్ధి చెందాయనేది, యాజమాన్యం పెద్దఎత్తున సంపదలను పోగేసుకున్నదనే విషయం నిర్వివాదాంశం. కానీ, ఈ సంపద సృష్టికర్తలయిన కార్మికులను నట్టేటముంచి, దర్జాగా జిల్లాలోనే మరోచోట ఇంకో సిమెంట్ ఫ్యాక్టరీని ప్రారంభించిన యాజమాన్యాన్ని ఈ ప్రభుత్వాలు ఏవీ నిరోధించవని, కార్మికులకు న్యాయంచేయవని మరోసారి స్పష్టమౌతున్నది. అంతేకాదు, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకుండా ఫ్యాక్టరీ అవసరాలకోసం ప్రభుత్వం సమకూర్చిన భూములను, క్వారీలను ఫ్యాక్టరీ యాజమాన్యం తెగ నమ్ముతుంటే, తమ వాటాలు తాము పొంది, ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహిస్తున్నదంటే-ప్రభుత్వం, ఏవర్గ ప్రయోజనాలు కాపాడటానికి ఉనికిలో ఉన్నదనేది తేటతెల్లమౌతున్నది. పాలకుల-కార్మిక వ్యతిరేక, దోపిడీవర్గ ప్రయోజనాల పరిరక్షణకు కృష్ణాసిమెంట్స్ మరో ఉదాహరణ మాత్రమే!

◈

అక్టోబరు విప్లవం

- హొవర్డ్ ఫాస్ట్

అమ్మ ఒడిలో వున్న మూడేళ్ళ బాలుడ్ని నేనప్పుడు
ఎన్నెన్ని బాధలో నిండిన వైభవోజ్జ్వల ఉద్యమం
రగిలించిన మెరిసే అగ్నికణమది.
బజ్జోరా పాపా బజ్జో
కిటికీ నుంచి వచ్చే గాలులు నిద్ర బుచ్చుతాయి నిన్ను
నీ నిద్రలో వింటావు ఉదయపు గాలులతో
రెపరెపలాడే అరుణపతాక గీతాలు

ఇక ఇప్పుడు నా పిల్లలు నిద్రబోతున్నారు
పిల్లలూ! నిద్రపోండి బాగా నిద్రపొండి
మీకే చీకూ చింతా లేదు
మీకు జైళ్ళూ లేవు, ప్రాణాలు తీసే కొరడాలు లేవు, నానా రకాల భయాలు లేవు

ఎందుకంటే ఇది అక్టోబర్ కదా పిల్లలూ-
సుదూర ప్రాంతంలో మనిషి స్వేచ్ఛను నిర్మిస్తున్నాడు.
మరణించిన శిశువును చేతుల్లో పెట్టుకున్న
కొరియన్ తల్లికి నేనేం చెప్పాలి?
తిరిగిరాని తీరాలకు పోయిన తన ప్రియుని గురించి
గ్రీసు దేశపు యువతికి నేనేం చెప్పాలి?
నేనే వెళ్ళిపోయినపుడు నా పిల్లలకి నేనేం చెప్పాలి?
నేను వెళ్ళినా తిరిగి వస్తాను
ఇది ఉషోదయ సమయం గనుక
ఒక ఉద్యానవనం లాంటిది మీ సుందర ప్రపంచం
పరిపూర్ణంగా రూపుదిద్దుకుంటావక్కడ నీవు
సగర్వంగా నించుంటావు దాని మధ్యలో నీవు
నా కలలను స్పృశిస్తుంటావు
కార్మికులు ఉవ్వెత్తున ఎగసిన అక్టోబరు విప్లవం యిది.
స్వచ్ఛమైన గాలుల్లో అరుణపతాకాలెగిరిన సమయం యిది.
జగత్తంతా ఆ గానం వినబడిన సమయం యిది.

తీవ్ర నిర్బంధం మధ్య ఎర్రజొన్న రైతాంగ మహాధర్నా

అక్టోబరు 23న గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎర్రజొన్న రైతాంగంకి ఉన్న బకాయిలు చెల్లించాలని కోరుతూ వివిధ సంస్థలు మహాధర్నాకు పిలుపు ఇచ్చాయి. 16.6.2008 నాటి మహాధర్నాకి అనుమతి ఇచ్చిన పోలీసులు నాటి రైతుల ఆగ్రహాన్ని చూసిన పోలీసు యంత్రాంగం ఈసారి ఈ ధర్నాను భగ్నం చేసేందుకు అన్ని ప్రయత్నాలను చేసింది. ఆర్మూరుకి వచ్చే అన్నిదారులను మూసివూసి పోలీసు పికెట్‌లు ఏర్పరచింది. ఆర్మూర్‌లో 144 సెక్షను విధించి పోలీసులే 23వ తేదీ ఉదయం నుంచి దుకాణాలన్నీ బందుచేసి వీధులలో ఎవరూ తిరగకుండా చేసారు. డి.యస్.పినే స్వయంగా మైకు పెట్టుకొని వీధులలో తిరుగుతూ 144 సెక్షన్‌ను కర్ఫ్యూ స్థాయిలో అమలుచేశారు. 16.6.2008 నాటి ఆందోళనలో పాల్గొన్న రైతుల మీద ఉన్న కేసులు ఇంకా ఉన్నాయని ఇపుడు 23వ తేదీ జరిగే ఆందోళనలో మరల పాల్గొంటే ఆ కేసులు రద్దు చేయడం జరగదని కొత్త కేసులు వస్తాయని, గ్రామంలో ముఖ్యమైన కూడళ్ళ వద్ద ప్రచారం చేస్తూనే వీధులలోకి వచ్చిన రైతు సంఘాల నాయకులను, అరెస్టులు చేయడం ప్రారంభించారు.

స్వదేశీ జాగరణ్‌మంచ్ నాయకులు కొటపాడు నరసింహంనాయుడు ఏ.పి.రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, రైతుకూలీసంఘం ఆంధ్రప్రదేశ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి గంగుల నర్సయ్య, కె.గంగాధర్ తదితరులు. భారతీయ కిసాన్ సంఘ్ సంఘటన కార్యదర్శి కె.సాయిరెడ్డి, తెలుగురైతునాయకులు చెరకు ముత్యంరెడ్డి, టి.ఆర్.ఎస్.రైతు విభాగ నాయకులు వేముల సంకరరెడ్డి తదితరులను అరెస్టు చేశారు. ధర్నాలో పాల్గొనేందుకు లారీలలో బయలుదేరిన రైతులను, వేల్పూరు, మోర్తాడ్, కమ్మరపల్లి, బొల్కొండ్, ఆర్మూర్ మండలాల నుండి ఆర్మూర్ పట్టణంకి బయలుదేరిన రైతాంగను ఎక్కడికక్కడ లారీలను నిలుపుచేసి వెనక్కి తరిమారు. దీనికి నిరసనగా రైతాంగం రోడ్డుపై బైటాయించి తమ నిరసనను తెలిపారు.

16.8.2008 నాటి నిరాహారదీక్షలు, మహా ధర్నాకి పిలుపుఇచ్చిన న్యూడెమోక్రసీ, కాంగ్రెసు, సి.పి.ఐ. యం.యల్ టి.ఆర్.యస్‌లోని విభాగాలు ఈ మహాధర్నాకి దూరంగా ఉన్నారు. దీనికి తమకు సంబంధం లేదని ప్రకటించారు.

16.8.2008 నాటి కాల్పులకి దారితీసిన మహాధర్నా ప్రధానంగా 3 డిమాండ్‌లపై జరిగింది.(నాటి ఆందోళన గురించి 5-9-2008 జనశక్తిని చూడండి) ఆ డిమాండ్లు:

ఎర్రజొన్న వ్యాపారి మహిపాల్‌రెడ్డి కొనడానికి నిరాకరించిన మిగిలిన ఎర్రజొన్నలను ప్రభుత్వమే ఏ.పి.సీడ్స్ ద్వారా కొనుగోలు చేసి 1540 రూ॥లు చెల్లించాలి. 2.మహిపాల్‌రెడ్డి రైతుల నుంచి సేకరించిన అమ్ముకొని కూడా రైతులకి యివ్వని డబ్బులను మహిపాల్‌రెడ్డి ఆస్తులు నుంచి రికవరి చేయాలి. 3.ప్రభుత్వమే ఏ.పి.సీడ్స్ తదితర సంస్థల ద్వారా విత్తనాలు సరఫరా చేసి ధర ప్రకటించి పంట కొనుగోలు చేయాలి. పై డిమాండ్‌లపై ఆనాడు ప్రభుత్వం తక్షణం మిగిలిన 2.70లక్షల క్వింటాళ్ళ ఎర్రజొన్న రైతులకి 1200 క్వింటాల చొప్పున కొనుగోలు చేస్తామని 1540తో మిగిలిన 340రూ॥ల ఎర్రజొన్నలు అమ్మగా వచ్చి లాభాలులోగాని లేక మహిపాల్‌రెడ్డి ఆస్తులు స్వాధీనం ద్వారా సర్దుబాటు చేస్తామని ప్రకటించింది. ఈ విధంగా ఆగస్టు 21న ఉత్తర్వు నె.153ను విడుదల చేసింది. ఆగష్టు 31 లోపు ఈ బకాయిలు తీరుస్తామని ప్రకటించింది. కనుక ప్రభుత్వ జి.వోను అమలు చేయడంలోనూ, రైతాంగంకి కావాల్సిన 10,47 కోట్ల రూపాయలు, తరుగు పేర ప్రభుత్వం మినహాయించిన 36లక్షలను వెంటనే చెల్లించాలన్నది, నూతన విత్తన విధానాలను ప్రకటించి అమలు చేయాలన్నది రైతాంగం చేస్తున్న డిమాండ్ ఆగష్టు 31 దాటి చాలాకాలం అవుతున్న నేటికీ 2.70లక్షల ఎర్రజొన్నలు అమ్మకపు ప్రక్రియ పూర్తికాలేదు. రైతులకి బకాయిలి అందలేదు. నూతన విత్తన విధానం అమలు కాలేదు. దీని ఫలితమే 23 మహాధర్నాకి పిలుపుకి కారణం.

23.10.2008 మహాధర్నాను విజయవంతం చేయమని రైతుకూలీసంఘం ఆంధ్రప్రదేశ్ నిజామాబాద్ జిల్లా కమిటి పిలుపు ఇచ్చింది. స్వతంత్రంగా ఈ కార్యక్రమంలో పాల్గొని అరెస్టులను, నిర్బంధాలను ఎదుర్కొంది. 23.10.2008 నాటి రైతాంగంపై ప్రభుత్వం అమలు చేసిన నిర్బంధాన్ని ఖండిస్తూ అనంతరం పత్రికాప్రకటన విడుదల చేసింది. ★

విత్తనాలు, ఎరువుల సమస్య పరిష్కరించాలి - రై.కూ.సం(ఆం.ప్ర) డిమాండ్

విత్తనాలు, ఎరువుల కొరత సమస్యపై మంత్రి రఘువీరారెడ్డి అఖిలపక్ష రైతు, రైతుకూలీ సంఘాల ప్రతినిధులతో 18-9-08న సమావేశం జరిపారు. ఆ సందర్భంగా ఈ సమస్యపై రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) వైఖరిని తెలుపుతూ అధ్యక్షులు కా॥ఝాన్సీ అందజేసిన పత్రాన్ని ప్రచురిస్తున్నాము.

శ్రీ రఘువీరారెడ్డిగారు
వ్యవసాయశాఖా మాత్యులు
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము.
గౌరవనీయ మంత్రివర్యా!

నేడు రాష్ట్రంలో విత్తనాలు, ఎరువుల సమస్య తీవ్రంగా వుంది. గత దశాబ్దంగా విత్తనాల సమస్య రైతాంగాన్ని పట్టి పల్లారుస్తుండగా, గత రెండు మూడేళ్ళుగా ఎరువుల సమస్య దానికి తోడయ్యింది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను వెంటనే రైతాంగానికి తగినంతగా అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవటంతో పాటు, సమస్య దీర్ఘకాలంగా సాగుతున్నందున వ్యవస్థాగత లోపాలను సరిదిద్దే చర్యలను కూడా వెంటనే తీసుకో వలసిన అవసరముంది.

రైతు, రైతుకూలీ, వ్యవసాయ కార్మిక సంఘాలు 12 కలిసి వ్యవసాయరంగ పరిరక్షణ ఐక్యపోరాట వేదికగా ఏర్పడి వ్యవసాయరంగ నిపుణులతో కమీషన్‌ను ఏర్పాటు చేశాయి. 2002లో కమీషన్ తన నివేదికను ప్రజలకంద జేసింది. ఇతర ముఖ్య సమస్యలతోపాటుగా విత్తనాలు, ఎరువులకు సంబంధించి కూడా కమీషన్ సూచనలు చేసింది. 2004లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేర్పడిన **తర్వాత ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి శ్రీమతి జయతీఘోష్ అధ్యక్షులుగా రైతు సంక్షేమ కమీషన్‌ను నియమించారు. ఈ కమీషను కూడా విత్తనాలు, ఎరువులకు సంబంధించి** తగిన సూచనలుచేసి ప్రభుత్వానికి సమర్పించింది. కమీషను నివేదికను ఆమోదించిన ప్రభుత్వం, ఆ సూచనల అమలుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. (కమీషన్ సూచనలకు అనుబంధం చూడండి)

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) 2004 జూన్ 12న ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి గారికి సమర్పించిన విజ్ఞాపన పత్రంలోనూ తిరిగి జయతీఘోష్ కమీషన్‌కు సమర్పించిన పత్రంలోనూ వ్యవసాయరంగ సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలను తెలుపుతూ విత్తనాలు, ఎరువుల రంగానికి కూడా తగిన చర్యలను సూచించింది. ఈ నేపధ్యంలో నేడు సమస్య తీవ్రతను గమనించిన తర్వాత జయతీఘోష్ కమీషన్ చేసిన సూచనలను అమలుజరిపేందుకు చర్యలు తీసుకుని వుంటే విత్తనాలు ఎరువుల సమస్య ఇంత తీవ్రస్థాయికి చేరి వుండేది కాదని మేము భావిస్తున్నాము.

ఈ క్రింది చర్యలు తీసుకోవటం ద్వారా విత్తనాలు, ఎరువుల సమస్యనుండి రైతాంగాన్ని బయటపడ వేసేందుకు ప్రభుత్వం పూనుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

ఎ.విత్తనాలు:

1. ఎ.పి.సీడ్స్ కార్పోరేషన్‌ను పటిష్టంచేసి, దాని సేవలను విస్తృతపరచాలి.
2. ప్రతి మండలానికి ఒక విత్తన గ్రామాన్ని ఎంపికచేసి రైతుల భాగస్వామ్యంతో సమీప వ్యవసాయ పరిశోధనాశాల సహకారంతో విత్తన తయారీని చేపట్టాలి.
3. విత్తనరంగం నుండి బహుళజాతి కంపెనీలను తొలగించాలి.
4. విత్తనాలను రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల క్షేత్రంలో పరీక్షించిన తర్వాత వాటి నాణ్యతకు సర్టిఫికేట్ యివ్వాలి. ఇది జతపరచిన విత్తనాలనే రాష్ట్ర విత్తనకమిటీ పరిశీలించి అమ్మకానికి అనుమతి పత్రం యివ్వాలి. ఇందుకు తగిన విధంగా విత్తన చట్టంలో సవరణలు చేయాలి.
5. రాష్ట్ర విత్తనకమిటీ అనుమతి లేకుండానే, విత్తనాలను అమ్మే కంపెనీలను వ్యాపారం నుండి తొలగించి, కఠిన శిక్షలు విధించేందుకు వీలుగా చట్టాన్ని సవరించాలి.

బి.ఎరువులు:

1. రసాయనిక ఎరువుల వాడకంలో శాస్త్రీయత కోసం పూనుకోవాలి.
   ఎ. రైతాంగానికి శాస్త్రీయ సలహాలనందజేసే విస్తరణ సేవలను పటిష్టం చేయాలి. వీటిని ప్రవైవేటీకరించే చర్యలను ఆపివేయాలి.
   బి. భూసార పరీక్షా సేవలను యిప్పటికన్నా మిన్నగా రైతాంగానికి అందుబాటులోకి తేవాలి. దీనికోసం మండలానికొక భూసార పరీక్షా కేంద్రాన్ని ప్రభుత్వరంగంలో నెలకొల్పాలి. రైతుకల్లబ్బుల వంటి పేర్లతో కార్పోరేటర్లను ఈ రంగంలోకి అనుమతించరాదు.
2. సుస్థిర అధిక దిగుబడులకు కీలకమైన సేంద్రియ ఎరువులు, సూక్ష్మ పోషకాలు, పచ్చిరొట్ట విత్తనాలను రైతాంగానికి సరఫరా చేయాలి. వాటికి తగిన సాంకేతిక సలహాలనంద జేసేందుకూ భూసార పరీక్షా కేంద్రాలను, విస్తరణ సేవలను వినియోగించాలి.
3. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల మధ్యనున్న అసమతుల్యత వల్ల పరిశ్రమల నుండి వచ్చే వ్యవసాయ ఉత్పాదకాలకు (ఇన్‌పుట్స్) ప్రభుత్వం సబ్సిడీల నివ్వటం సమంజసమైన విధానం. సర్వత్రా ఆర్థికవేత్తలందరూ అంగీకరించిన సూత్రం. అయినప్పటికీ ప్రపంచబ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థల జోక్యంతో దీనిని సబ్సిడీగానూ ఆర్థిక వనరుల వృధాగానూ భావించే ఆలోచనా ధోరణి పెరుగుతున్నది. ఇది సరికాదు. ఇన్‌పుట్స్ సబ్సిడీని అవసరమైన మేరకు పెంచాలి. వ్యవసాయరంగ పురోగతి కుంటుపడకుండా సాగాలన్నా ప్రజలకు సరసమైన ధరలకు ఆహార ధాన్యాలు అందుబాటులోకి తెచ్చి ఆహారభద్రతను చేకూర్చాలన్నా వ్యవసాయ రంగానికి సబ్సిడీలను కొనసాగించాలి. ఎరువుల సబ్సిడీని కొనసాగించాలని కోరుతున్నాము.
4. ఎరువులలో స్వయం పోషకత్వాన్ని సాధించే దిశగా దేశీయ ఉత్పత్తిని పెంచాలి. సహజ వాయువు లభిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో దీనిని ఎరువుల తయారీకి వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇది రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను మెరుగుపర్చటంతోపాటు, రాష్ట్రాన్ని ధాన్యాగారంగా రూపొందిస్తుంది. కెజి బేసిన్‌లో ప్రైవేటు కంపెనీలు గ్యాసుకోసం చేసిన వ్యయాన్ని తిరిగి చెల్లించైనా రాష్ట్రం గ్యాసు ఉత్పత్తిని చేపట్టాలి.

ధన్యవాదాలతో

హైద్రాబాదు — ఎస్.ఝాన్సి, అధ్యక్షులు
18-09-08 — రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)

అనుబంధం

జయతీఘోష్ కమీషన్ సూచనలు

విత్తనాలు

బహుళజాతి కంపెనీలు, వ్యాపారుల కల్తీ విత్తనాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైంది. పంట నష్టానికి ఇదొక ప్రధాన కారణం. కొన్ని సందర్భాలలో కల్తీ విత్తనాలే కరువుల కంటే ఎక్కువ వినాశకరంగా వున్నాయి. ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.

1. విత్తన సరఫరాను ప్రభుత్వం చేపట్టాలి.
2. విత్తన రంగంనుండి బహుళజాతి కంపెనీలను తొలగించాలి.
3. సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను మూసివేసే చర్యలను ఆపివేయాలి.
4. సరసమైన ధరకు విత్తనసరఫరా కోసం, పరిశోధనా సంస్థలు రైతాంగంతో సమన్వయం సాధించాలి. రైతుల స్థాయిలో వారి పొలాలలోనే విత్తన తయారీ సాగేలా, తల్లి తండ్రి రకాలను నేరుగా రైతాంగానికే సరఫరా చేసి వారికి శిక్షణనందించాలి.

ఎరువులు

ఎరువుల వినియోగంలో శాస్త్రీయ పద్ధతిని ప్రోత్సహించటానికి ఈ క్రింద చర్యలు తీసుకోవాలి.

1. ప్రభుత్వం భూసార పరీక్షా కేంద్రాలను విస్తృత పరచి నాణ్యమైన సేవనందించాలి.
2. పచ్చిరొట్ట విత్తనాలు, జీవన ఎరువులు, సూక్ష్మ పోషకాలు మొదలగు వాటిని ప్రోత్సహించి సమగ్ర పోషక నిర్వహణను పెంపొందించాలి.
3. ఎరువుల సబ్సిడీలను కొనసాగించాలి. ఇది రైతులకు ఉపశమనమేకాక, ప్రజలకు ఆహార ధాన్యాలు అందుబాటు ధరలలో లభ్యమయ్యేలా చేస్తుంది.

సస్యరక్షణ మందులు

1. సమగ్ర సస్య రక్షణ చర్యలను ప్రోత్సహించాలి.
2. కల్తీమందుల నివారణకు, మార్కెట్టులో ప్రవేశపెట్టే ముందుగా, వాటి ప్రభావాలను వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ధృవీకరించాలి. దీనికోసం ప్రత్యేక కఠినతర చట్టాన్ని చేయాలి.
3. మందు డబ్బాపై ఫ్యాక్టరీ ధర, పన్నులు, గరిష్ట అమ్మకం ధరలను ముద్రించడం చట్టబద్ధ చర్యగా చేయాలి. ◈

కారిడార్ వ్యతిరేక ఉద్యమం-అనేక ధోరణులనెదుర్కొంటూ ఐక్యంగా సాగాలి

ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, కోస్తా కారిడార్‌ల పేరిట ప్రభుత్వం దేశంలోని వివిధ ప్రాంతాలలోనూ, మన రాష్ట్రంలోనూ పెద్ద ఎత్తున భూమి సేకరించి బడా పరిశ్రమలకు, బహుళజాతి పరిశ్రమలకు కట్టబెడ్తున్నది. నాలెడ్జి పార్కు, అపెరల్ పార్కు, థీమ్‌పార్కు, టెక్స్‌టైల్ పార్క్ తదితర పేర్లతో వివిధ ప్రాంతాలలో ఒక్కో పార్క్‌కు వేల ఎకరాల భూములను కేటాయిస్తున్నది. ఈ భూముల్లో వ్యవసాయయోగ్యమైన భూములు, పంటభూములు ఉండటంతో పాటుగా, సన్న, చిన్నకారు రైతులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములు, ఎసైన్డ్ భూములు, ఫారెస్ట్ భూములు వున్నాయి.

కోస్తాకారిడార్‌లో భాగంగా 'వాన్‌పిక్' (వాడరేవు, నిజాంపట్నం పోర్టుల ఆధారిత పారిశ్రామిక కారిడార్) పేరిట గుంటూరు, ప్రకాశంజిల్లాలోని తీర ప్రాంతంలో 28వేల ఎకరాల భూముల సేకరణకు ప్రభుత్వం పూనుకుంది-ఇందులో సన్న, చిన్నకారు రైతాంగపు భూములతో పాటుగా పేద ప్రజలు సాగు చేసుకుంటున్న ఎసైన్డ్, ఫారెస్ట్ తదితర భూములున్నాయి. నయాన్నో, భయాన్నో ప్రభుత్వం-తన యంత్రాంగం ద్వారానూ, ప్రైవేట్ కంపెనీల యజమానులు తన ఏజెంట్లు ద్వారా గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్ళి నయాన్నో, భయాన్నో భూముల కొనుగోలుకు ప్రయత్నిస్తున్నారు.

పెద్ద ఎత్తున అభివృద్ధి జరగబోతున్నదని ఊదర గొడుతున్నారు-డబ్బు రూపంలో నష్టపరిహారం యిచ్చి భూములను ఖాళీ చేయించాలని చూస్తున్నారు- భూములు ఇవ్వటానికి రైతాంగం నిరాకరిస్తున్న చోట కొంత ఎక్కువ డబ్బైనా చెల్లించటానికి సిద్ధమౌతూ ఊరిస్తున్నారు- మరోవైపున, దీనికి అంగీకరించకుండా, రైతులు భూములు వదులుకోవటానికి సిద్ధపడకపోతే, తాము నిర్ణయించిన డబ్బు బ్యాంకులో జమచేసి భూములు లాగివేసుకుంటామని రెవిన్యూ అధికారులు హెచ్చరిస్తున్నారు. సన్న, చిన్నకారు రైతాంగం సాగు చేసుకొంటున్న ఎసైన్డ్, ప్రభుత్వ భూములను ఇప్పుడైతే ఏదో విధంగా నష్టపరిహారం యిచ్చే విధంగా చేస్తామని, కాదని నిరాకరిస్తే-అసలు పరిహారమేమీ ఇవ్వకుండానే బలవంతానైనా భూములను తీసుకుంటామని మరో రకపు బెదిరింపులు సాగిస్తున్నారు-అధికార పార్టీ నాయకులు, వారి అనుయాయులు తమ పలుకుబడి, పరపతిని, ఉపయోగిస్తూ, బెదిరింపులను సాగిస్తూ ఈ ప్రాంతాల రైతులనుండి తామే భూములను ముందుగా కొనుగోలు చేస్తూ పెద్ద ఎత్తున లాభాలు పొందే వ్యాపారం సాగిస్తున్నారు.

అయితే 'వాన్‌పిక్' పేరుతో ఇన్నివేల ఎకరాల భూములు దేనికోసం సేకరిస్తున్నారు? ఈ సేకరించిన భూముల్లో ఏ పరిశ్రమలు పెట్టబోతున్నారనే ప్రశ్నకు అధికారులు, మంత్రులు, భూములను కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ కంపెనీల ఏజెంట్లూ, ఎవరూ సరైన సమాచారం ఏమీ ప్రజలకు ఇవ్వటం లేదు-లాభాలతో నడుస్తున్న పరిశ్రమలనే మూసివేసి కార్మికులను వీధుల్లోకి నెడ్తున్న ప్రస్తుత ప్రభుత్వాలు, మరోవైపున పారిశ్రామికంగా అభివృద్ధి చేసి లక్షలాదిమందికి ఉపాధి, ఉద్యోగవకాశాలు కల్పిస్తామనటాన్ని ప్రజలు విశ్వసించలేకపోతున్నారు.

ఏతా వాతా స్పష్టమయ్యేదేమంటే, ఈ భూముల లోకి కాలుష్య కారక ప్రమాదకరమైన; ఇతర అభివృద్ధి, చెందిన దేశాలలో నిషేదించిన పరిశ్రమలను స్థాపించటానికి ప్రభుత్వం సిద్ధమైందని స్పష్టమౌతున్నది.

ఈ పేరున సేకరించే భూముల్లో ముప్పాతికపైగా భూములు రియల్ ఎస్టేట్ పేరుతో పెట్టుబడిదారులు తమ చిత్తమొచ్చిన విధంగా ఉపయోగించుకోవచ్చని ప్రత్యేక ఆర్థిక మండళ్ళ చట్టంలోనే పేర్కొన్నట్లుగా- భూవ్యాపారం సాగిస్తున్నారు. ఈ తీరప్రాంతంలో ఓడరేవులను అభివృద్ధి చేయటం ద్వారా ఎగుమతి, దిగుమతులను పెద్ద ఎత్తున సాగిస్తామని చెప్తున్నారు. ఎగుమతులంటే మన దేశంలో, ముఖ్యంగా తీర ప్రాంతంలోని విలువైన ఖనిజ, ఇతర సహజ సంపదలు యధేచ్ఛగా కొల్లగొట్టుకొని పోవటానికే నౌకాయానం, రోడ్డురవాణా, విమానమార్గాలను ప్రజాధనంతో ఇబ్బడి ముబ్బడిగా 'అభివృద్ధి' చేస్తున్నారు. ఇక దిగుమతులంటే ప్రపంచదేశాలలోని వ్యర్థపదార్థాలను, విషపదార్థాలను, ముడిచమురు తదితర ప్రమాదకారక ముడిసరుకులను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకోవటం ద్వారా మన తీరం 'డంపింగ్ 'యార్డుగా మారనున్నది .అంతేకాదు ప్రమాదకారక, కాలుష్యకారక పరిశ్రమల ఫలితంగా వాయు, జల, శబ్దకాలుష్యంతో తీరప్రాంత పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుంది. జలకాలుష్యం ఫలితంగా సముద్రంలోని విభిన్నరకాల జీవరాశులు, సముద్రసంపద, సముద్ర ఆహార ఉత్పత్తులుతీవ్రంగా నష్టపోవలసి వస్తుంది. సామ్రాజ్యవాద బహుళజాతి పరిశ్రమలు వ్యర్థాలను మన తీరానికి దిగుమతి చేసి మన తీరానికి కాలుష్యాన్ని మిగిల్చి, శుద్ధి చేసిన ఉత్పత్తులను ఎగుమతి చేసుకోవడానికి ఈఓడరేవులు ఉద్దేశించబడినాయని స్పష్టమౌతున్నది. దేశానికి అత్యంత కీలకమైన, వ్యూహాత్మకంగా ప్రాధాన్యత కలిగిన తీరప్రాంతంలో సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు తిష్టవేసిన ఫలితంగా రక్షణపరంగా దేశం తీవ్ర సమస్యలనెదుర్కొంటుంది-ఒకనాడు ఈస్టిండియా కంపెనీ వాస్కు కేరళ తీరంలోని కాలికట్‌లో కాలు మోపి క్రమంగా మద్రాసు, కలకత్తాలను కబళించటం ద్వారా యావద్దేశంపై 200 సంవత్సరాలు తిరుగులేని ఆధిపత్యం వహించిన చరిత్ర ఇటీవలి కాలంలోదే. అయినా బుద్ధిలేని, జాతీయతేలేని, దళారీ పాలకులు కోస్తాతీరాన్ని హారతిపళ్ళెంలో పెట్టి మరీ సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టేందుకు పూనుకుంటున్నారు.

పైన పేర్కొన్న వివిధ కారణాలతోపాటుగా ప్రజలు తరతరాలుగా తాము నివసిస్తున్న ప్రాంతాలను, గ్రామాలను, వాతావరణాన్ని కోల్పోయి, సంస్కృతి ధ్వంసం చేయబడి నాలుగు డబ్బులు చేత పట్టుకొని బయటకు రావలసి రావటంలోని విషాదం, సమస్య తీవ్రత ఈ పాలకులకు పట్టటం లేదు-ఏ పథకం కోసమైనా భూమిని వదులుకోని త్యాగం చేసినవారే-ఆ భూమిలో సాగించే అభివృద్ధి ఫలాలను అందుకునే దానిలో ప్రథమ ప్రాధాన్యంలో ఉండాలనే కనీసపాటి ఇంగితాన్ని కూడా ప్రదర్శించని పాలకుల ఏలుబడిలో వున్నాం. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగి ఆరు దశాబ్దాలు దాటినా, సాగర్ జలాల ఫలితంగా బంజరుభూముల్లో బంగారం పండినా, సాగర్ రాక ముందే సాగర్ కాలువ పరీవాహక ప్రాంతంలో భూములను ముందుగానే ఊహించి బడా పెట్టుబడిదారులు పేదలనుండి కారుచౌకగా కొనుగోలు చేసి కోటీశ్వరులైనా- ఈనాటికీ సాగర్ భూముల బాధితులకు నష్టపరిహారం అందించని దౌర్భాగ్యపు చరిత్ర మన కళ్ళముందున్నదే. ఇలాంటి స్వీయ చేదు అనుభవాల కారణంగా మరెవరో ఉద్బోధించాల్సిన అవసరం లేకుండానే ఈ ప్రభుత్వాలపై ప్రజలకు విశ్వసనీయత లేదనేది స్పష్టం.

'వాన్‌పిక్' గ్రామాల పరిధిలో ప్రజల మనోభావాలను గమనంలోకి తీసుకున్న తర్వాత ఒక బలమైన కార్యాచరణ ఉద్యమ అవసరం కన్పడుతున్నది. కానీ, ఈ ఉద్యమంలోకి వస్తున్న వివిధ రాజకీయ శక్తుల ఊగిసలాట, ద్వంద్వ వైఖరులు, ఎన్నికలు చుట్టూ తిప్పాలనుకునే విధానాల ఫలితంగా బాధిత గ్రామాల ప్రజలు నాయకత్వంపై నమ్మకంతో ఒక్కుమ్మడిగా ఉద్యమరూపంలో రాలేని పరిస్థితి సాగుతున్నది.

ఈ బలవంతపు బేదఖలుకు వ్యతిరేకంగా నిరసనలు, ఉద్యమాలు రావటంతో కేంద్ర ప్రభుత్వం భవిష్యత్తులో భూసేకరణ విధానాన్ని తెలుపుతూ ఒక బిల్లును ప్రతిపాదించింది. ఇక ముందు పరిశ్రమలు 70 శాతం భూమి కొనుగోలు చేసుకుంటే, తక్కిన 30 శాతం భూమి మాత్రమే ప్రభుత్వం సేకరించి యిస్తుందని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను పార్లమెంటరీ సబ్ కమిటీ వ్యతిరేకించింది. ఈ ప్రతిపాదన గతేమిటో వేచి చూడాలి. అయితే ఈ ప్రతిపాదన చట్టంగా రూపొందించినా వాన్‌పిక్‌కు వర్తించదు. ఇంకా చట్టం కాలేదు కనుక భూసేకరణ ఆగదు. ప్రభుత్వం పునాది నిర్మాణాలు చేసి పరిశ్రమలు పెట్టమని ఆహ్వానిస్తుంది. సెజ్‌లు, కారిడార్‌లు పేరేదైనా జరుగుతున్నదిదే. మొత్తం భూమిని ప్రభుత్వం సేకరించాల్సి వుంటుంది. ప్రతిపాదించిన బిల్లు-పరిశ్రమ పెట్టేందుకు సిద్ధపడి భూమిని కేటాయించమని అడిగితే వర్తించేదే. కనుక ఇది వాన్‌పిక్ భూసేకరణకు వర్తించదు.

కారిడార్‌కు వ్యతిరేకంగా కార్యక్రమాల రీత్యా పెద్ద ఎత్తున చేపట్టినట్లు కన్పిస్తున్న సిపిఐ కారిడార్‌ను వ్యతిరేకించే పేరుతో కార్యాచరణలో కొనసాగుతున్నది. కానీ నిర్దిష్టతలోకి వెళ్తే-కారిడార్‌కు ప్రభుత్వ భూములు ఇవ్వటానికి వారికి ఎలాంటి అభ్యంతరం లేదనీ, అయితే పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన రైతుల భూములు వారి ఇష్టానికి వ్యతిరేకంగా స్వాధీనం చేసుకోవటానికే వారు వ్యతిరేకమని స్పష్టమౌతుంది. కోస్తా కారిడారుకు తాము వ్యతిరేకం కాదని సిపిఐ గుంటూరుజిల్లా కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు 22.10.08న నిజాంపట్నంలో బాహాటంగానే మాట్లాడారు. అంటే ప్రభుత్వ, బంజరు, ఫారెస్టు బంజరు భూములు ఇవన్నీ కారిడార్‌కు కేటాయించిన తర్వాత సన్న, చిన్నకారు రైతులు భూములు నిలువుకోగలుగుతారా? అంటే ఈ ఉద్యమం సాగించేది కొంచెం ఎక్కువ నష్టపరిహారాన్ని పొందటానికేనా అనే సందేహం ప్రజలకు కలుగుతున్నది.

సిపిఎం గుంటూరుజిల్లా కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ-'పరిశ్రమల ఏర్పాటుకు ఆయా కంపెనీల వారు 80శాతం భూమి సేకరించుకుంటే 20 శాతం మాత్రమే ప్రభుత్వం భూమి సేకరించాల్సి వుండగా ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకోవటమేమిటని'; 22.10.08న నిజాంపట్నం నిరాహారదీక్షల ముగింపు సందర్భంగా మాట్లాడారు-అంటే వీరికి ఉన్న అభ్యంతరం ప్రభుత్వం ఎంత భూమిని సేకరించాలి? ప్రైవేటు కంపెనీల యాజమాన్యం ఎంత భూమి సేకరించాలనేనా?

ఇక, తాము అధికారంలో నుండగా,ఇవే విధానాలను చేపట్టిన తెలుగుదేశం పార్టీ-కారిడార్‌కు రైతులనుండి భూసేకరణను వ్యతిరేకిస్తున్నామని చెప్తున్నా- అవన్నీ ఎన్నికల ప్రయోజనాలకు లోబడిన విధానాలుగానే ఉంటాయి తప్ప మరోటి కాదు.

కారిడార్ పట్ల ప్రజలలో తీవ్ర అసంతృప్తి వున్నప్పటికీ, ప్రభుత్వ విధానాల పట్ల తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ- వాటినన్నింటినీ ఒకచోటకు సమకూర్చగల ఐక్య నాయకత్వం లేకపోవటమే ప్రధానమైన సమస్యగా వుంది. తీరప్రాంతంలో మత్స్యకారుల, కల్లుగీత వృత్తిదారుల, గొర్ల పెంపకందారుల, రైతుల జీవనాన్ని మరింత మెరుగు చేయగల పథకాలను, విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే విధానాలను, పథకాలను ప్రజల ముందుంచటం ద్వారా, వాటి కొరకు సమైక్య పోరాటం చేయటానికి సన్నద్ధం చేయాలి. ఆయా ప్రాంతంలో లభించే వనరులపై ఆధారపడి పారిశ్రామికంగా అభివృద్ధి చేయటానికి వున్న అవకాశాలను విశదపరచాలి. సరైన అర్థంలో సమగ్ర అభివృద్ధి అంటే ఏమిటో ప్రజలు విద్యావంతం కావాలి. మన గ్రామాల్ని ఖాళీ చేసి, ప్రజల్ని నిర్వాసితుల్ని చేసి, బిచ్చగాళ్ళుగా చేసి, విదేశీ సామ్రాజ్యవాదుల దోపిడీ ప్రయోజనాల కొరకు మన వనరులన్నింటినీ దోచిపెట్టే దళారీ పాలకుల విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యమ నిర్మాణం సాగాలి. ప్రభుత్వ కుటిల విధానాలను వ్యతిరేకిస్తూ డాంబికంగా మాటలు, ఊకదంపుడు ఉపన్యాసాలు, ప్రకటనలు, ఖండనలు, ఛాలెంజీలు విషయాల్ని ఎన్నికలచుట్టూ తిప్పే వివిధ రాజకీయ శక్తుల స్వభావాలపట్ల, ఆచరణపట్ల అప్రమత్తంగా ఉండి, గమనింపు ద్వారా, నిలవేయటం ద్వారా, నిలకడైన కారిడార్ వ్యతిరేక ఉద్యమాన్ని నిర్మించుకోవటం సాధ్యమౌతుంది. సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల పనుపున వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా వున్న శక్తులలో వ్యక్తమయ్యే ఈ పెడధోరణులను ఎదుర్కొని, నిజాయితీగా కలిసివచ్చే, నిలబడే శక్తులన్నింటినీ ఐక్యంచేసి, ప్రజలందరినీ మరింత ఎక్కువగా విషయాల పట్ల చైతన్యపర్చటం ద్వారా మాత్రమే విజయం సాధించే దిశగా ప్రయాణించగలుగుతారు. ◈

వాన్‌పిక్ ఎవరి కోసం?

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అన్న దేశానికి చెందిన రస్‌అల్‌ఖైమా ఇన్‌వెస్టుమెంట్ అథారిటీ అన్నకంపెనీతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 11-3-2008న అవగాహనా పత్రంపై సంతకాలు చేసింది. దీనిని రిజిస్టరు చేయలేదు. వాన్‌పిక్ నిర్మాణాన్ని ఇదిచేపట్టాలి. జిఓ ఎం ఎస్ నెం 30 ప్రకారం వాన్‌పిక్ లో 51 శాతం వాటా రస్‌అల్ ఖైమాకు,49 శాతం వాటా మాట్రిక్స్ ఎన్‌పోర్టుకు వుంటుంది. జి.నెం.ఎం.ఎస్ 30, తేదీ 10.7.2008 ప్రకారం నిజాంపట్నం, వాడరేవులల్లో రేవుల కోసం 2000 ఎకరాలు కేటాయించారు. భూసేకరణకయ్యే ఖర్చు కంపెనీయే భరించాలి. ఆ జీఓ ప్రకారమే కారిడారు కవసరమయ్యే భూమిని ఆ కంపెనీయే సేకరించు కోవాలి. ఈ ప్రాజెక్టును 33 సంవత్సరాలు లీజుకిచ్చారు. అవసరమైతే మరో 22 ఏళ్లు పొడిగించవచ్చు. వాన్‌పిక్‌కు అయ్యే వ్యయం రూ॥ 16000 కోట్లు అంటున్నారు. ఇంతవరకూ వివరమైన ప్రాజెక్టు రిపోర్టు తయారు కాలేదు. ఇది లాభదాయకమా కాదా అన్న ఫీజిబిలిటీ రిపోర్టు లేదు. ఇంత పెద్ద ప్రాజెక్టుకు టెండర్లు పిలవలేదు.

జిఓఎంఎస్ నెం30 ప్రకారం అవసరమైన భూమిని వాన్‌పిక్ సేకరించుకోవాలి. అయినా జి.ఓ.ఎం.ఎస్.నెం. 31 తేదీ 11.7.2008 ప్రకారం గుంటూరు, ప్రకాశంజిల్లా కలక్టర్లు భూసేకరణ నోటీసులు జారీ చేశారు. గుంటూరుజిల్లాలో 13,946 ఎకరాలు, ప్రకాశంజిల్లాలో 7,833 ఎకరాలు, రెండుజిల్లాలో కలిసి 5925 ఎకరాల అటవీభూమి మొత్తం 27,704 ఎకరాలు సేకరిస్తారు. దీనిలో 5770 ఎకరాల పట్టాభూమి, 7415 ఎకరాల పేదలకిచ్చిన అసైన్డు భూమి వుంది.

వాన్‌పిక్‌ను నిర్మించి, నిర్వహించి, మార్పిడి చేసే(బిఓటి) కంపెనీలూ, వాటిలో లాభాలు పొందే పెట్టుబడిదారులెవరు?

యునైటెడ్ ఆరబ్ ఎమిరేట్స్‌లో ఒక సంస్థానం రస్ ఆల్ ఖైమా. ఆ సంస్థానాధీశుడు పెట్టుబడి సమకూర్చి తమ దేశంలో అభివృద్ధి ప్రాజెక్టుల కొరకు స్థాపించిన సంస్థ రస్ ఆల్ ఖైమా ఇన్‌వెస్టుమెంటు అథారిటీ (రకియా). సుప్రీంకోర్టు బాక్సైట్ తవ్వకాలు ప్రైవేటు కంపెనీలకివ్వరాదన్న తీర్పును వమ్ము చేయటానికి ప్రభుత్వ సంస్థ తవ్వుతున్నట్లు చూపి 'రకియా' కివ్వగా, స్టెరిలైట్ కంపెనీకి దక్కింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఒప్పందం రకియాతో జరిగింది. తన భాగస్వాములెవరో అది నిర్ణయించుకుంటుంది. ఇంతవరకూ అవి ఏ పెట్టుబడి పెట్టలేదు. కాగా 9.6.2008న వాన్‌పిక్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు మారిషస్‌లో రిజిస్టరయిన రస్‌అల్‌ఖైమా ఇన్‌ఫ్రాహోల్డింగ్స్‌కు 10409 షేర్లు కేటాయించారు. రకియా తరపున సంతకం చేసిన ఖతారు మసాద్‌ను వాన్‌పిక్ బోర్డులో అదనపు డైరెక్టరుగా(కార్యనిర్వహణేతర స్వతంత్ర) వ్యక్తిగత స్థాయిలో మిగిలిన ఇద్దరు డైరెక్టర్లయిన నిమ్మగడ్డ సోదరులు 25.6.2008న నియమించారు. ఇదంతా అసలు పెట్టుబడిదారులకు రకియా ముసుగు మాత్రమేనన్న అనుమానం కలుగుతుంది. వారెవరు?

నిమ్మగడ్డ ప్రసాద్, అతని సోదరుడు ప్రకాష్ 18.1.2008న మాట్రిక్స్ ఎన్‌పోర్టు హోల్డింగ్స్ ప్రైవేటు లిమిటెడ్ అన్న కంపెనీని, 31.3.2008న వాన్‌పిక్ పోర్టు ప్రైవేట్ లిమిటెడ్ అన్న కంపెనీని, 7.5.2008న జెనెక్స్ స్ట్రక్చరల్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ అన్న కంపెనీని రిజస్టరు చేశారు. వీటిలో మొదటిది వాన్‌పిక్‌లో పెట్టుబడి పెట్టేదికాగా, రెండవది వాన్‌పిక్‌ను నిర్మించే స్పెషల్ పర్పస్ వెహికల్, మూడవది వాన్‌పిక్ భూమిని సేకరించేది. నిమ్మగడ్డ ప్రసాద్, ప్రకాష్‌లు వ్యక్తులుగానూ, తమ కంపెనీలైన ఆల్ఫా అవెన్యూస్, ఆల్ఫా ఎల్లాస్ ద్వారానూ రఘురామ్ సిమెంట్స్, జగతి పబ్లికేషన్స్‌లో వాటాలు కలిగి వున్నారు. 7.5.08న తాము రిజిస్టరు చేసిన జెనెక్స్ స్ట్రక్చరల్స్ కంపెనీకి డైరెక్టర్లుగా నిమ్మగడ్డ సోదరులు 22.5.08న రాజీనామా చేసి, కొండా వెంకటేశ్వరరెడ్డిని డైరెక్టరుగా తీసుకొచ్చారు. ఆయన గిల్‌క్రిస్ట్ ఇన్‌వెస్ట్‌మెంట్స్ ప్రై.లి. అన్న కంపెనీలో డైరెక్టరు. ఆ కంపెనీ జగతి పబ్లికేషన్స్‌లో పెట్టుబడులు పెట్టింది. వాన్‌పిక్‌కు అధీకృత ప్రతినిధిగా 9.6.2008న చిల్లా రవిరెడ్డిని నియమించారు. ఇతను జగతి పబ్లికేషన్స్‌లో పెట్టుబడి పెట్టిన ఆల్ఫా అవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు డైరెక్టరు.

జగతి పబ్లికేషన్స్ "సాక్షి" దినపత్రికను ప్రచురిస్తున్నది. దీనిలో మెజారిటీ వాటా, అలాగే రఘురాం సిమెంట్స్ మెజారిటీ వాటా వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డిది. వాన్‌పిక్ నేరుగా రైతులనుండి భూమిని కొనుగోలు చేసుకోవాల్సి వుండగా కలెక్టర్లు భూసేకరణ నోటీసు లిచ్చారు. ఆ విధంగా భయపెట్టి జెనెక్స్ తక్కువరేటుకు పట్టా భూములను, అసైన్డు భూములను కొనుగోలు చేయటానికి వీలుగా నోటీసులిచ్చారు. 'రకియాతో' చేసుకున్న ఒప్పందం ఒక ముసుగు మాత్రమే. అసలు వ్యవహారాలన్నీ నిమ్మగడ్డ సోదరులు, చిల్లా రవిరెడ్డి, కొండా వెంకటేశ్వర రెడ్డిలు చూస్తున్నారు. వీరంతా వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గ్రూపుగా వున్నారని వారి పెట్టుబడుల మిశ్రమం తెలుపుతున్నది.

పాలువాయి గ్రామంలో బడుగు, బలహీనవర్గాల కౌలు భూమి -సాగు హక్కు సమస్య: కౌలుదార్ల ఆందోళన, ప్రభుత్వ యంత్రాంగ నిర్లక్ష్యం, సి.ఐ.బెదిరింపులు!

గుంటూరుజిల్లా, రెంటచింతల మండలం పాలువాయి గ్రామంలోని సీతారామస్వామి దేవస్థానంకు చెందిన పూజారి భూమి 13 ఎకరాలను గత 10 సంవత్సరాలుగా అదే గ్రామానికి చెందిన దళిత, బడుగుకుల పేదలు కౌలుకు సాగుచేసుకుంటున్నారు. ప్రతి సంవత్సరం కౌలు చెల్లిస్తున్నారు. పూజారి 2010 సంవత్సరం వరకు కౌలు వ్రాసి యిచ్చాడు. ఈ భూమిని 120 సంవత్సరాల క్రితం కుంచగూర లక్ష్మమ్మ సీతారామస్వామి దేవాలయానికి ధూప, దీప, నైవేద్యం, నిర్వహణ కొరకు అదే గ్రామానికి చెందిన పూజారి కుటుంబానికి వ్రాసి యిచ్చారు. అప్పటి నుండి పూజారి కుటుంబం ఆ భూమిని స్వంతంగా వ్యవసాయం చేస్తూనో, కౌలుకిస్తూనో వచ్చే ఫలసాయంతో పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నది. అప్పటి నుండి (120 సం॥లు) భూమి శిస్తు సీతారామస్వామి దేవాలయం పేరు మీద పూజారి చెల్లిస్తున్నట్లుగా ఆధారాలు వున్నాయి.

అయితే ఈ సంవత్సరం సీతారామస్వామి దేవాలయం ధర్మకర్తలం మేమేనంటూ కొక్కిలిగడ్డ లక్ష్మీనారాయణ, ఆయన కుమారులు-పూజారిని, కౌలు దారులను భూమిలోకి రానివ్వకుండా నానా ఇబ్బందులు పెన్నారు.

పూజారి మా **జీతగాడు. వాడెవడు మీకు కౌలు** కివ్వడానికి? **తీసుకోవటానికి మీరెవరు? అనే** అహంభావంతో బండబూతులు తిట్టి ఒకసారి గుడి నుండి పూజారిని వెళ్ళగొట్టారు. గుడికి తాళాలు వేశారు. గ్రామ పెద్దలు లక్ష్మీనారాయణను మందలించి మరలా పూజారికి గుడితాళాలు అప్పజెప్పారు. అయినప్పటికీ ఆ దేవాలయ భూమి స్వంతం చేసుకోవటానికి లక్ష్మీనారాయణ, ఆయన కుమారులు తమ పేరు మీద పట్టాదారు పాసు పుస్తకాలు తెచ్చుకోవాలని ప్రయత్నంచేసి విఫలమైనారు. అయినా యిప్పటికీ ఆ ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. మరొకవైపున ఆ భూములు అమ్ముకోవాలని రహస్య వ్యవహారాలు నడుపుతున్నారు. పై రెండు పనులు జరగాలంటే పూజారి, కౌలుదారులు అడ్డుగా వున్నారు. వాళ్ళను అడ్డు తొలగించుకోవటానికి పోలీసు యంత్రాంగం యొక్క అండదండలతో కుట్రలు, **కుయుక్తులు చేస్తున్నారు.**

గత సంవత్సరం (2007)లో లక్ష్మీనారాయణ కౌలుదారులను చేలోకి రాకుండా అడ్డుకుంటుంటే ఆనాటి రెంటచింతల ఎస్.ఐ. రాజీ చేశారు. 'ఆ దేవాలయ భూమిని గతంనుండీ సాగుచేసుకుంటున్న కౌలుదార్లనే సాగుచేసుకోనివ్వండి. కౌలు మాట్లాడుకోండి. వారిని భూమిలోకి వెళ్ళనివ్వకుండా అడ్డుకోవద్దు' అని లక్ష్మీనారాయణకు చెప్పారు. దానితో ఎలాంటి ఆటంకము లేకుండా కౌలుదారులు వ్యవసాయం చేసుకున్నారు. తిరిగి ఈ సంవత్సరం (2008) కూడా కౌలుదారులను భూమి లోకి వెళ్ళనివ్వకుండా అడ్డు వచ్చాడు.

కౌలు రైతులు జిల్లా కలెక్టరును కలిశారు. కలెక్టరు -ఆర్.డి.ఓను పిలిపించి 'వీరికి కౌలు హక్కు వుంది. రక్షణ కల్పించమ'ని చెప్పారు. ఆర్.డి.ఓ.-ఎం.ఆర్.ఓ.కు ఫోన్‌చేసి 'పాలువాయి కౌలుదారులకు రక్షణ కల్పించండి' అని చెప్పి కౌలుదారులతో 'నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగి కాలం వృధా చేసుకోవద్దు, మీరు వెంటనే పొలాలలోకి వెళ్ళి సాగు చేసుకోండి. మీకు ఎం.ఆర్.ఓ. రక్షణ కల్పిస్తాడు' అని హామీ ఇచ్చి ధైర్యం చెప్పాడు. ఈ ధైర్యంతో కౌలుదారులు 200 మంది ప్రజల సహకారంతో పొలాలలోకి వెళ్ళారు. మరుక్షణమే పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. వెనువెంటనే కౌలుదారులు, ప్రజలు ఎం.ఆర్.ఓ. ఆఫీసు దగ్గరకు ఊరేగింపుగా వెళ్ళి ధర్నా చేశారు. దీంతో ఎం.ఆర్.ఓ. 'విచారించి కౌలుదారులకు న్యాయం చేస్తాన'ని చెప్తూనే 15 రోజులు కాలయాపన చేశారు. 'కౌలుదారులు 10 సం॥ల నుండి ఈ భూమి అనుభవిస్తున్నమాట నిజమే' నంటూ కౌలు హక్కుకు ఎలాంటి రక్షణ కల్పించలేదు.

కౌలుదారులు ఎస్.పి.ని కలువగా డి.ఎస్.పి.ని కలువమని చెప్పారు. డిఎస్‌పిని కలిస్తే 'ఇది భూమి తగాదా, మేం జోక్యం చేసుకోకూడదు, అందుకని మీకు సహాయంగా మేము పోలీసులను పంపలేమ'ని సి.ఐ. సమక్షంలోనే చెప్పారు. అందుకు జవాబుగా కౌలుదారులు 'మీ పోలీసుల రక్షణ మేము కోరటం లేదు. మీ పోలీసులే మమ్ములను చేలోకి పోకుండా అడ్డుకుంటున్నారు. మీ పోలీసులను రాకుండా చూడండి. అదే మీరు మాకు చేసే పెద్ద సహాయం అని చెప్పారు. డి.ఎస్.పి. సరేనన్నారు'. అయితే కౌలుదారులు చేలోకి వెళ్ళిన వెంటనే మరలా పోలీసులు ప్రత్యక్షమయ్యారు.

13 ఎకరాల భూమికోసం 50 మంది కౌలుదారులు వందల మంది రైతు-కూలీల సహాయంతో కౌలుహక్కుకు రక్షణ కల్పించమని రెవిన్యూ యంత్రాంగం చుట్టూ, పోలీసు యంత్రాంగం చుట్టూ, ఎస్.సి., ఎస్.టి. కమీషన్ ఛైర్మన్ చుట్టూ, ఎం.ఎల్.ఏల చుట్టూ, మండల అధికారుల నుండి జిల్లా అధికారుల వరకు అందరి చుట్టూ అలుపు ఎరగకుండా తిరిగారు.

కౌలుహక్కు వున్న సాగుదారులు 'సాగుహక్కు మాది, భూమిలో పంట మాది' అని తోటి రైతుకూలీల సహకారంతో సంఘబలంతో చేలోకెళ్ళి సాగు చేసుకున్నారు. కౌలుహక్కుకు రక్షణ యివ్వని పోలీసులు వచ్చి చేలో నుండి బయటకు రావాలని, కేసులు పెడతామని, అరెస్టులు చేస్తామని బెదిరించారు. కాని కౌలుదారులు బెదరలేదు. చేలోనుండి బయటకు రాలేదు. మీరేం చేసుకొన్నా మాకభ్యంతరం లేదు అని తెగేసి చెప్పారు. దాంతో లక్ష్మీనారాయణ మరో ఎత్తువేసి గ్రామపెద్దలను రాజీకి పంపించాడు. రాజీకి మొదటి నుండి సిద్ధంగా వున్న కౌలుదారులు 40 మంది గ్రామపెద్దలు, గ్రామస్తుల సమక్షంలో చర్చలు జరిపారు. 13 ఎకరాలకు కౌలు తాలూకా 32 వేలు సంవత్సరానికి చెల్లించాలని, సాగుకు అప్పటికి లక్ష్మీనారాయణకు అయిన పెట్టుబడిని (80 వేలు) కౌలుదార్లు చెల్లించి, భూమిని సాగుచేసుకోవచ్చని నిర్ణయించుకొని మరుసటి రోజు అగ్రిమెంటు వ్రాసుకుందామని అనుకున్నారు.

మరుసటిరోజే లక్ష్మీనారాయణ ఈ అగ్రిమెంటును తుంగలో తొక్కి పోలీసుస్టేషన్‌లో రాజీ చేసుకోవాలని, **కొత్త ఎత్తు ఎత్తాడు.** సమస్యను పరిష్కరించుకోవాలనే **దృష్టితో కౌలుదారులు పోలీసు స్టేషన్‌లోనే రాజీకి సిద్ధమయ్యారు. ముందురోజు గ్రామపెద్దలు చేసిన రాజీకి భిన్నంగా ఈ సంవత్సరం పంటను లక్ష్మీనారాయణకు వదిలి పెట్టాలని, వచ్చే సంవత్సరం నుండి కౌలుదార్లకు** స్వాధీనం చేస్తారని ఎస్.ఐ. కొత్త రాజీ ప్రతిపాదన తెచ్చాడు. అక్కడకు హాజరైన కౌలుదారులు, గ్రామపెద్దల సమక్షంలో రాజీ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం వ్రాతపూర్వకంగా వ్రాసుకుంటున్న సందర్భంలో (10.10.'08 సాయంత్రం) సి.ఐ. ఫోన్‌చేసి 'నేను వస్తున్నాను, వ్రాత, కోత లాపండి' అని చెప్పారు. వచ్చీ రావటంతోనే కౌలుదారులను, గ్రామపెద్దలను బండబూతులు తిడుతూ స్వైర విహారం చేశారు. వీరంగంవేసి నోటి దురదను తీర్చుకున్నారు. వారు వారి నోటి దురదను తీర్చుకొన్న తీరు ఇది.....

'మీకెందుకు కౌలుకివ్వాలిరా? మీకెందుకు అగ్రిమెంటు వ్రాసి యివ్వాలిరా? నా కొడకల్లారా!' అంటూ అక్కడి రైతుకూలీ సంఘం కార్యవర్గ సభ్యుడిని ఉద్దేశించి 'ఏరా! కోటేశ్వరరావు మీకిది మూడు నెలలుగా చెపుతున్నాను..... పాలువాయి భూములలోకి దిగండి. మీ అంతు తేలుస్తా. ఇక నుండి మీకు మాకు తగాదా. ఎంత మంది పోలీసులను దించైనా మీ సంగతి తేలుస్తా. ఎస్.పి., డి.ఎస్.పి.ల నుండి ఆర్డర్లు వచ్చాయి. మీ అంతు చూడమని. మొన్న జమ్మలమడుగులో చూశారుగా! ఎంత మంది పోలీసులను దించామో? అర్ధ రూపాయి తగాదాకు ఐదు లక్షల ఖర్చయినా పెడతాం' అంటూ రేగిపోయారు. అంతటితో ఆగకుండా రాజీ కొరకు వచ్చిన గ్రామపెద్దల మీద విరుచుకుపడ్డారు. "మీరు.......మీకు సిగ్గు లేదురా! కోమటి వాడి భూములలోకి పోతూ వుంటే చూస్తా వుంటారురా! యిదే మా ఊర్లో అయితే యిప్పటికి ఒకరిద్దరిని చంపి వుండేవాళ్ళం. ఏందిరా యిక్కడ మీరు రాజీ చేసేది. యిప్పటికి ఈ ఊళ్ళో 18 హత్యలు జరిగాయి. మరికొన్ని జరుగుతాయిరా!" అని రాయటానికి వీలులేని అసభ్య పదజాలంతో పేట్రేగి పోయారు.

రైతుకూలీ సంఘం గ్రామ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డిని పట్టుకొని "ఏరా నా కొడకా! రెడ్డిపుటక పుట్టి మాల, మాదిగలతో తిరుగుతావురా? నీకు భూమి ఎంత వుంది రా! నీకు భూమిలేదు కనుకనే వాళ్ళ వెంట తిరిగి అడక్కనూకుతున్నావ్! సిగ్గు లేదురా ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీస్ సెక్షన్ క్రింద అరెస్టు చేయమని ఆందోళన, ఊరేగింపులు, పోస్టర్లు వేస్త్రారా నా కొడకల్లారా!" అంటూ సాగుదారులను, ప్రజలను భయోత్పాతానికి గురిచేస్తూ, కళ్ళు ఉరుముతూ, ప్రజారక్షకులమనే సంగతిని మరచి ప్రవర్తించారు.

ప్రజాతంత్రవాదులారా! ప్రభుత్వాధికారులారా!

గత 4 నెలలుగా భూమి కౌలు హక్కు సమస్యపై ఘర్షణ నడుస్తూ వున్నది. ఉన్నతాధికారుల దగ్గరికి పొమ్మని చెప్పినది ఈ సి.ఐ.గారే.

కౌలుహక్కు వున్న సాగుదారులు, రైతుకూలీ సంఘం కార్యకర్తలు కలెక్టరును కలిశారు. ఎస్.పిని కలిశారు. ప్రత్యేక అధికారిగా వున్న ఎస్.పి.ని కలిశారు. డి.ఎస్.పి.ని కలిశారు. అందరూ కౌలుహక్కును గుర్తించి తదనుగుణంగా పరిష్కారం చేసుకోమని చెప్పారు. అయితే గ్రామ పెద్దల సమక్షంలో పరిష్కారం చేసుకోండని గతంలో చెప్పిన సి.ఐ. ఇప్పుడు ఎందుకు అడ్డం తిరిగారు? శాంతిభద్రతలను కాపాడవలసిన సి.ఐ., సమస్య పరిష్కారమవుతున్న దశలో ఎందుకు స్వైర విహారం చేశారు?

పై అధికారులు కౌలుహక్కును గుర్తించినా, సి.ఐ. మాత్రం ఆ హక్కును గుర్తించ నిరాకరించి సాగుదార్లను భూమిలోకి వెళ్ళకుండా ఆటంకాలు సృష్టించి నిరంతరం వేధింపులకు గురిచేశారు. దీనిని ఏదో ఒక విధంగా శాంతిభద్రతల సమస్యగా మార్చి కేసులు పెట్టి, అరెస్టులుచేసి నిర్బంధాన్ని ప్రయోగించాలని సి.ఐ. చేసిన ఆలోచనలను సాగుదార్లు ప్రజాస్వామిక పద్ధతిలో త్రిప్పికొట్టారు. కౌలుహక్కును కాలరాచి సాగుదార్లకు వ్యతిరేకంగా సి.ఐ. తీసుకుంటున్న వైఖరిని ఖండించ వలసిందిగా, ప్రజాస్వామిక పద్ధతిలో కౌలు హక్కుకోసం పోరాడుతున్న పాలువాయి సాగుదార్లకు అండదండలు సమకూర్చ వలసిందిగా, రక్షణ కల్పించవలసిందిగా, ప్రజాతంత్రవాదులకు, ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.)
గుంటూరుజిల్లా కమిటి

'రైతాంగ సమస్యల పరిష్కార దిక్సూచి- రైతుకూలీసంఘం వార్షిక సంచిక'

రైతుకూలీసంఘం వార్షిక సంచిక ఆవిష్కరణ సభ **7.10.08,** మంగళవారం విజయనగరంలోని కృషిభవన్‌లో సంఘంజిల్లా కార్యదర్శి కామ్రేడ్ దొంతలూరి వర్మ అధ్యక్షతన జరిగింది. వార్షిక సంచికను సీనియర్ న్యాయవాది మరియు రైతాంగ, గిరిజనోద్యమాలకు శ్రీకాకుళ ఉద్యమ కాలం నుండి, అనేక రకాల సహాయ సహకారాలు అందించిన శ్రీ పరువాడ లక్ష్మునాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరన్న, మంగన్నల త్యాగం వృధా కాదని, గిరిజనులు తమ బ్రతుకులు మార్చుకునేందుకు చేసే పోరాటాల స్ఫూర్తి ప్రదాతలుగా వెలుగొందుతూనే ఉంటారని అన్నారు. చైనా, రష్యా విప్లవాలన్నింటిని సమగ్రంగా అధ్యయం చేసి మన దేశంలో వర్తింపచేయాలని అన్నారు. అలనాటి స్వాతంత్ర్యోద్యమ కాలం నుండి నేటివరకు అనేక వేలమంది చేసిన త్యాగాలను, పోరాటాల చరిత్రను ప్రజలకు తెలియజెప్పి ప్రజలను చైతన్యపరిచినపుడు ఉద్యమాలు మరింత ఎరుపెక్కుతాయని అన్నారు. రైతుకూలీసంఘం వార్షిక సంచిక ఈ కృషికి దోహదపడుతుందన్నారు.

వార్షిక సంచికను పరిచయం చేస్తూ సంస్కృత కళాశాల తెలుగు లెక్చరర్ శ్రీ.ఎన్.దామోదరరావు మాట్లాడారు. ఈ వార్షిక సంచికలో చాలా విలువైన వ్యాసాలను తీసుకువచ్చారని, ఇతంటి గొప్ప కృషి చేసిన రైతుకూలీసంఘంకు అభినందనలు తెలియజేశారు. వర్తమాన పరిస్థితులకు సంబంధించిన అన్ని విషయాలు వార్షిక సంచిక పొందు పరిచిందని ఉద్యమ కార్యకర్తలకు, ఈ సమాజం గురించి **ఆలోచించే** ప్రజలందరికి **దిక్సూచిగా నిలుస్తుందని అన్నారు.** ప్రముఖ కవి జాషువా **చెప్పినట్లు 'ఇనుప గజ్జెల తల్లి' రైతాంగ నెత్తిపై ఉందని-ఈ తెలియని శత్రువును రైతాంగానికి తెలియపరిచి** వారి **వలసలకు, ఆత్మహత్యలకు, మార్కెట్ దోపిడీకి** కారకులు **ఎవరో ఈ** సంచిక స్పష్టంగా చాటిచెప్పిందని అన్నారు. **పాలకులు** వల్లించే ఏ నినాదం వెనుక ఏ మోసం ఉందో గమనించాలంటే ఈ పుస్తకం చదవాలని బహుళజాతి సంస్థల దుర్మార్గం, బలవంతపు భూసేకరణ ఎలా జరుగుతున్నదో ఈ వ్యాసాలు చెబుతాయని అన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సి మాట్లాడుతూ 2007 వార్షిక సంచికను అనుభవజ్ఞులైన, శ్రీకాకుళ గిరిజనోద్యమానికి అండదండలందించిన వి.ఎల్.నాయుడుగారిచే ఆవిష్కరింపజేసినందుకు స్థానిక నాయకత్వాన్ని అభినందించారు. ఆవిష్కర్త వి.ఎల్.నాయుడుగారికి ధన్యవాదాలు తెలిపారు. కామ్రేడ్ ఝాన్సి మాట్లాడుతూ రైతాంగం ఎరువులు, విత్తనాలు డిమాండ్ చేస్తున్నారని, సీజన్‌లో రైతుకు వాటిని అందించటం పాలకుల కనీస కర్తవ్యం అని అన్నారు. పాలకులకు చిత్తశుద్ధిలేని కారణంగానే రైతాంగం తమ డిమాండ్స్ కోసం పోరాటాలకు సిద్ధపడవలసి వస్తున్నదని అన్నారు. ఎరువుల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిందని ఇటువంటి నాటకీయ కార్యక్రమాలను మానుకొని రైతాంగ సమస్యలను పరిష్కరించేందుకు, జయతీఘోష్ కమీషన్ నివేదికను అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించామని అన్నారు. కోస్తాకారిడార్ సమస్య కేవలం ప్రజల మనుగడ సమస్య మాత్రమే కాదని దేశ భద్రత సమస్య కూడా అని అన్నారు. కరీంనగర్ జిల్లాలో చేనేత ఆత్మహత్యలు, ఆకలిచావులకు పాలకులు అనుసరిస్తున్న విధానాలే కారణమని దీనికి గత పాలకులు కూడా బాధ్యులేనని అన్నారు. అక్కడ ఫ్యాక్టరీలు పెట్టి కార్మికులకు పని కల్పించాలని అన్నారు. రైతుకూలీ సంఘం వార్షిక సంచికలను రైతుకూలీలు, రైతాంగ ఉద్యమ కార్యకర్తలు తప్పనిసరిగా అధ్యయనం చేయటం ద్వారా తమ అవగాహనను, ఆచరణను మెరుగుపరుచుకోవాలని, సమాజంలోని వివిధ సెక్షన్ల మేధావుల అధ్యయనానికి అందజేయాలని కోరుతూ ముగించారు.

ఉపాధ్యాయ పత్రిక సంపాదకులు రౌతు వాసుదేవరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పబడుతున్న 62 సం॥ల కాలంలో ప్రజల పరిస్థితి మరింత దిగజారిందని, మనకు వచ్చింది స్వాతంత్ర్యమా? పారతంత్ర్యమా? అని చాలామంది సాధారణ ప్రజానీకం కూడా ప్రశ్నించుకుంటున్నారని అన్నారు. 'మీ తుపాకీ గుళ్ళు మా గుండెల్లో దూరవు' అన్న మనోనిబ్బరంతో ఆనాడు కోరన్న, మంగన్నలు పోరాడారని ఆ పోరాట స్ఫూర్తితో ప్రజలను చైతన్యవంతం చేస్తూ ప్రజలను పోరాటాలలో భాగస్వామ్యం చేస్తూ ప్రజలే చరిత్ర నిర్మాతలన్న దానికి కట్టుబడుతూ ఉద్యమాలు నిర్మిస్తున్న రైతుకూలీసంఘం (ఆం.ప్ర) ఇటువంటి సంచికలు మరిన్ని వెలువరించాలని కోరారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి డి.వర్మ మాట్లాడుతూ మహత్తర తెలంగాణ, శ్రీకాకుళ పోరాటాల అనుభవాల వెలుగులో మనం సంఘటితంగా, కార్మిక కర్షక ఐక్యతతో దున్నేవానికే భూమి నినాదంగా ముందుకు వెళ్ళాలి అని, పోరాటం ద్వారానే మనం ఏదైనా సాధించుకోగలమని అన్నారు. నాటి శ్రీకాకుళ పోరాటం, ఇచ్ఛాపురం నుండి తడ వరకు జరిగిన రైతురక్షణ యాత్ర, మందస జమీందారు వ్యతిరేక పోరాటాల స్ఫూర్తితో ఉద్యమాలను ముందుకు తీసుకువెళ్ళాలని అన్నారు. అలాంటి ఉద్యమ అనుభవాలు రైతుకూలీసంఘం వార్షిక సంచిక అందిస్తుందని చెప్పారు.

ఎపిఎఫ్‌టియు నాయకులు కామ్రేడ్ బెహరా శంకర్‌రావు మాట్లాడుతూ 2001 నుండి ప్రతి సంవత్సరం రైతుకూలీసంఘం వార్షిక సంచికలు వెలువరిస్తూ వస్తున్నదని చెప్తూ, రైతాంగం పట్ల పాలకులు అనుసరిస్తున్న దివాళాకోరు విధానాలను మరింత ఎండగట్టే విధంగా విస్తృతంగా ప్రజల వద్దకు తీసుకువెళ్ళేందుకు గత సంచికలు ఉపయోగపడ్డాయని, ఈ సంచిక కూడా ఆ పాత్ర నిర్వహిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

హైదరాబాదు, 20.10.2008

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ప్రోగ్రెసివ్ మీడియా సర్వీస్ మీటింగు హాలులో రెండు పుస్తకాల ఆవిష్కరణ సభ జరిపింది. రాష్ట్ర కార్యదర్శి కా॥కె.కోటయ్య సభకు అధ్యక్షత వహించారు. మాజీ ఐఎఎస్ అధికారి డా॥బి.డి.శర్మ రైతుకూలీసంఘం వార్షిక సంచిక 2007ను ఆవిష్కరించారు. ఈ సంచికను గురించి రై.కూ.సం రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ జె.కిశోర్‌బాబు పరిచయం చేస్తూ-2001నుండి తమ సంస్థ వార్షిక సంచికలను ప్రచురిస్తోందని ఆ క్రమంలో ఇది ఐదవదన్నారు. ప్రథమ జాతీయ సంగ్రామం(1857) జరిగి 150 సం॥లయిన సందర్భంగా దేశవ్యాపితంగా మరోసారి సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్య కార్యక్రమాలుజరిగాయనీ, ఆ చారిత్రక ఘట్టాల వివరణ ఈ సంచికలో వుందన్నారు. అలాగే తెలంగాణా, తెభాగ, నక్సల్బరీ వుద్యమాలు-శ్రీకాకుళం తొలి అమరులు కోరన్న, మంగన్నల అమరత్వం విశిష్టతలను, భూమి సమస్య ప్రాధాన్యతను తెలిపే వ్యాసాలు ఇందులో వున్నాయన్నారు. దళితులపై సాగుతున్న దాడులు అత్యాచారాలు-మరోవైపు రైతులనుండి భూములు గుంజుకొనే సెజ్ చట్టం, కోస్తాకారిడార్ చట్టాలతో పాటు గంగవరం పోర్టు నిర్వాసితులు, బాక్సైటు వ్యతిరేక వుద్యమ విశేషాలు ఇందులో వున్నాయనీ-భారత పాలకవర్గాలు భూస్వామ్య, బడా పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద అనుకూల విధానాలెలా అనుసరిస్తున్నదీ ఈ సంచిక చదివితే అవగాహన కలుగుతుందన్నారు.

'**సామ్రాజ్యవాద చెరలో విత్తనాలు**' అన్న రైతుకూలీ సంఘం ప్రచురణను ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డా॥ కె.ఆర్.చౌదరి ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రభుత్వం శాస్త్ర ఫలితాలను రైతాంగానికి అందించాల్సి వుండగా మన ప్రభుత్వాలు ఇందుకు విరుద్ధంగా సామ్రాజ్యవాదుల, గుత్తసంస్థల లాభాల కోసం వినియోగ పెడుతుందన్నారు. సంప్రదాయ విత్తనాల వాడకం నుండి రైతాంగాన్ని బలవంతంగా నెట్టివేసి, మోన్‌శాంటో, కార్గిల్‌లాంటి కంపెనీల విత్తనాలు కొనుగోలు చేయాల్సిన దుస్థితికి నెట్టేశారన్నారు. ఎకరాకు రూ.20వేలు విత్తనాలకే ఖర్చు పెట్టినా పత్తి, మిర్చి వంటి పంటల్లో దిగుబడి గ్యారంటీ లేదన్నారు. మరోవైపు ఆరోగ్యంపై, పర్యావరణంపై వ్యతిరేక స్వభావం కల్గించే బి.టి., జర్మినేటెడ్ వంటి విత్తనాలను అనుమతినిచ్చే దేశద్రోహ విధానాలను అనుసరించడాన్ని మనమంతా ప్రతిఘటించాలన్నారు. సుస్థిర వ్యవసాయ సంస్థ ప్రతినిధి అఫ్సర్ ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. డా॥రామాంజనేయులు(సిఎస్ఎ) మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు అన్నీ కొరత ఏర్పడి చివరకు విత్తనాలు కూడా దక్కకపోతే ఆహారభద్రతపైన తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు.

మచిలీపట్నం పోర్టు నిర్మాణంపై సమగ్ర సమాచారం అందించిన తర్వాతే

ప్రజాభిప్రాయ సేకరణ జరపాలి

రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) డిమాండ్

మచిలీపట్నం: 25-10-08

మచిలీపట్నం పోర్టు నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణకు ప్రభుత్వం పూనుకున్న సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర), కృష్ణాజిల్లా కార్యవర్గం ఒక మెమోరాండం ద్వారా దీనిలో వున్న అనేక సమస్యలను ఎత్తిచూపి వాటి పరిష్కారాన్ని డిమాండు చేసింది.

కృష్ణాజిల్లా మచిలీపట్నం వద్ద ఓ సరికొత్త డీప్ వాటర్ పోర్టు నిర్మాణము, బి.ఒ.టి పద్ధతిలో పోర్టు కార్యకలాపాల నిర్వహణ కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వజ్రా సీపోర్టు ప్రైవేట్ కంపెనీని ఎంపిక చేసింది. డీప్ వాటర్ పోర్టు అభివృద్ధికి ప్రతిపాదిత స్థలం గిలకలదిండి చేపలరేవు(ఫిష్షింగ్ హార్బర్) ఉన్న చోటుకు సుమారు 4 కి.మీల దూరములో(చినకరగ్రహారం శివారు పల్లెపాలెం వద్ద) ఉంది. వజ్రా సీపోర్టు ప్రైవేట్ కంపెనీవారు చేపట్టే పోర్టు ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావ అంచనా నివేదికపై ది.25-10-2008వ తేదీన చినకరగ్రహారం శివారు పల్లెపాలెం గ్రామంలో పర్యావరణ నియంత్రణ మండలి(పి.సి.బి) ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఈ క్రింది విషయాలను పరిగణనలోనికి తీసుకొని తగుచర్యలు గైకొనవలసినదిగా కోరింది.

1) మా పరిశీలన మేరకు-ప్రజాభిప్రాయ సేకరణ గురించి 1-2 పత్రికలలో నోటీసులు ప్రచురించడం, పత్రికా ప్రకటనలు జారీచేయడం, ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయితీ కార్యాలయాలల్లో అదీ కొన్ని చోట్ల మాత్రమే నివేదిక ఇంగ్లీషు ప్రతులు ఉంచడంవంటి నామమాత్రపు చర్యలు మినహా విస్తృత స్థాయిలో కరపత్రాలు, టముకు ద్వారా ఎక్కడా ప్రచారం జరగలేదు. ఈ సందర్భంగా పర్యావరణ ప్రభావం-సమస్యలపై ప్రజలలో అవగాహన కల్గించేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో అవగాహన సమావేశాలు నిర్వహించలేదు. పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక పూర్తి పాఠాన్ని తెలుగులో ప్రచురించి అందించకపోవడం వలన అందులోని అంశాలను తెలుసుకొనేందుకు, అధ్యయనం చేసే అవకాశం ప్రజలకు లేకుండా పోయింది. ఈ సమావేశంలో ఒక అవగాహనతో చర్చించగల, తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను వ్యక్తంచేసే అవకాశం ప్రజలకు లేకపోయింది. ఈ పరిస్థితులలో జరిగే ఇలాంటి అభిప్రాయసేకరణ సదస్సులకు తగు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరికి నిరసన తెలియజేస్తున్నాం.

2) ఓడరేవు కేంద్రంగా 10 కి.మీ.ల వృత్తాకార విస్తీర్ణంలో బుద్ధాలపాలెం, పొట్లపాలెం, కొత్తపూడి, గోకవరం, తాళ్ళపాలెం, మంగినపూడి, తవినపూడి, గోపువానిపాలెం, కరగ్రహారం, చిలకలపూడి (ఆర్), పోతేపల్లి, మచిలీపట్నం(ఆర్), రుద్రవరం, గుండుపాలెం, పల్లెతుమ్మలపాలెం మొత్తం 15 గ్రామాలు అధ్యయన ప్రాంతంలో ఉన్నాయని అన్నారు. ఏ గ్రామాలను దృష్టిలో ఉంచుకొని మచిలీపట్నం రూరల్ అన్నారో స్పష్టత లేదు. చిలకలపూడి, మచిలీపట్నం టౌన్‌లో భాగం కాబట్టి ఆ వూరుకు రూరల్‌గా ఏ గ్రామాలు లేవు, రూరల్ ఎందుకని పేర్కొన్నారో అర్థంకావటంలేదు. పైన పేర్కొన్న 15 గ్రామాలను పంచాయతీ గ్రామాలుగా అనుకుంటే పెదకరగ్రహారం లేదా చినకరగ్రహారం, పోలాటితిప్ప, గరాలదిబ్బ పంచాయతీలను విస్మరించారు. గ్రామాలుగా తీసుకుంటే ఇంకా చాలా గ్రామాలు ముఖ్యంగా మత్స్యకారులు నివసించే గ్రామాలు వదిలేశారు. ఎందుకిలా జరిగింది? గ్రామాలలో వ్యవసాయం, చేతివృత్తుల వారిని, ఇతర పనివారలను మెయిన్ వర్కర్స్, మార్జినల్ వర్కర్స్, నాన్ వర్కర్స్ అంటూ కేటగరైజ్ చేయడంలో గందరగోళం ఉంది. చేపల వేటపై ఆధారపడే మత్స్యకారులను గుర్తించడంలో లోపం ఉంది. పల్లెతుమ్మలపాలెం, పోలాటితిప్ప, గరాలదిబ్బ, గిలకల దిండి, క్యాంప్‌బెల్‌పేట, పల్లెపాలెం, (చినకరగ్రహారం శివారు), తాళ్ళపాలెం, సత్రంపాలెం, గిరిపురం(బీచ్) గ్రామాలలో సుమారు 10వేల మందికి పైగా మత్స్యకారులు నివసించుచున్నారు. ఈ అంశాన్ని ఉద్దేశ్య పూర్వకంగానే విస్మరించారని మేము భావిస్తున్నాం.

ఎందుకంటే- పోర్టు నిర్మాణ పనులలో ముఖ్యంగా పూడిక (డ్రెడ్జింగ్) తీయు కాలంలో సముద్ర గర్భంలో ఉండే వివిధ రకాల మత్స్యరాశులు(అధ్యయనకర్తలు ఈ విషయాన్ని గుర్తించారు) దూరంగా తరలిపోతాయి. ఇంకొక విషయం ఓడరేవు నిర్మాణకాలం, పోర్టు కార్యకలాపాలు జరిగే కాలంలో ఓడరేవు కేంద్రంగా వృత్తాకార విస్తీర్ణంలో ఎంతదూరం వరకు బఫర్‌జోన్ మరియు రక్షిత లేదా నిషేధిత ప్రాంతంగా గుర్తించారు? ఈ విషయాన్ని నివేదికలో ఎక్కడా స్పష్టంచేయలేదు. కృష్ణపట్నం ఓడరేవులో సముద్రంలో 25 కి.మీ. వరకు రక్షిత స్థలంగా నిర్ణయించారు. ఈ పరిధిలో చేపల వేటను నిషేధించారు. కాబట్టి ఈ అంశాన్ని విస్పష్టంగా చెప్పాలి. పోర్టు నిర్మాణకాల, అనంతరం పోర్టు కార్యకలాపాలు జరిగే కాలంలో మత్స్యకారులకు సముద్రంలో చేపలవేట సాధ్యంకాదు, వారి మనుగడ ప్రమాదంలో పడుతుంది. ఈ పరిస్థితిలో వారి ఉపాధికి, జీవనానికి మీరిచ్చే హామీ ఏమిటి? పోర్టు నిర్మాణ కాలంవరకు చేపల వేటపై ఆధారపడే ప్రతి మత్స్యకారుల కుటుంబానికి ఆదాయం, జీవనవ్యయం(కనీస ప్రమాణాలతో) దృష్టిలో ఉంచుకొని గరిష్టంగా నష్టపరిహారాన్ని చెల్లించాలి. నిర్మాణ అనంతరము ప్రతి కుటుంబానికి అర్హతలకు తగిన ఉద్యోగం ఇవ్వాలి. ఇందుకు ప్రభుత్వం, కంపెనీ వారు రిజిస్టర్డు ఎగ్రిమెంటు ద్వారా హామీ ఇవ్వాలి.

3) పోర్టు అభివృద్ధి కొరకు ఏ గ్రామాల పరిధిలో ఎంత భూమి కేటాయించబడిందో స్పష్టం చేయలేదు. నివేదికలో పోర్టు హార్బర్ ప్రాంతంలో బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంటు, జనరల్ కార్గో అవసరాలకు డంపింగ్ స్టాక్ యార్డులు, వాటర్ రిజర్వాయర్, పంపుహౌస్, రిసీవింగ్ సబ్‌స్టేషన్, పోర్టు అభివృద్ధికొరకు 2012 నాటికి 267.50 ఎకరములు, 2030 నాటికి 615 ఎకరములు అవసరం అని చాప్టర్ 2.12 లాండ్ యూస్ ప్లాన్ నందు స్పష్టం చేశారు. ఈ భూమి ఏ గ్రామాల పరిధిలోకి వస్తుంది? ప్రభుత్వ భూములా? ప్రయివేటు భూములా అని స్పష్టంచేయాలి. ఈ భూముల్ని రైతులు సాగుచేసు కుంటూ అనుభవిస్తుంటే మార్కెట్ విలువకు 50% అదనంగా నష్టపరిహారం చెల్లించాలి. ఈ నష్టపరిహారాన్ని ప్రయివేటు, అసైన్డ్, అన్ అసైన్డ్, ఎంజాయ్‌మెంట్ భూములకు వర్తింపచేయాలి. పేద, సన్నకారు, చిన్నకారు, మధ్యతరగతి రైతులకు ప్రత్యామ్నాయంగా భూమికి, భూమి ఇవ్వాలి. పోర్టు నిర్మాణ, కార్యకలాపాల నిర్వహణ బి.ఓ.టి. పద్ధతిలో జరుగుతుందని చెప్పారు. కాబట్టి ఈ బి.ఓ.టి. పద్ధతిననుసరించి కంపెనీ వారు పేర్కొన్న విధంగా 615 ఎకరాలు మాత్రమే కేటాయించాలి. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన నవీన్‌మిట్టల్‌గారు పోర్టుకు 6632 ఎకరాలు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. అవసరానికి మించి భూమిని ఎందుకు కేటాయిస్తున్నారు? అవసరానికి మించి భూమి కేటాయించడాన్ని మేము వ్యతిరేకిస్తున్నాం. గతంలో కర్నూలు అసెంబ్లీలో తీరప్రాంత భూములను స్థానిక పేదలకు ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసారు. ఆ తీర్మానానికి అనుగుణంగా తీరప్రాంత బంజరు భూములను స్థానిక పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాము.

4) ప్రతిపాదిత పోర్టు ప్రాజెక్టు వలన పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతాయి. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు, పర్యావరణ సమస్యల నివారణకు తగిన కార్యాచరణ పద్ధతులను అవలంబించాల్సిన అవసరం ఉంది. నివేదికలో పేర్కొన్న ప్రకారం-భవన నిర్మాణ సామగ్రి రవాణా సందర్భముగా ధూళి, ధ్వని, వాహనాల జోరు; నిర్మాణ సమయంలో సంభవించే ధ్వని పరికరాల జోరు, నీటి వనరుల ఎద్దడి, భూఉపరితలంపై జరిగే నిర్మాణం వలన భూసారం కోల్పోవడం, తీరప్రాంతంలో జరిగే మార్పులు, పూడిక సమయంలో వచ్చే బురద, నీటి నాణ్యతలో జరిగే మార్పులు, సముద్ర ప్రాంత ప్రభావం, ధ్వని సమస్యలు, పూడిక తీసే యంత్రం ద్వారా వచ్చే ఉద్ధారం, వ్యర్థజలాల అన్‌లోడింగ్‌లో ఉత్పన్నమయ్యే ధూళి సమస్యలు మొదలగు కాలుష్య నివారణ చర్యలు సమర్థవంతంగా చేపడతామని అన్నారు. కాలుష్య నివారణ చర్యలు అన్ని సందర్భాలలో కాంట్రాక్టర్ చేపడతారని చెబుతున్నారు.

ఆ కాంట్రాక్టర్ నివారణ చర్యలు తీసుకోవడంలో వైఫల్యం చెందితే ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందా! ఏవిధమైన చర్యలు తీసుకుంటుందో చెప్పాలి. పర్యావరణ కాలుష్య నివారణ చర్యలు ఉన్నతస్థాయి ప్రమాణాలతో తీసుకొనేందుకు, ఆ చర్యలు సక్రమంగా అమలు జరిగేందుకు సంబంధిత నిపుణులతో, ప్రజాస్వామిక వాదులతో కూడిన కమిటీ పర్యవేక్షణలో జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఆ కమిటీకి చట్టబద్ధత కల్పించాలి.

5) త్రాగునీరు, భవన నిర్మాణం అవసరాలకు తరకటూరు రక్షిత మంచినీటి కేంద్రం నుండి అవసరమైన నీరు తీసుకుంటామని అన్నారు. మచిలీపట్నం టౌన్, గ్రామాలలో ఇప్పటికే నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఈ స్థితిలో అక్కడ నుండి నీరు తీసుకోరాదని, అందుకు కంపెనీవారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము. ధూళి, అగ్ని ప్రమాదాల నివారణకు కావలసిన 3500 ఘనపు మీటర్ల నీటికి భూగర్భ జలాలకై ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. దీనివలన భూగర్భ జలాలలో మార్పు వచ్చి మంచినీరు స్థానంలో ఉప్పునీరు చేరే ప్రమాదం ఉంది. దీనిని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.

6) పోర్టు నిర్మాణం, కార్యకలాపాల కొరకు యంత్రాలు, మెటీరియల్ సరఫరా కొరకు ఎన్‌హెచ్ 9 జాతీయ రహదారి సుల్తానగరం నుండి బైపాస్ రోడ్డు మీదుగా ఎస్‌హెచ్-46, ఎన్‌హెచ్-214ఎ మంగినపూడి బీచ్ రోడ్డు మీదుగా దక్షిణ, పశ్చిమ దిశగా పోర్టు ప్రవేశం వరకు రోడ్డు నిర్మాణం చేస్తారు. అలాగే పోర్టు వరకు రైలు రహదారిని ఏర్పాటు చేస్తారు. ఈ సదుపాయాలన్నీ ప్రభుత్వమే చేపడుతుందా! లేక కంపెనీ చేపడుతుందా! స్పష్టంచేయాలి. పోర్టు నిర్మాణం కార్యకలాపాల కాలంలో యంత్రాలు, వాహనాల రవాణా, మెటీరియల్, రవాణా వలన జాతీయ రహదారులు, ఇతర రహదారులు ధ్వంసం అయ్యే అవకాశం ఉంది, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? రహదారుల మరమ్మత్తులను కంపెనీయే చేపట్టాలి. రహదారుల కొరకు భూసేకరణ జరిగితే పైన పేర్కొన్న విధముగా భూమి కోల్పోయే వారికి నష్టపరిహారం ఇవ్వాలి.

7) పోర్టును సెజ్‌గా ఆమోదించారా? కంపెనీకి కల్పిస్తున్న పన్నుల రాయితీలు ఏమిటి? ప్రజా సీపోర్టు ప్రైవేట్ కంపెనీ మైటాస్ కన్సార్టియం ప్రమోట్ చేసిన కంపెనీ. ఈ కంపెనీలో భాగస్వామ్య వాటాదారులుగా ఏయే కంపెనీలు ఉన్నాయి? అవి స్వదేశీ కంపెనీలా! విదేశీ కంపెనీలా! అన్న విషయం బహిరంగపరచాలి. పోర్టుకు అనుబంధ పరిశ్రమలు వస్తాయని చెబుతున్నారు, ఏ ఏ పరిశ్రమలు వస్తాయి? వాటికి కేటాయించే భూమి ఎంత? పోర్టు అభివృద్ధి కొరకు రహదారులు, నీరు, విద్యుత్, భూమి తదితర మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వం ఉచితంగా చేస్తుందా! రాయితీలు కల్పిస్తుందా! భూమిని ఎంతకు లీజుకు ఇస్తున్నారు? పోర్టు నిర్మాణానికి పెట్టుబడి ఎంత? ఈ పెట్టుబడిని ఏవిధంగా సేకరిస్తారు? ఈ విషయాలన్నింటి గురించి బహిరంగంగా చెప్పాలి. పోర్టు నిర్మాణాన్ని సెజ్‌గా ఏర్పాటు చేయడానికి మేము వ్యతిరేకం. సెజ్‌గా ఆమోదించరాదు. ప్రాజెక్ట్ రిపోర్టును ప్రజలకు పంపిణీ చేయాలి, ఈ కంపెనీతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పంద వివరాలను బహిరంగ పర్చాలి.

8) పర్యావరణ ప్రభావ సమస్యలపై అధ్యయనాన్ని ప్రైవేట్ కంపెనీ అయిన మెస్సర్స్ కన్సల్టింగ్ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ వారితో చేయించారు. నేషనల్ ఇంజనీరింగ్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, నాగపూర్ వారిచే అధ్యయనం ఎందుకు చేయించలేదు? ఇలా చేయడంవలన ప్రజల ప్రయోజనాలు విస్మరించబడతాయి, కంపెనీ ప్రయోజనాలు కాపాడ బడతాయి. ఈ విధంగా ప్రభుత్వం ఎందుకు వ్యవహరిస్తుందో చెప్పాలి. ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును మేము వ్యతిరేకిస్తున్నాము.

పైన పేర్కొన్న అంశాలను విచారించి తగు చర్యలు ప్రజోపయోగంగా తీసుకోవల్సిందిగా మేము డిమాండ్ చేస్తున్నాము. ◈

కృష్ణా సిమెంట్స్... (12వ పేజీ తరువాయి)

నిరాహారదీక్షల శిబిరాన్ని కార్మికులు ప్రారంభించారు. రోజుకు ఐదుగురు కార్మికుల వంతులన ఈనాటికీ అక్కడ నిరాహారదీక్షా శిబిరం కొనసాగుతూనే వుంది. నిత్యం వివిధ సంఘాలు, పార్టీలు మద్దతు తెలుపుతూ పాల్గొంటున్నారు. కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌ను, స్థానిక మంత్రి మురుగుడు హనుమంతరావును కలిసి కార్మికులు పలు దఫాలుగా కోరారు. కార్మికులను-ఎన్‌ఆర్‌ఐ యజమాన్యానికి మధ్య చర్చలు ఏర్పాటు చేస్తామని వారు హామీ ఇచ్చారు.

ప్రజలకు వైద్యసేవలు అందించటం కోసం ఎన్‌ఆర్‌ఐ స్థాపించామన్న కార్మికులు ఆందోళన సాగిస్తూ వున్న భూమి కొనుగోలు వ్యవహారంలోకి దిగటం సరైనదేనా? అని ప్రశ్నిస్తూ కార్మికుల పోరాటానికి మద్దతు తెలుపుతూ చట్టపరంగా; జీవితాంతం ఫ్యాక్టరీలో పనిచేయడం-కార్మికుల శ్రమఫలాలే పెట్టుబడులుగా-ఆస్తులుగా అనే సత్యం ఆధారంగా కార్మిక సంఘంలో, కార్మిక కుటుంబాలతో 'పరిహారం' గురించి ఒప్పందం చేసుకోవాలి అని చెబుతూ ఎపిఎఫ్‌టియు నుండి కరపత్రాలు ప్రచురించి విస్తృతంగా పంపిణీ చేశారు. కార్మికవాడల్లోనూ, సాధారణ ప్రజానీకం, ఆలోచనాపరుల మధ్య, ఎన్‌ఆర్‌ఐ హాస్పటల్ మరియు కళాశాలలోనూ విస్తృతంగా కరపత్రాలు పంపకం జరిగింది. ప్రజలలో కార్మికుల పోరాటానికి మద్దతు కూడగట్టడానికి కృషి సాగింది.

గత 15సంవత్సరాలుగా, కంపెనీ మూతపడిన కారణంగా ఛిన్నాభిన్నమైపోయిన కుటుంబాల తరపున, చదువులు, ఉజ్వల భవిష్యత్తు కోల్పోయిన పిల్లలందరి తరపున పిడిఎస్‌ఓ ఆధ్వర్యంలో 17.10.08న కృష్ణనగర్ పంచాయితీ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 100మందితో ప్రదర్శన నిర్వహించి నిరాహారదీక్షలు జరుగుతున్న శిబిరం వద్దకు వచ్చి కార్మికులది న్యాయమైన పోరాటమని, అందుకు విద్యార్థిసంఘం పూర్తి మద్దతు తెలుపుతుందని ప్రకటించారు.

25.10.08న పిడిఎస్ఒ-ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో 30మంది విద్యార్థులు యువకులతో కూడిన ప్రతినిధి బృందం ఎన్‌ఆర్‌ఐ యజమాన్యం యొక్క ప్రతినిధి-ఎన్‌ఆర్‌ఐ అకాడమీ అడ్మినిస్ట్రేటర్ అయిన శ్రీ రాజేశ్వరరావును కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కార్మికులకు నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఎన్‌ఆర్‌ఐ అకాడమీకి ఉందని, అందుకు తగిన విధంగా చర్యలు చేపట్టమని కోరారు. ప్రజలపై ఆధారపడి-ప్రజలకు వైద్యసేవలందించడానికంటూ ఏర్పడిన ఎన్‌ఆర్‌ఐ యజమాన్యం పెట్టుబడిదారుల్లా, రియల్‌ఎస్టేట్ వ్యాపారుల్లా వ్యవహరించడం, అక్రమంగా కార్మికులు ఆధారపడి ఉన్న భూమిని స్వాధీనం చేసుకోవాలనుకోవడం తగదని విజ్ఞప్తి చేశారు.

అదేరోజు (25.10.08) సాయంత్రం కలెక్టర్ ఆదేశంతో ఆర్‌డిఓ, తాడేపల్లి ఎమ్మార్వో, రూరల్ డిఎస్‌పి, సిఐల ఆధ్వర్యంలో కార్మిక యూనియన్ ప్రతినిధులను, ఎన్‌ఆర్‌ఐ వారిని చర్చలకు పిలవగా ఎన్‌ఆర్‌ఐ యజమాన్యం నిర్ణయాధికారం కల ప్రతినిధులను పంపక, సూపర్‌వైజర్‌స్థాయి ఉద్యోగులను పంపింది. ఈ పద్ధతిలో చర్చలు సాగవని-తిరిగి మరోసారి చర్చలకు పిలుస్తామని ఆర్.డి.ఓ ప్రకటించారు.

కార్మికులు సాగిస్తున్న రిలే నిరాహారదీక్షలు సాగుతున్నాయి. ఈ ఆందోళన కార్మికుల ముందు, ప్రజల ముందు చర్చకు ఎన్నో విషయాలను తీసుకు వచ్చింది. కోర్టులు-చట్టాలు-వాటి పాత్ర ఏంటి? ఈ సమాజంలో అవి ఎవరికి అనుకూలంగా పనిచేస్తాయి అనే విషయాలు; అలాగే అధికార కాంగ్రెస్ ఎం.పి ప్రతిపక్ష టిడిపి నాయకుడు(ఆలపాటి రాజేంద్రప్రసాద్) ఇద్దరూ ప్రభుత్వం అధికారం కోసం ఒకరితో ఒకరు సంఘర్షణ పడుతూ, విమర్శలు గుప్పించుకొనే వీరు ఈ భూమి కొనుగోలు వ్యవహారంలో ఉన్నారనే అంశం, కార్మికుల శ్రమఫలాన్ని దోచుకునే విషయంలో యిరువురూ ఒకటి అవడం అనేది, వీరి స్వభావాన్ని తేటతెల్లం చేస్తున్నది. కార్మికుల తమ ఐక్య పోరాటం ద్వారా మాత్రమే, రైతాంగ, ఇతర వర్గాల విస్తృత సంఘీభావం ద్వారా మాత్రమే వారు తమ హక్కుల్ని-డిమాండ్లను సాధించుకోగలరని ఈ అనుభవం హెచ్చరిస్తోంది. ◈

రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) ప్రచురణ

వార్షిక సంచిక-2007

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ యోధులకు జేజేలు

తెలంగాణ, నగ్జల్బరీ, శ్రీకాకుళ, తెభాగ, వర్లి పోరాటాల వారసత్వాన్ని కొనసాగిద్దాం

వెల: రు. 30.00

ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్,
కారల్‌మార్క్స్ రోడ్,
జలీల్ వీధి, విజయవాడ-2.

KLVA 102M243

Janasakti (Communist Revolutionaries'Fortnightly) Printed Matter Book-Post RNI No.8315/63 H/VJ-077/2007-09

చీరాల వాన్‌పిక్ కార్యాలయం ముట్టడి- ఒక ప్రైవేట్ కార్పోరేషన్ కార్యాలయానికి పోలీసుల రక్షణ

వాన్‌పిక్ కార్యాలయం వద్ద మోహరించిన పోలీసులు-బొజ్జా తారకం, విజయకుమార్, తదితర ఆందోళనకారుల అరెస్టు

చీరాల 15.10.2008

మోటుపల్లి పోర్టు, కోస్తాకారిడార్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ మోటుపల్లి పోర్టు, కోస్తాకారిడార్ వ్యతిరేక కమిటి, సిపిఐ(ఎం-ఎల్), ఆర్.పి.ఐ, సి.పి.ఐ, సి.పి.ఐ (ఎం) తదితర పార్టీలు, ప్రజాసంఘాల నాయకత్వాన గత 5 నెలలుగా తీరప్రాంత గ్రామాలలోని ప్రజలు తమ నిరసనను తెలియజేస్తున్నారు. భూసేకరణకు నియమించిన స్పెషల్ కలెక్టర్ శ్రీలతను, ఇతర అధికారులను గ్రామ పొలిమేరలలోనే అడ్డుకున్నారు. ప్రభుత్వం గ్రామాలలో గత రెండు నెలలుగా 144 సెక్షన్‌ను విధించి ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నది. ఈ పరిస్థితుల్లో మోటుపల్లి పోర్టు వ్యతిరేక, కోస్తాకారిడార్ వ్యతిరేక కమిటి 15వ తేదీ ఉదయం 10 గం॥లకు వాన్‌పిక్ బాధిత గ్రామమైన అడివీదిపాలెంలో సభ నిర్వహించి ప్రదర్శనగా చీరాల వచ్చి వాన్‌పిక్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రకటించింది. ఆ కార్యక్రమానికి పిలుపునిచ్చింది.

సిపిఐ(ఎం-ఎల్), సిపిఐ. సిపిఐ(ఎం), రిపబ్లికన్ పార్టీ, ప్రజాఫ్రంట్, తెలుగుదేశం, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటారని ప్రకటించింది. 13వ తేదీన పోర్టు వ్యతిరేక కమిటి నాయకులు శంకర్, పోలిరెడ్డి, సిపిఐ(ఎం-ఎల్) నాయకులు పింజల వెంకటసుబ్బారావు, లలితకుమారి, మరికొంతమంది కార్యకర్తలు సిపిఎం నాయకులు కొండయ్య మైకుతో అడివీధిపాలెం, మోటుపల్లి, కృష్ణనగర్, జీడిచెట్లపాలెం, కుంకుడుచెట్లపాలెం, రుద్రమాంబపురం, నిరీక్షణగిరి, రామచంద్రాపురం, పాతరెడ్డిపాలెం, కొత్తరెడ్డిపాలెం, సీతారాంపురం, సంగందిబ్బ గ్రామాల్లో వీధి మీటింగులు ద్వారా తీరప్రాంత ప్రజల జీవితాలను ఛిన్నాభిన్నం చేసే కోస్తాకారిడార్‌ను వ్యతిరేకించాలని, 15వ తేదీన వాన్‌పిక్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు తెలియచేశారు.

ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి 14వ తేదీ ఉదయం నుండే పోలీసు అధికారులు ప్రయత్నించారు. ప్రచారం చేస్తున్న కార్యకర్తలను 14న అరెస్టు చేశారు. వాన్‌పిక్ బాధిత గ్రామాల్లో వందలాదిమంది పోలీసులను, స్పెషల్ పోలీసులను మోహరించి, కార్యక్రమానికి వెళ్ళితే నాన్‌బెయిల్‌బుల్ కేసులు పెడతామని, అరెస్టులు, లాఠీఛార్జీలు జరుగుతాయని హెచ్చరికలు జారీ చేస్తూ గ్రామాల్లో, చీరాల పట్నంలో కవాతు నిర్వహించారు. చీరాల్లోకి ప్రవేశించే అన్ని మార్గాల్లో 14వ తేదీ రాత్రి నుంచే సోదాలు నిర్వహించారు. చీరాల్లో అడుగడుగునా పోలీసులు మోహరించారు. ఇంతటి పహారా మధ్య కూడా బాధిత గ్రామాల ప్రజలు 14వ తేదీ సాయంత్రం నుండే చీరాలకు చేరుకున్నారు. 15 ఉదయం 11 గం॥లకు చీరాలలోని కొత్తపేట నుండి బయలుదేరిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.నారాయణ, సిపిఐ(ఎం) నాయకురాలు రమాదేవి ఇతర నాయకులు, కార్యకర్తలను అక్కడనే అరెస్టు చేసి వివిధ స్టేషనులకు తరలించారు. టి.డి.పి నాయకులు పాలేటి రామారావును నిర్బంధించారు. రేపల్లె, నిజాంపట్నం ప్రాంతం నుండి వచ్చిన శోభారాణి, సత్యప్రకాశ్, ముమ్మనేని వెంకట సుబ్బయ్య, వేమినేని వెంకటరమణ తదితరులని నిర్బంధంలోకి తీసుకున్నారు.

మోటుపల్లి పోర్టు, కోస్తా కారిడార్ వ్యతిరేక కమిటి నాయకులు పి.శంకర్, సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ గుర్రం విజయకుమార్, ప్రకాశం జిల్లా నాయకులు లలితకుమారి, పింజలసుబ్బారావు, రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బొజ్జా తారకం, ప్రజాఫ్రంట్ నాయకులు సూర్యనారాయణ, మోటుపల్లి, కృష్ణనగర్ బాధిత గ్రామాలకు సంబంధించిన ప్రజలు సిపిఐ(ఎం-ఎల్) కార్యకర్తలు, పోలీసులను దాటుకొని తీరప్రాంత ప్రజల జీవితాలను ఛిన్నాభిన్నం చేసే వాన్‌పిక్ గోబ్యాక్, విదేశీ సంస్థలకు మన పోలీసులు కాపలా వద్దు వద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఒక్కసారిగా వాన్‌పిక్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యకర్తలు గేటు దూకి వాన్‌పిక్ కార్యాలయంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. పోలీసులు కార్యకర్తలపై, ప్రజలపై లాటీలతో బాదుతూ దొరికిన వారిని దొరికినట్టు ఈడ్చుకెళ్తూ, బలవంతంగా వాహనాల్లోకి నెట్టారు. కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తీవ్ర పెనుగులాట సాగింది. వాన్‌పిక్ కార్యాలయానికి చేరుకున్న వారందరిని నిర్బంధంలోకి తీసుకొని వేరు వేరు స్టేషన్‌లకు తరలించారు. అయినా అరెస్టులను, నిర్బంధాన్ని ఖండిస్తూ ప్రజలు రాస్తారోకో నిర్వహించారు.

సభ: నిరసన కార్యక్రమాలు ముగిసిన తర్వాత 200మందితో చీరాలలోని పాలేటి రామారావు హాస్పటల్ ఆవరణలో సభ జరిగింది. రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బొజ్జా తారకం మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు నిరసన తెలియచేసే హక్కును నిరోధించడాన్ని తీవ్రంగా ఖండించారు. గతంలో ఈ ప్రాంతంలో వలసవాదానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలను గుర్తు చేస్తూ వలసవాదానికి, వాన్‌పిక్‌కు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాలని, ఆ పోరాటానికి తన సహాయ సహకారాలు పూర్తి అండదండలు వుంటాయని హామీ ఇచ్చారు. సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వాన్ని, పోలీసు అధికారుల నిర్బంధాన్ని ఎదుర్కొని మనం అనుకున్న విధంగా ఆందోళన సాగించాం. అనేక నెలలుగా మనం గ్రామాల్లోకి వెళ్ళి ప్రచారం సాగించాం. దీని ఫలితమే ప్రజలు ఈ రోజు ఇంత చొరవ ప్రదర్శించారు. ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా తీరప్రాంత భూములను, సహజ సంపదలను, విదేశీ సంస్థలకు బలవంతంగా అప్పజెప్పడానికి ప్రభుత్వం పూనుకొంటుంది. ఈ విధానాలను ప్రజలు సంఘటితంగా అనేక ప్రాంతాల్లో ప్రతిఘటిస్తున్నారు. ఇంత నిర్బంధంలో కూడా మీరు చూపిన పోరాటం మన భవిష్యత్ ఉద్యమాలకు మార్గదర్శకం కావాలి. ఐక్యంగా వాన్‌పిక్‌ను తరిమికొట్టమని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.నారాయణ, కా॥ విజయకుమార్, ప్రజాఫ్రంట్ నాయకులు సూర్యనారాయణ, సిపిఐ.యం నాయకులు రమాదేవి, టిడిపి చీరాల ఇన్‌ఛార్జి డా॥పాలేటి రామారావు, కోస్తా కారిడార్ వ్యతిరేక కమిటి నాయకులు శోభారాణి, మోటుపల్లి పోర్టు, కోస్తాకారిడార్ వ్యతిరేక కమిటి నాయకులు శంకర్, పోలిరెడ్డి తదితరులు మాట్లాడారు.

పోలీసు పాలన:

వాన్‌పిక్ బాధిత గ్రామాల్లోను, చీరాల దాని చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఎక్కడ చూసినా పోలీసులే, అడుగడుగున, తనిఖీలు నిర్వహిస్తూ; ఎక్కడ ముగ్గురు గుమికూడినా ప్రశ్నిస్తూ, ప్రజలను భయాందోళనలకు గురిచేశారు. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, ప్రధాన రహదారుల్లో ప్రకాశంజిల్లా ఎస్పీ నవీన్‌చంద్ర నాయకత్వంలో 1000 మంది దాకా పోలీసులు మోహరించారు. సామాన్య ప్రజానీకం రోడ్డు మీదకు రావడానికి భయపడే వాతావరణాన్ని నెలకొల్పారు. 15వ తేదీ ఉదయం నుండే చీరాలలో యుద్ధ వాతావరణం నెలకుంది. చీరాల ఉడ్ నగర్‌లో అద్దె భవనంలో వాన్‌పిక్ కార్యాలయం వుంది. ఒక ఏఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, 7గురుసిఐలు 22మంది ఎస్సైలు, 50 మంది హెడ్‌కానిస్టేబుల్స్, 145మంది కానిస్టేబుల్స్ 50మంది మహిళా కానిస్టేబుల్స్, 150మంది హొంగార్డులు, ఎపిఎస్పీకి చెందిన ఒక ప్లటూన్ ఆ వాన్‌పిక్ కార్యాలయం చుట్టూనే మోహరించారు. అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరిని ప్రశ్నిస్తూ, ప్రతి వాహనాన్ని, తనిఖీ చేశారు. లాఠీఛార్జీ, కాల్పులు జరపడానికిగాను తగిన ఆదేశాలు యివ్వటానికి ఒంగోలు ఆర్డీవో గుప్తాను చీరాలకు రప్పించారు. ఈ ప్రాంతంలో 14వతేదీ రాత్రి నుండి 15 సా॥ వరకు పోలీసు పహారా సాగింది. ఈ పరిస్థితిని పరిశీలిస్తే ప్రజల ప్రయోజనాలను ప్రక్కనబెట్టి విదేశీ బహుళజాతి సంస్థల ప్రయోజనాలు నెరవేర్చటానికి పాలకులు ఎంతటికైనా తెగిస్తారనేదానికి 15వ తేదీ చీరాల సంఘటనే సాక్ష్యం. ఇంత నిర్బంధంలో కూడా ప్రజలు చీరాలకు చేరుకొని రకరకాలుగా తమ నిరసనను తెలియజేశారు. వాన్‌పిక్‌ను ప్రజలు ఎంత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారో మరోసారి తెలియపర్చారు.

తమకు రావలసిన బకాయిలు, పరిహారం కోసం ఆందోళన సాగిస్తున్న కృష్ణా సిమెంట్స్ కార్మికులు

కె.సి. వర్క్స్ సిమెంట్ కంపెనీ 1993లో అక్రమంగా లాకౌట్ చేసిన యజమాన్యం, నిర్దాక్షిణ్యంగా కార్మికులను గెంటివేసింది. 60సం॥లపైగా తరతరాలుగా కంపెనీలో తమ శ్రమను ధారపోస్తూ కంపెనీ అభివృద్ధికి కారణమైన కార్మికుల వేతనాలను అలవెన్సులను, భత్యాలను సైతం ఎగ్గొట్టిన విషయం తెలిసినదే. ఆనాటి నుండి కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం, నష్టపరిహారం కోసం, జీవనభద్రత కోసం వివిధ రూపాల్లో పోరాడుతూనే వున్నారు. ఈ కాలంలో అనేకమంది కార్మికులు పొట్టచేతపట్టుకొని దూరప్రాంతాలకు వలసలు పోయారు. ఆర్థిక సమస్యలతో కొన్ని కుటుంబాలు విచ్ఛిన్నమైపోయాయి. పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు, ఆరోగ్యాలు అస్తవ్యస్తమైపోయాయి. ఆకలితో, అనారోగ్యాలతో ఇప్పటికి 50 మంది వరకు కార్మికులు మరణించారు.

దుర్భర జీవితాలను కార్మికులు అనుభవిస్తుండగా వారికి సంబంధించిన కేసు కోర్టులో నడుస్తుండగానే కార్మికులు ఆందోళన చేస్తూ వుండగానే యజమాన్యం ఆస్తులు అమ్మకానికి పూనుకొన్నది. కంపెనీకి చెందిన ఫ్యాక్టరీ స్థలంతో సహా ఆనుకొని వున్న కార్మికుల క్వార్టర్స్‌తో సహా 100 కోట్లపైగా విలువ చేసే భూమిని (137 ఎకరాలు) అక్రమత పద్ధతిలో, చట్టాలలో ఉన్న లొసుగులనుపయోగించికొని అమ్మకానికి పెట్టగా ఎన్‌ఆర్ఐ అకాడమీ వారు ఆ భూమిని కారుచౌకగా 10 కోట్లకు ఇటీవలె ఎగరేసుకెళ్ళారు. భూమి హక్కుదారుగా, దానిని స్వాధీనం చేసుకోవడానికి ఎన్‌ఆర్ఐ వారు బుల్‌డోజర్లతో, పోలీస్ ఫోర్స్‌తో అక్టోబర్ మొదటి వారంలో భూమి వద్దకు వచ్చారు. తమకు న్యాయం ఏ మేరకైనా జరుగుతుందని, ఇప్పటిదాకా ఆశతో వున్న కార్మిక కుటుంబాలు మిగిలిన ఫ్యాక్టరీ ఆస్తులు కూడా చేజారుతుండటవతో ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాయి. 100మంది కార్మికులు, ఫ్యాక్టరీ స్థలానికి చేరుకుని బుల్‌డోజర్లకు అడ్డంపడ్డారు. స్వాధీనాన్ని అడ్డుకున్నారు. స్థానిక సిఐ జోక్యం చేసుకొని కార్మికులకు, ఎన్‌ఆర్ఐ యజమాన్యానికి మధ్య చర్చలు నిర్వహించేందుకు కృషి చేస్తానంటూ కార్మికులు ఆందోళనను నిలుపు చేయించారు.

తర్వాత క్రమంలో ఎటువంటి చర్చలూ జరుగకపోగా ఎన్‌ఆర్ఐ యజమాన్యం స్థలం చుట్టూ కంచె వేయడానికి కూలీలు, సామానుతో రావడం;- కార్మికులు నివాసం వుంటున్న క్వార్టర్లను సైతం కూలగొట్టడానికి ప్రయత్నం చేయడంతో కార్మికులు మరోమారు ఆందోళనకు పూనుకున్నారు.

కె.సి.వర్క్స్ కంపెనీ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో సిపిఐ, సిపిఎం, 'న్యూడెమోక్రసీ', టిడిపి, కాంగ్రెస్ పార్టీల నాయకులు పిడిఎస్‌ఐ, ఎన్‌వైఎస్, ఎపిఎఫ్‌టియు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) వివిధ రాజకీయ నాయకుల పక్షాలు, ప్రజాసంఘాలతో అఖిలపక్ష కమిటీగా ఏర్పడి కార్మికులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం సాగించాలని నిర్ణయించారు. అక్టోబర్ 10న యూనియన్ తరపున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ కరపత్రం ప్రచురించి 300 మంది కార్మికులు-కార్మిక కుటుంబాలతో తాడేపల్లి ఎంఆర్ఓ ఆఫీసు వరకు ప్రదర్శన నిర్వహించి-అక్కడ ధర్నా చేశారు. ఈ ధర్నాలో కార్మికులు పోరాటానికి మద్ధతు తెలుపుతూ సిపిఐ (ఎం-ఎల్) నాయకులు కా॥సింహాద్రి లక్ష్మారెడ్డి, ఇతర పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్వోకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. 11.10.08 నుండి సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ ఆఫీసు కార్యాలయం వద్ద రిలే,

(తరువాయి 11వ పేజీలో)

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet, Vijayawada-2.
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిరక్షణపత్రిక

పుస్తకం సంఖ్య	KLVA102M243
పుస్తకం పేరు	జనశక్తి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	13
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	No
[illegible] పేజీలు	No
[illegible] చేసినది	Priyanka
పేజీలు [illegible]	Priyanka
స్కాన్ చేసినది	[illegible]
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good